గురువారం 15-12-2022

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 264



'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'




మెస్సీ మాయ..
ప్రపంచకప్ ఫైనల్‌లో అర్జెంటీనా.. సెమీస్‌లో క్రొయేషియాపై గెలుపు - 14లో



ఏపీలో ఆర్జాస్ స్టీల్ విస్తరణ
రూ. 350 కోట్లతో అనంతపురం జిల్లాలో ప్లాంట్ విస్తరణ - 15లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




హ్యాకింగ్ చైనా ముఠాల పనే..!
ఢిల్లీ ఎయిమ్స్ సర్వర్లపై సైబర్ దాడికి పాల్ప డింది చైనా, హాంకాంగ్ ముఠాలేనని అను మానిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.
వివరాలు 6లో ▸



వారసత్వ ముద్రను తొలగిస్తా
తమిళనాడు సీఎం స్టాలిన్ కుమారుడు ఉద యనిధి స్టాలిన్ మంత్రిగా ప్రమాణం చేశారు. వారసత్వ ముద్రను తొలగిస్తానన్నారు.
వివరాలు 6లో ▸



రాహుల్‌తో రఘురామ్ రాజన్
భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్‌తో పాటు ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కలిసి నడిచారు.
వివరాలు 6లో ▸



స్వలింగ వివాహాలు చట్టబద్ధం
అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన స్వలింగ వివాహాల బిల్లుపై అధ్యక్షుడు బైడెన్ సంతకం చేశారు.
వివరాలు 6లో ▸

అవుకు రిజర్వాయర్ వద్ద
రెండో టన్నెల్ రెడీ

ఫాల్ట్ జోన్‌లో 160 మీటర్ల మేర పనులు పూర్తి చేయని టీడీపీ సర్కార్

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సొరంగాన్ని పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- 'గాలేరు–నగరి' కాలువతో 20 వేల క్యూసెక్కుల తరలింపునకు లైన్ క్లియర్
- శ్రీశైలానికి వరద వచ్చే 15 రోజుల్లోనే గండికోట రిజర్వాయర్ నింపేందుకు మార్గం సుగమం.. దుర్భిక్ష రాయలసీమలో సాగునీటి సదుపాయాల మెరుగుదలలో సీఎం మరో అడుగు ముందుకు
- నిర్వాసితులకు పునరావాసం కల్పన ద్వారా ఇప్పటికే గండికోట, సీబీఆర్, పైడిపాలెం రిజర్వాయర్లలో గరిష్ట స్థాయిలో నీటి నిల్వ
- డయాఫ్రమ్‌వాల్‌తో మట్టికట్టలో లీకేజీలకు అడ్డుకట్ట ద్వారా బ్రహ్మం సాగర్‌లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ.. తద్వారా ఆయకట్టుకు భారీగా నీళ్లు



రెండో సొరంగాన్ని పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు

సాక్షి, అమరావతి: గాలేరు–నగరి సుజల స్రవంతి పథకం వరద కాలువలో అంతర్భాగమైన అవుకు రెండో సొరంగం(టన్నెల్)లో మిగిలిన పనులను ప్రభుత్వం పూర్తి చేసింది. దాంతో ప్రస్తుత డిజైన్ మేరకు వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని తరలించడానికి లైన్ క్లియర్ అయ్యింది. శ్రీశైలానికి వరద వచ్చే 15 రోజుల్లోనే గాలేరు–నగరి వరద కాలువ ద్వారా గండికోట రిజర్వాయర్‌ను నింపడానికి మార్గం సుగమమైంది. ఇది దుర్భిక్ష రాయలసీమలో సాగునీటి సౌకర్యాలను మరింత మెరుగు పరచడానికి దోహదం చేస్తుందని నీటి పారుదల రంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. శ్రీశైలానికి వరద వచ్చే రోజుల్లో రోజుకు 20 వేల క్యూసెక్కుల చొప్పున 30 రోజుల్లో 38 టీఎంసీలను
మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

చక్కని సాగుకు చిన్న డ్రోన్లు



ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీ విత్తు నుంచి పంట చేతికి వచ్చే వరకు అన్ని పనుల్లో వినియోగించే డ్రోన్ల బరువును 25 కేజీల నుంచి 250 గ్రాములకు తగ్గించింది. ఇప్పుడు అరచేతిలో ఇమిడిపోయేలా కేవలం 10 గ్రాముల బరువుండే డ్రోన్ల తయారీపై దృష్టి సారించింది.
వివరాలు 10 ▸

వేగులం కాదు సేవకులం..



'ఈనాడు' అవాస్తవ కథనాలపై గ్రామ, వార్డు వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిరసనలు, మానవహారాలు నిర్వహించి.. 'ఈనాడు' ప్రతులను దహనం చేశారు. తాము వేగులం కాదని, ప్రజలకు సేవకులమని స్పష్టం చేశారు.
వివరాలు 2 ▸

ఆస్తులు, అప్పులు విభజించండి

- షెడ్యూలు 9, 10లోని సంస్థలు.. మరో 12 సంస్థల ఆస్తులన్నీ తెలంగాణలోనే
- రాష్ట్రం విడిపోయి ఎనిమిదేళ్లు అయినా పంపకానికి నోచుకోలేదు
- విభజన కాని ఆస్తుల విలువ రూ.1,42,601 కోట్లు
- తద్వారా రాష్ట్రానికి నష్టం.. ఉద్యోగులకూ సమస్యలు
- సుప్రీంకోర్టులో ఏపీ పిటిషన్.. రేపు విచారణ



సాక్షి, ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10 లోని సంస్థలతోపాటు మరో 12 సంస్థల ఆస్తుల విభజన చేయాలంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కీలకమైన సంస్థలకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన జరగకపోవడం వల్ల ఆయా సంస్థల పనితీరుపై, ప్రజలపై ప్రభావం పడుతోందని పేర్కొంది. ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 ద్వారా సంక్రమించిన
మిగతా 2వ పేజీలో ▶

ఇప్పటం ఇళ్ల యజమానులకు
ధర్మాసనంలోనూ షాక్

- రూ.14 లక్షలు చెల్లించాలన్న ఉత్తర్వులపై అప్పీల్ కొట్టివేత
- సింగిల్ జడ్జి తీర్పు సబబేనన్న సీజే ధర్మాసనం.. అందులో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేం
- వాస్తవాలను తొక్కిపెట్టి న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేశారు
- ఇలాంటి వ్యాజ్యాలతో కోర్టుల సమయం వృథా
- వీటిని ప్రోత్సహిస్తే నిజమైన బాధితులకు అన్యాయం చేసినట్లే

2 లో

మార్గదర్శి ప్రధాన కార్యాలయంలో
సోదాలు

- తెలంగాణ పోలీసుల సహకారంతో హైదరాబాద్‌లో తనిఖీలు
- నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ.. చిట్టీల డబ్బులివ్వకుండా ఆంక్షలు
- 8 ఏళ్లుగా సమాచారం సైతం ఇవ్వని మార్గదర్శి
- నిధుల మళ్లింపు.. ఆర్థిక అక్రమాలపై ఆరా

3 లో

పాడి రైతులకు పండుగ



- పెరిగిన అమూల్ పాల సేకరణ ధరలు
- గరిష్ఠంగా గేదె పాలపై లీటర్‌కు రూ.3.37, ఆవు పాలపై రూ.1.73 చొప్పున పెంపు

2 లో

ఏపీకి 'జాతీయ ఇంధన పరిరక్షణ' అవార్డు

- రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అందుకున్న ఇంధన శాఖ
- రాష్ట్రంలో ఇంధన పొదుపు, సంరక్షణకు కేంద్రం ఫిదా
- బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే అభినందనలు

11 లో

క్లుప్తంగా...

మోడల్ స్కూళ్ల టీచర్లకు హెల్త్‌కార్డుల మంజూరు

సాక్షి, అమరావతి: మోడల్ స్కూళ్ల టీచర్లకు ప్రభుత్వం హెల్త్ కార్డులను మంజూరు చేసిందని ఎమ్మెల్సీ కల్పలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హెల్త్ కార్డులు మంజూరుపై ఆమె సీఎం వైఎస్ జగన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మోడల్ స్కూల్లో ఉన్నటువంటి వివిధ సమస్యలను ఇప్పటికే సీఎం పరిష్కరించారని, ఈ ఉపాధ్యాయులకు చాలా ఏళ్ల నుంచి ఉన్న హెల్త్‌కార్డుల సమస్యను కూడా తీర్చి వారికి అండగా సీఎం నిలిచారని పేర్కొన్నారు. దీనికి సహకరించిన విద్యాశాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

21న విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌ల పంపిణీ

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ (ఇన్‌ఫ్రా) కాటమనేని భాస్కర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఈ నెల 21వ తేదీన ట్యాబ్‌లను ఉచితంగా అందించనుంది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పంపిణీకి వీలుగా తగిన చర్యలు చేపట్టాలని డీఈవోలు, ఆర్జేడీలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ (ఇన్‌ఫ్రా) కాటమనేని భాస్కర్ బుధవారం ఆదేశాలిచ్చారు. విద్యార్థులను అత్యున్నత సామర్థ్యాలతో ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దడంలో భాగంగా వారికి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందించాలని ప్రభుత్వం ఇంతకు ముందు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఏటా 8వ తరగతికి వచ్చే విద్యార్థులకు వీటిని అందిస్తారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ వీటిని సమకూర్చనున్నారు. మొత్తం 5 లక్షల మందికి పైగా విద్యార్థులు టీచర్లకు ట్యాబ్‌లు అందనున్నాయి. ఈ నెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ట్యాబ్‌ల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఇప్పటికే ఆయా మండల కేంద్రాలకు వీటిని చేర్చారు. ట్యాబుల ద్వారా బోధనకు సంబంధించి టీచర్ కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమం డిసెంబర్ 19న జరగనుంది.

రాష్ట్రానికే తలమానికం.. శ్రీశైలం-ఈగలపెంట రోప్‌వే

పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ

సాక్షి, అమరావతి: ఏపీలో రోప్‌వే పర్యాటకం అభివృద్ధికి అపార అవకాశాలున్నాయని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ అన్నారు. బుధవారం శ్రీశైలం-ఈగలపెంట రోప్‌వే ప్రాజెక్టుపై ఎన్‌హెచ్‌ఏఐ సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) పరిధిలోని నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంలోని ప్రతిపాదిత రోప్‌వే ప్రాజెక్టుకు భవిష్యత్తులో పర్యాటక ఆదరణ లభిస్తుందన్నారు. తెలంగాణలోని ఈగలపెంట నుంచి శ్రీశైలం డ్యాం మీదుగా కృష్ణా నదిపై శ్రీశైలానికి రోప్‌వే రాష్ట్రానికే తలమానికంగా మారనుందన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ కె.కన్నబాబు పాల్గొన్నారు. కాగా, కేంద్రం పర్వతమాల ప్రాజెక్టులో భాగంగా రోప్‌వేలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక శాఖ 26 ప్రతిపాదనలు పంపించింది. తొలి దశలో శ్రీశైలం రోప్‌వే ప్రాజెక్టుకు ఎన్‌హెచ్‌ఏఐ నోడల్ ఏజెన్సీ నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌తో ఎంవోయూ చేసుకుంది.

ఇప్పటం ఇళ్ల యజమానులకు ధర్మాసనంలోనూ షాక్

రూ.14 లక్షలు చెల్లించాలన్న ఉత్తర్వులపై అప్పీల్ కొట్టివేత



సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామానికి చెందిన కొందరు ఇళ్ల యజమానులకు హైకోర్టు ధర్మాసనం సైతం గట్టి షాకిచ్చింది. రోడ్డు మార్జిన్లను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టడమే కాకుండా వాటిని కూల్చివేసేందుకు అధికారులు నోటీసులిచ్చినా ఆ విషయాన్ని దాచిపెట్టి మధ్యంతర ఉత్తర్వులు పొందిన ఇళ్ల యజమానులు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఖర్చులు విధిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఈమేరకు సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ 14 మంది ఇళ్ల యజమానులు దాఖలు చేసిన రిట్ అప్పీల్‌ను ధర్మాసనం కొట్టివేసింది. ఖర్చుల మొత్తాన్ని తగ్గించాలన్న విజ్ఞప్తిని సైతం తోసిపుచ్చింది. వాస్తవాలను దాచి పెట్టి కోర్టుల నుంచి సానుకూల ఉత్తర్వులు పొందే తీరును తామెంత మాత్రం ప్రోత్సహించబోమని తేల్చి చెప్పింది. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తే నిజమైన బాధితులకు అన్యాయం జరుగుతుందని, వారు సకాలంలో కోర్టును ఆశ్రయించి న్యాయం పొందే పరిస్థితి ఉండదని వ్యాఖ్యానించింది. ఒక్కొక్కరూ రూ.లక్ష చొప్పున 14 మంది రూ.14 లక్షలను ఖర్చుల కింద చెల్లించాలంటూ సింగిల్‌జడ్జి ఇచ్చిన తీర్పు సరైందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇదీ నేపథ్యం..

రహదారి విస్తరణలో భాగంగా పలు ఇళ్ల కూల్చివేతకు నిర్ణయం తీసుకున్న తాడేపల్లి మునిసిపల్ అధికారులు రోడ్ మార్జిన్లను ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఇళ్ల యజమానులకు ఈ ఏడాది మే 21న చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశారు. అయితే రాజకీయ పార్టీల అండతో ఈ నోటీసులను సవాలు చేస్తూ బెల్లంకొండ వెంకట నారాయణ, మరో 13 మంది ఇళ్ల యజమానులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా నేరుగా కూల్చివేత నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న సింగిల్ జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హారీ... పిటిషనర్ల ఇళ్ల విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని మునిసిపల్ అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అటు తరువాత ఆ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా ఇళ్ల కూల్చివేత విషయంలో పిటిషనర్లకు అధికారులు ముందుగానే షోకాజ్ నోటీసులతో పాటు ఇతర నోటీసులు కూడా అందచేశారంటూ అందుకు సంబంధించి అన్ని ఆధారాలను మునిసిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాదులు న్యాయమూర్తి ముందుంచారు. వాటిని పరిశీలించిన న్యాయమూర్తి హైకోర్టును ఆశ్రయించిన 14 మంది పిటిషనర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు అందుకుని కూడా నోటీసులు ఇవ్వలేదంటూ హైకోర్టును తప్పుదోవ పట్టించడంపై మండిపడ్డారు. కోర్టు ముందు వాస్తవాలను దాచి పెట్టినందుకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున 14 మందికి రూ.14 లక్షలను ఖర్చులుగా విధిస్తూ ఇటీవల తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆ 14 మంది ఇళ్ల యజమానులు ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు.

కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేశారు...

ఇళ్ల యజమానుల తరఫున సీనియర్ న్యాయవాది కలిగినీడి చిదంబరం వాదనలు వినిపిస్తూ పిటిషనర్లందరూ వ్యవసాయదారులని పేర్కొన్నారు. వారికి షోకాజ్ నోటీసులకు, తుది నోటీసులకు తేడా తెలియదన్నారు. దీంతో నోటీసులు ఇవ్వలేదని చెప్పారన్నారు. అంతేకానీ కోర్టును తప్పుదోవ పట్టించాలన్న ఉద్దేశం వారికి లేదన్నారు. జరిగిన తప్పులకు క్షమాపణ చెబుతున్నామన్నారు. అయితే ఈ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. సింగిల్ జడ్జి తీర్పు సరైందేనని తేల్చి చెప్పింది. ఇలాంటి వ్యాజ్యాల వల్ల కోర్టుల సమయం వృథా అవుతోందని పేర్కొంది. వాస్తవాలను తొక్కి పెట్టి పిటిషన్ దాఖలు చేయడం ద్వారా కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేశారని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇలాంటి వ్యాజ్యం దాఖలు చేయడం ద్వారా మిగిలిన కక్షిదారుల వ్యాజ్యం విచారణ జాబితాలో వచ్చే అవకాశం లేకుండా పోయిందని, ఇది ఓ రకంగా అన్యాయం చేయడమేనని వ్యాఖ్యానించింది. కేసులు సకాలంలో విచారణకు రాకపోవడంతో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారని, అందుకు ఇప్పటం ఇళ్ల యజమానులు లాంటి వారు దాఖలు చేసే వ్యాజ్యాలే కారణమని పేర్కొంది. ఈ వ్యాజ్యాన్ని విచారించేందుకు హైకోర్టు ఎంతో సమయం వెచ్చించిందని తెలిపింది. ఆ సమయాన్ని నిజమైన బాధితులు దాఖలు చేసే వ్యాజ్యాలను విచారించేందుకు వెచ్చించి ఉంటే వారికి న్యాయం జరుగుతుందని పేర్కొంటూ అప్పీల్‌ను కొట్టేసింది.





వధూవరులకు సీఎం జగన్ ఆశీర్వాదం

సీఎం వైఎస్ జగన్ బుధవారం రెండు వివాహ మహోత్సవాలకు హాజరయ్యారు. తొలుత విజయనగరం జిల్లా భీమిలి మండలం దాకమర్రిలో వధూవరులు స్నేహ, మణిదీప్ (నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పెద్ద కుమారుడు)లను.. ఆ తర్వాత మంగళగిరి సీకే కన్వెన్షన్స్‌లో సాయి అశ్విత (మాజీ మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస రావు కుమార్తె), చక్రవర్తిలను ఆశీర్వదించారు. – సాక్షి ప్రతినిధి, విజయనగరం/మంగళగిరి

అకౌంట్ టెస్ట్ పేపర్-1 పరీక్ష రద్దు

సాక్షి, అమరావతి: స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అకౌంట్ టెస్టులో భాగంగా ఈ నెల 11న నిర్వహించిన పేపర్-1 పరీక్ష(అకౌంట్ టెస్టు, పేపర్ కోడ్-146)ను రద్దు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి హెచ్.అరుణ్ కుమార్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పరిపాలన కారణాల రీత్యా ఈ రద్దు నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షను తిరిగి 31న నిర్వహిస్తామని తెలిపారు. టెస్టు సెంటర్ల పేర్లతో కొత్త హాల్ టికెట్లను త్వరలోనే కమిషన్ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచుతామని వివరించారు.

వేగులం కాదు.. ప్రజా సేవకులం



విజయనగరం జిల్లా ఎస్.కోటలో ఈనాడుకు వ్యతిరేకంగా మానవహారంగా ఏర్పడి నినదిస్తున్న గ్రామ వలంటీర్లు

'ఈనాడు'పై రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ల ఆగ్రహం

- రామోజీ దిష్టిబొమ్మ, ఆ పత్రిక ప్రతుల దహనం
- తమకు రాజకీయ మకిలి అంటించొద్దని ఆగ్రహం
- కుల మతాలకు అతీతంగా పని చేస్తున్నామని వెల్లడి

సాక్షి ప్రతినిధి, విజయనగరం/కోటబొమ్మాళి/మదనపల్లె: ఈనాడు దినపత్రికలో ప్రచురించినట్లుగా తాము వేగులం కాదని, ప్రజలకు సేవలందిస్తున్న సేవకులమని గ్రామ, వార్డు వలంటీర్లు స్పష్టం చేశారు. వలంటీర్ల వ్యవస్థపై ప్రజల్లో అపోహలు పెంచేలా అవాస్తవ కథనాలు రాయడం దారుణం అని మండిపడ్డారు. బుధవారం విజయనగరం జిల్లా చీపురుపల్లి, లక్కవరపుకోట, రాజాం, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిరసనలు, మానవ హారాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో వలంటీర్లు తరలి వచ్చి నిరసన తెలిపారు. వేగులమంటూ తమ మనోభావాలు దెబ్బ తీసేలా ఈనాడు దారుణంగా దుష్ప్రచారం చేయడం తగదని ధ్వజమెత్తారు. రామోజీరావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు కథనాలకు నిరసనగా రామోజీ దిష్టిబొమ్మను, ఈనాడు ప్రతులను దహనం చేశారు. మదనపల్లెలో వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీరుగట్టి రాజేష్ మాట్లాడుతూ.. రాజకీయ కారణాలతో వలంటీర్ వ్యవస్థ గురించి తప్పుగా రాస్తే ప్రజలు నిజమని నమ్మేస్తారనుకోవడం రామోజీ భ్రమ అన్నారు. వలంటీర్ వ్యవస్థ సమర్థవంతంగా పని చేయడం వల్లే నేడు నూరు శాతం ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరుతున్నాయని చెప్పారు. దేశంలోని పలు రాష్ట్రాలు, యూనిసెఫ్ ఈ వ్యవస్థపై ప్రశంసలు వ్యక్తం చేయడం కనిపించలేదా.. అని నిలదీశారు.



మదనపల్లె ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వలంటీర్లు

అవుకు రిజర్వాయర్ వద్ద రెండో టన్నెల్ రెడీ

▶ మొదటి పేజీ తరువాయి


తరలించి.. ఉమ్మడి కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాల్లోని 20 లక్షల మందికి తాగు నీరు అందించాలనే లక్ష్యంతో 2005లో నాటి సీఎం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాన్ని చేపట్టారు. గోరకల్లు రిజర్వాయర్ నుంచి 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 57.7 కి.మీల పొడవున వరద కాలువ, దీనికి కొనసాగింపుగా 5.7 కి.మీల పొడవున సొరంగం (అవుకు రిజర్వాయర్ వద్ద కొండలో ఒక్కొక్కటి 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 2 సొరంగాలు) తవ్వకాలు చేపట్టారు. మహానేత హయాంలోనే వరద కాలువ తవ్వకంతోపాటు 2 సొరంగాలలో అధిక శాతం పనులు పూర్తయ్యాయి.

మిగిలిన పనులు పూర్తి చేయలేని టీడీపీ సర్కార్

అవుకు సొరంగాలలో ఒక్కో సొరంగంలో 165 మీటర్ల పొడవున ఫాల్ట్ జోన్ (మట్టి పొరలు పెళుసుగా ఉండటం వల్ల కూలిపోవడం)లో పనులు చేయాలి. వాటిని చేయలేని టీడీపీ సర్కార్.. ఒక సొరంగంలో 165 మీటర్ల పొడవున సొరంగానికి ప్రత్యామ్నాయంగా కాలువ తవ్వి.. దాన్ని వరద కాలువతో అనుసంధానం చేసింది. దీని వల్ల పది వేల క్యూసెక్కులను మాత్రమే తరలించవచ్చు. గండికోట రిజర్వాయర్‌లో నిర్వాసితులకు పునరావాసం కల్పించక పోవడం వల్ల 26.85 టీఎంసీలకుగాను నాలుగైదు టీఎంసీలను మాత్రమే టీడీపీ సర్కార్ నిల్వ చేయగలిగింది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోనూ నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడం వల్ల 10 టీఎంసీలకుగానూ 4 టీఎంసీలను మాత్రమే నిల్వ చేయగలిగింది. పైడిపాలెం రిజర్వాయర్‌లో 6 టీఎంసీలకుగానూ ఒక టీఎంసీ నిల్వ చేసింది. బ్రహ్మంసాగర్ మట్టికట్టకు ఏర్పడిన లీకేజీలకు అడ్డుకట్ట వేయకపోవడం వల్ల 17.74 టీఎంసీలకుగానూ 4 టీఎంసీలను మాత్రమే నిల్వ చేసేవారు.

రాయలసీమ సస్యశ్యామలమే లక్ష్యంగా..

వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక గాలేరు-నగరి సుజల స్రవంతిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్‌లో మిగిలిన పనులను పూర్తి చేయడంతో పాటు గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లలో నిర్వాసితులకు పునరావాసం కల్పించడాన్ని, బ్రహ్మంసాగర్ మట్టికట్టకు లీకేజీలకు అడ్డుకట్ట వేసే పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రూ.వెయ్యి కోట్లు వ్యయం చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడం ద్వారా గండికోట రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో అంటే 26.85 టీఎంసీలను నిల్వ చేశారు. రూ.250 కోట్లు వ్యయం చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడం ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పది టీఎంసీలకుగాను పది టీఎంసీలు, పైడిపాలెం రిజర్వాయర్‌లో పూర్తి సామర్థ్యం మేరకు 6 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు. ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని అందిస్తున్నారు. బ్రహ్మంసాగర్ మట్టికట్టకు లీకేజీలు ఉన్న ప్రాంతంలో రూ.వంద కోట్లతో డయాఫ్రమ్ వాల్ వేసి.. వాటికి అడ్డుకట్ట వేశారు. తద్వారా 17.74 టీఎంసీలను నిల్వ చేస్తూ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని అందిస్తున్నారు.



పూర్తయిన అవుకు సొరంగాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి

మరో అడుగు ముందుకు..

సీఎం ఆదేశాల మేరకు గాలేరు-నగరి సుజల స్రవంతి పథకంలో రెండో సొరంగం(టన్నెల్)లో ఫాల్ట్ జోన్(కూలిన ప్రాంతం)లో 160 మీటర్ల తవ్వకం పనులను అధికారులు ప్రాధాన్యతగా చేపట్టారు. అత్యాధునిక పోలింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో పాలీయురిథేన్ యురెథేన్ ఫోమ్ గ్రౌటింగ్ చేస్తూ ఫాల్ట్ జోన్‌లో సొరంగం తవ్వకం పనులను పూర్తి చేశారు. ఫాల్ట్ జోన్‌లో సొరంగానికి 165 మీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్‌తో లైనింగ్ చేయాల్సి ఉండగా ఇప్పటికే 134 మీటర్లు పూర్తి చేశారు. నెలాఖరుకు మిగతా 131 మీటర్ల లైనింగ్ పనులు పూర్తవుతాయి. ఇప్పటికే పూర్తయిన మొదటి సొరంగం ద్వారా పది వేల క్యూసెక్కులకు తోడుగా ప్రస్తుతం పూర్తయిన రెండో సొరంగం ద్వారా మరో పది వేల క్యూసెక్కులు కలిపి 20 వేల క్యూసెక్కులను గాలేరు-నగరి సుజల స్రవంతి వరద కాలువ ద్వారా తరలించడానికి మార్గం సుగమం చేశారు. ఇది ఆయకట్టుకు మరింత మెరుగ్గా నీళ్లందించడానికి దోహదం చేస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

సుసాధ్యం చేశాం

సీఎం ఆదేశాల మేరకు అవుకు రెండో సొరంగంలో ఫాల్ట్ జోన్‌లో 160 మీటర్ల తవ్వకం పనులు పూర్తి చేయడాన్ని సవాల్‌గా తీసుకున్నాం. హిమాలయాల్లో సొరంగాలు తవ్వే నిపుణులను రప్పించి.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సొరంగాన్ని పూర్తి చేయించాం. దాంతో ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులను గాలేరు-నగరి కాలువ ద్వారా తరలించవచ్చు.

– శశిభూషణ్‌కుమార్, ముఖ్య కార్యదర్శి జలవనరుల శాఖ

సామర్థ్యం పెంచే పనుల్లో వేగం పెంచాం

అసాధ్యమనుకున్న అవుకు రెండో టన్నెల్ తవ్వకం పనులు పూర్తి చేశాం. సీఎం ఆదేశాలతో గాలేరు-నగరి కాలువ సామర్థ్యం 30 వేల క్యూసెక్కులకు పెంచడంలో భాగంగా అవుకు వద్ద మూడో టన్నెల్ తవ్వకాలు చేపట్టాం. వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తాం. అప్పుడు గాలేరు-నగరి ద్వారా 30 వేల క్యూసెక్కులు తరలించవచ్చు.

– సి.నారాయణరెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్, జల వనరుల శాఖ

ఆస్తులు, అప్పులు విభజించండి

▶ మొదటి పేజీ తరువాయి

హక్కులతో రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడడానికి రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పులను న్యాయంగా విభజించాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొద్ది రోజుల క్రితం న్యాయవాది మెహఫూజ్ నజ్కీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరగనుంది. పిటిషన్‌లోని వివరాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్‌లోనే 91 శాతం ఆస్తులు

- 2014 జూన్‌లో ఏపీ, తెలంగాణలు ప్రత్యేక రాష్ట్రాలుగా విడిపోయిన సమయంలో ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఆస్తులు, అప్పుల విభజన చేశారు. కానీ అసలైన ఆస్తులు, అప్పుల విభజన ఇప్పటికీ పూర్తి కాలేదు. విభజన చట్టంలోని షెడ్యూలు 9, 10 సంస్థలే కాకుండా మరో 12 సంస్థల మధ్య విభజన జరగాల్సి ఉంది.
- ఇంకా విభజన కాని ఆస్తుల విలువ రూ.1,42,601 కోట్లుగా ఉంది. 91 శాతం ఆస్తులు ఉమ్మడి ఏపీ రాజధాని హైదరాబాద్‌లో ఉండడం వల్ల తెలంగాణనే లబ్ధి పొందుతోంది. షెడ్యూలు 9 లోని సంస్థల ప్రధాన కార్యాలయాల ఆస్తుల విలువ రూ.24,018.53 కోట్లు. ఇందులో రూ.22,556.45 కోట్ల (93.9 శాతం) విలువైన ఆస్తులు తెలంగాణలోనే ఉన్నాయి.
- షెడ్యూలు 10లో రూ.34,642.77 కోట్ల విలువైన ఆస్తుల్లో రూ.30,530.86 కోట్ల (88 శాతం) విలువైన ఆస్తులు తెలంగాణలోనే ఉన్నాయి. షెడ్యూలు 9, 10లో పేర్కొనని 12 విద్యా సంస్థల ఆస్తుల విలువ రూ.1,759 కోట్లు. ఇవన్నీ తెలంగాణలోనే ఉన్నాయి. ఈ ఆస్తుల విభజన పూర్తికాక పోవడం వల్ల ఆయా సంస్థల్లో పని చేస్తున్న సుమారు 1,59,096 మంది 2014 నుంచి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.
- రాష్ట్రం నష్టపోవడంతో పాటు ఏపీ ప్రజల హక్కులపై తీవ్ర ప్రభావం పడుతోంది. విభజన తర్వాత పదవీ విరమణ చేసిన వారి పరిస్థితి దయనీయంగా ఉంది. చాలా మందికి పదవీ విరమణ ప్రయోజనాలు దక్కలేదు. అందువల్ల ఆస్తుల విభజన సమస్యను త్వరగా పరిష్కరించాలి.

పాడి రైతులకు పండుగ

పెరిగిన అమూల్ పాల సేకరణ ధరలు

- రెండేళ్లలో ఇది ఐదోసారి పెరుగుదల
- గరిష్ఠంగా గేదె పాలపై లీటర్‌కు రూ.3.37, ఆవు పాలపై రూ.1.73 చొప్పున పెంపు
- కిలో వెన్నపై రూ.31, ఘన పదార్థాలపై రూ.12 మేర పెంపు
- నేటి నుంచి ఉత్తరాంధ్రలో వర్తింపు.. 40 వేల మందికి మరింత లాభం
- అనివార్యంగా పెంచాల్సిన పరిస్థితుల్లో ప్రైవేట్ డెయిరీలు
- అమూల్ రాకతో పాడి రైతులకు అదనంగా రూ.2,400 కోట్ల మేర ప్రయోజనం

సాక్షి, అమరావతి: జగనన్న పాల వెల్లువ ద్వారా పాలను సేకరిస్తున్న అమూల్ సంస్థ తాజాగా ఐదోసారి పాల సేకరణ ధరలను పెంచింది. లీటర్‌కు గరిష్ఠంగా గేదె పాలపై రూ.3.37, ఆవు పాలపై రూ.1.73 చొప్పున పెంచింది. కిలో వెన్నపై రూ.31, ఘన పదార్థాలపై రూ.12 మేర సేకరణ ధర పెరిగింది. ఈ పెంపు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో గురువారం నుంచి వర్తించనుంది. దీనిద్వారా 40 వేల మంది రైతులకు అదనంగాలబ్ధి చేకూరనుంది. గత రెండేళ్లలో ఇప్పటికే నాలుగు దఫాలు పాల సేకరణ ధరలను పెంచగా తాజా పెంపుతో ఐదోసారికి చేరుకుంది.

మూడు నెలల్లోనే మళ్లీ..

అమూల్ తరఫున రాయలసీమలో కైరా, కోస్తాంధ్రలో సబర్కాంత్, ఉత్తరాంధ్రలో బనస్కాంత్ యూనియన్లు పాలను సేకరిస్తున్నాయి. పథకం ప్రారంభించినప్పుడు లీటర్‌కు గరిష్ఠంగా గేదె పాలకు రూ.71.47, ఆవు పాలకు రూ.34.20 చొప్పున చెల్లించింది. ప్రస్తుతం లీటర్ గేదె పాలకు రూ.84.15, ఆవు పాలకు రూ.40.73 చొప్పున చెల్లిస్తోంది. అమూల్ తరఫున ఉత్తరాంధ్రలో పాలను సేకరిస్తున్న బనస్కాంత్ జిల్లా కో ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ సెప్టెంబర్‌లో పాల సేకరణ ధరలు పెంచగా 3 నెలలు తిరగకుండానే మరోసారి పెంచడం గమనార్హం. తాజా పెంపుతో లీటర్‌కు గరిష్ఠంగా గేదె పాలు రూ.87.52, ఆవు పాలు రూ.42.46 చొప్పున పెరిగాయి. అమూల్ గత రెండేళ్లలో గేదె పాలపై రూ.16.05, ఆవు పాలపై రూ.8.26 మేర పెంచింది.

రెండేళ్లలో 5.40 కోట్ల లీటర్ల సేకరణ

జగనన్న పాలవెల్లువ ద్వారా 2020 డిసెంబర్‌లో 3 జిల్లాల్లో పాల సేకరణకు శ్రీకారం చుట్టగా 2 నెలల్లోనే 17 జిల్లాలకు విస్తరించారు. 27,277 మంది రైతులతో మొదలైన ఈ ఉద్యమంలో ఇపుడు ఏకంగా 2,47,958 మంది భాగస్వాములయ్యారు. వంద గ్రామాలతో ప్రారంభమై 2,856 గ్రామాలకు విస్తరించింది. రోజూ సగటున లక్షన్నర లీటర్ల పాలను సేకరిస్తోంది. 1,587 ఆర్బీకేల పరిధిలో 2,49,998 మంది పాడి రైతులు నిత్యం పాలు పోస్తున్నారు. రెండేళ్లలో 5.40 కోట్ల లీటర్ల పాలను సేకరించగా పాడి రైతులకు రూ.232.26 కోట్లు చెల్లించారు. లీటర్‌పై రూ.4 అదనంగా లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తామని హామీ ఇవ్వగా ప్రస్తుతం లీటర్ గేదె పాలకు రూ.15 -రూ.20 వరకు, ఆవుపాలకు రూ.10 - రూ.12 వరకు అదనపు లాభం చేకూరుతోంది. అమూల్ రాకతో పోటీ పెరిగి ప్రైవేట్ డెయిరీలు సైతం అనివార్యంగా సేకరణ ధరలను పెంచాల్సి వచ్చింది. ఫలితంగా పాడి రైతులకు అదనంగా రూ.2,400 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది.



సంక్రాంతికి మిగతా జిల్లాల్లోనూ..

జగనన్న పాల వెల్లువ ద్వారా అమూల్ తరఫున ఉత్తరాంధ్రలో పాలు సేకరిస్తున్న బనస్కాంత్ యూనియన్ ఐదోసారి పాలసేకరణ ధరను పెంచడంతో పాటు వెన్న, ఘనపదార్థాల సేకరణ ధరలను కూడా పెంచింది. ఇప్పటికే 17 జిల్లాల్లో పాలు సేకరిస్తున్నాం. సంక్రాంతి కల్లా మిగిలిన జిల్లాలకు విస్తరించేలా కృషి చేస్తున్నాం.

– అహ్మద్‌బాబు, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్

పాల సేకరణ ధరలు లీటర్‌కు రూ.లలో

	కొవ్వు శాతం	ఎస్ఎన్ఎఫ్ శాతం	పాతధర	కొత్తధర	పెరిగినధర
గేదె పాలు	5.5	9	41.58	43.26	1.68
	11	9	84.15	87.52	3.37
ఆవు పాలు	3.2	8.7	34.31	35.77	1.46
	5.4	8.7	40.73	42.46	1.73

వెన్న, ఘన పదార్థాల సేకరణ ధరలు (కిలోకు రూ.ల్లో)

	పాతధర	కొత్త ధర	పెరిగిన ధర
వెన్న	765	796	31
ఘనపదార్థాలు	289	301	12

ఉత్సాహంగా జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు



కళాకారులతో మంత్రి రోజా

బీచ్‌రోడ్డు: సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా సంప్రదాయ కళలను పరిరక్షించేందుకు రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు బుధవారం విశాఖలో ఉత్సాహంగా కొనసాగాయి. రాష్ట్రాన్ని 4 జోన్లుగా విభజించి ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.జోనల్ స్థాయి(శ్రీకాకుళం, విజయనగరం ,పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు) పోటీలు సిరిపురంలోని వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. థింసా నృత్యాలు, పులి, కాళికా వేషాలు, జానపద నృత్యాలు తదితర ప్రదర్శనలతో ఉత్తరాంధ్ర కళాకారులు తమ ప్రతిభ చూపిస్తున్నారు. కళాకారులతో పాదం కలిపి మంత్రి ఆర్కే రోజా వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. గురువారం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు విడదల రజిని, గుడివాడ అమరనాథ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు వరుదు కళ్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి, అదీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ అండమాన్ సముద్రానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో బుధవారం మధ్యాహ్నం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ దిశగా పయనిస్తూ గురువారం నాటికి తీవ్ర అల్పపీడనంగా మారనుంది. అదే తీవ్రతతో, అదే దిశగా 17వ తేదీ ఉదయం వరకు కొనసాగుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం రాత్రి నివేదికలో తెలిపింది. మరోవైపు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆపై మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని తెలిపింది. కాగా బుధవారం తూర్పు గోదావరి జిల్లా పోతవరంలో 4.1, అల్లూరి సీతారామరాజు జిల్లా కుంతలంలో 2.5 సెం.మీల వర్షపాతం నమోదైంది.

అఖిలమ్మా... అప్పు కట్టమ్మా!

- ఆళ్లగడ్డలో మాజీ మంత్రి అఖిలప్రియ ఇంటి ముందు బ్యాంకు సిబ్బంది నిరసన
- ష్యూరిటీ ఉన్న ఏవీ సుబ్బారెడ్డి హోటల్ ముందు కూడా...



ఏవీ సుబ్బారెడ్డి హోటల్ ముందు నిరసన తెలుపుతున్న బ్యాంకు అధికారులు

ఆళ్లగడ్డ: అప్పు చెల్లించాలని మాజీ మంత్రి అఖిలప్రియ ఇంటి ముందు బ్యాంకు అధికారులు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దివంగత భూమా నాగిరెడ్డి ఆళ్లగడ్డలో జగత్ డెయిరీ కోసం నంద్యాల ఆంధ్రా బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు. ఆయన మృతి చెందినప్పటి నుంచి వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారసులకు పలు దఫాలు నోటీసులు ఇచ్చారు. అయినా స్పందించకపోవడంతో యూనియన్ బ్యాంకు (ప్రస్తుతం ఆంధ్రా బ్యాంక్ విలీనమైంది) లోన్ రికవరీ అధికారులు ఆళ్లగడ్డ చేరుకుని అఖిలప్రియ ఇంటి ముందు అప్పు చెల్లించాలని ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఆ సమయంలో ఆమె ఇంట్లో లేరని తెలిసింది. అనంతరం ఈ అప్పునకు ష్యూరిటీ పెట్టిన ఏవీ సుబ్బారెడ్డికి చెందిన హోటల్ ముందు కూడా 'బ్యాంక్ మనీ పబ్లిక్ మనీ, మా బకాయిలు చెల్లించండి-సగర్వంగా జీవించండి' అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ విషయంపై అఖిలప్రియ ఫోన్‌లో బ్యాంకు అధికారులతో మాట్లాడి కొంత గడువు ఇస్తే డబ్బు చెల్లిస్తామని చెప్పడంతో వారు వెళ్లిపోయారు.

'వైద్య శాఖ' వాక్-ఇన్‌కు తొలి రోజు 100 మంది హాజరు

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీకి తొలి రోజు బుధవారం నిర్వహించిన వాక్-ఇన్ ఇంటర్వ్యూకు 100 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జనరల్ మెడిసిన్ 51, జనరల్ సర్జరీ 20, ఫోరెన్సిక్ మెడిసిన్ 2, మైక్రోబయాలజీ 1, డెర్మటాలజీ 3 పోస్టులను నోటిఫై చేశారు. జనరల్ సర్జరీకి 52, జనరల్ మెడిసిన్ 39, ఫోరెన్సిక్ మెడిసిన్ 2, మైక్రోబయాలజీ 4, డెర్మటాలజీ 3 చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తులను పరిశీలించి మెరిట్ లిస్ట్‌లు తయారు చేశారు. డెర్మటాలజీలో ఇద్దరు వైద్యులకు బుధవారం రాత్రి పోస్టింగ్‌లిచ్చారు. విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో నిర్వహించిన వాక్-ఇన్ ఇంటర్వ్యూను వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ కుమార్, ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్ పర్యవేక్షించారు. 250 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ వైద్య పోస్టుల భర్తీకి 3 రోజుల పాటు వాక్-ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు వినోద్ తెలిపారు. అన్ని పోస్టులు భర్తీ అయ్యే వరకూ ఈ ప్రక్రియను కొనసాగిస్తామన్నారు. బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తామన్నారు. శుక్రవారం గైనకాలజీ, అనస్తీషియా, ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాల్లో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

శునకానికి ప్రేమతో..



పెంపుడు శునకం మరణాన్ని తట్టుకోలేక పోయిన ఒక కుటుంబం.. పెద్ద గద్దెపై దాని విగ్రహాన్ని ఏర్పాటు చేసి తమ ప్రేమను చాటుకుంది.

వరంగల్ నగరానికి చెందిన తోటం ధనుంజయ, భాగ్యలక్ష్మి దంపతుల కుటుంబం ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌లో రాట్‌వీలర్ జాతి ఆడ కుక్కపిల్లను కొనుగోలు చేసి జెస్సీ అని పేరు పెట్టి పెంచుకుంది. అది పెరిగి పెద్దదై పది పిల్లలకు జన్మనిచ్చాక వైరస్ సోకి చనిపోయింది. అది తట్టుకోలేని ఆ కుటుంబం తమ వ్యవసాయ క్షేత్రం వద్ద దాన్ని ఖననం చేసింది. అక్కడే పెద్ద గద్దెను నిర్మించి పెంపుడు కుక్కను పోలిన విగ్రహాన్ని రూ.25వేలతో చేయించి ప్రతిష్ఠించింది. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మచ్చాపూర్-ఎలుకుర్తిహవేలి రహదారిలో అనంతారం గ్రామం వద్ద ఈ శునకం విగ్రహాన్ని దారంట పోయేవారు ఆసక్తిగా చూస్తున్నారు. -గీసుకొండ

లక్షణంగా ఇళ్ల నిర్మాణం

- ఏకంగా కొత్త ఊళ్లనే నిర్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఆ ఐదు ఇళ్లు టీడీపీ హయాంలో మంజూరైనవే



సాక్షి, అమరావతి: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద గత మూడున్నరేళ్లలో పట్టణాల్లో 15.6 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 1.79 లక్షలకుపైగా గృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వీటిలో 15 లక్షలకు పైగా ఇళ్లకు శంకుస్థాపనలు చేయగా సుమారు 1.80 లక్షలకు పైగా గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇలా లక్షల సంఖ్యలో ఇళ్లతో ఏకంగా కొత్త ఊళ్లనే ప్రభుత్వం నిర్మిస్తుంటే దుష్ట చతుష్టయం మాత్రం యథాప్రకారం బురద చల్లుతోంది.

దున్న ఈనిందంటే..

పార్లమెంట్ సమావేశాల సందర్భంగా 2019-20 నుంచి 2021-22 మధ్య ప్రధాని ఆవాస్ యోజన -గ్రామీణ్(పీఎంఏవై-జీ) కింద ఎన్ని ఇళ్లు నిర్మించారని లోక్‌సభలో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర గృహ నిర్మాణ శాఖ స్పందించి రాష్ట్రాల వారీగా నివేదికను అందించింది. ఏపీలో 2019-20 నుంచి 2021-22 మధ్య ఐదు ఇళ్లు నిర్మించారని అందులో పేర్కొంది. దీంతో దున్నపోతు ఈనిందంటే గాటికి కట్టెయ్ అన్న చందంగా మూడున్నరేళ్లలో సీఎం జగన్ ప్రభుత్వం కేవలం ఐదు ఇళ్లనే నిర్మించిందంటూ టీడీపీ నాయకులు, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం, దుష్ట చతుష్టయం దుష్ప్రచారానికి దిగాయి.

ఆ ఐదు ఇళ్లు 2016-18 నాటివే

2019-20 నుంచి 2021-22 మధ్య రాష్ట్రంలో పీఎంఏవై-జీ కింద నిర్మించిన ఐదు ఇళ్లు 2016-17, 2017-18లో మంజూరైనవే కావడం గమనార్హం. నాడు 1.23 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు లభించగా టీడీపీ ప్రభుత్వం 68 వేల ఇళ్ల నిర్మాణాలు మాత్రమే ప్రారంభించింది. అయితే ఇందులో 46 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. అప్పట్లో మంజూరై నిర్మాణం ఆలస్యం అయిన ఐదు ఇళ్లు 2019 - 2022 మధ్య పూర్తయ్యాయి. ఇదే అంశాన్ని కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది.

ఇదీ అసలు సంగతి..

2019-20, 2020-21 మధ్య కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై-జీ కింద రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి అనుమతులివ్వలేదు. 2021-22లో మాత్రం 1,79,060 ఇళ్లను రాష్ట్రానికి మంజూరు చేసింది. ఈ క్రమంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 31న జీవో ఎంఎస్ నెంబర్-2 విడుదల చేసింది. ఇళ్ల పథకం రెండో దశను ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేదీన సీఎం జగన్ ప్రారంభించారు. 2024 మార్చి నాటికి 1.79 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. గత ఏడు నెలల్లో 67 వేల ఇళ్లకు శంకుస్థాపనలు పూర్తై వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

రూ. 840 కోట్ల బిల్లులు చెల్లింపు


- పేదల ఇళ్ల నిర్మాణ పథకం బిల్లులు చెల్లించిన గృహ నిర్మాణ శాఖ
- 1.70 లక్షల మంది లబ్ధిదారులకు రూ.708 కోట్లు మంజూరు
- సిమెంట్, ఐరన్, ఇతర నిర్మాణ సామగ్రి సరఫరాకు రూ.132 కోట్లు

సాక్షి, అమరావతి: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 1.70 లక్షల మంది లబ్ధిదారులకు మంగళ, బుధవారాల్లో రూ.840 కోట్ల మేర బిల్లులు చెల్లించింది. ఇందులో రూ.640 కోట్లు ఆప్షన్-1, 2 లబ్ధిదారులకు.. రూ.68 కోట్లు ఆప్షన్-3 లబ్ధిదారులకు మంజూరు చేసింది. రూ.32 కోట్లు సిమెంట్, రూ.71 కోట్లు ఐరన్, ఇతర నిర్మాణ సామగ్రి సరఫరా కోసం రూ.10 కోట్లు, లే అవుట్‌లలో లెవలింగ్ కోసం రూ.19 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.6,495 కోట్ల ఖర్చు..

తాజా చెల్లింపులతో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి చేసిన ఖర్చు రూ.6,495 కోట్లకు చేరింది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్రంలోని 31 లక్షల మంది పేదలకు వైఎస్ జగన్ ప్రభుత్వం గృహ యోగం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉచితంగా ఇంటి స్థలాలను పంపిణీ చేయడమే కాకుండా.. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తోంది. అలాగే ఉచితంగా 20 టన్నుల ఇసుక, సబ్సిడీపై సిమెంట్, ఐరన్, ఇతర నిర్మాణ సామగ్రిని సరఫరా చేస్తోంది. ఇప్పటి వరకు రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులివ్వగా.. 17.77 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. నిర్మాణ పురోగతి ఆధారంగా బీఎల్, రూఫ్ లెవల్, రూఫ్ కాస్ట్, ఇంటి నిర్మాణం పూర్తి.. ఇలా వివిధ దశలకు ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోంది. లబ్ధిదారులకు అదనపు సాయం కింద పావలా వడ్డీకే రూ.35 వేలు చొప్పున బ్యాంక్ రుణాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 6.61 లక్షల మందికి రూ.2,332 కోట్ల మేర రుణాలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు అప్‌లోడ్ అయిన బిల్లులన్నీ క్లియర్ చేశామని, సాంకేతిక కారణాలతో లబ్ధిదారుడి ఖాతాలో డబ్బులు జమ అవ్వకపోతే.. వెంటనే వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ చెప్పారు.

'మినీ'తో విశాఖ ట్రాఫిక్ సమస్యలకు చెక్



అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారి లో నిర్మించనున్న 12 మినీ ఫ్లై ఓవర్ల మ్యాప్

సాక్షి, అమరావతి: విశాఖలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది. విశాఖ నగరాన్ని దశాబ్దాలుగా వేధిస్తోన్న ట్రాఫిక్ సమస్యలకు త్వరలో ముగింపు పలకనుంది. అనకాపల్లి నుంచి విశాఖ నగరం గుండా ఆనందపురం వరకు జాతీయ రహదారిపై 12 మినీ ఫ్లై ఓవర్లు నిర్మించడానికి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సంసిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు 'వన్‌టైం ఇన్వెస్ట్‌మెంట్‌స్కీం' కింద ఈ మినీ ఫ్లై ఓవర్లను మంజూరు చేసింది. కేవలం 67 కి.మీ.పరిధిలోనే 12 మినీ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ఆమోదం తెలపడం విశేషం. విశాఖ, గంగవరం పోర్టులు, విశాఖ విమానాశ్రయంతోపాటు త్వరలో నిర్మాణం ప్రారంభం కానున్న భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానించే రహదారుల జంక్షన్లలో ఈ మినీ ఫ్లై ఓవర్లు నిర్మిస్తారు. అందుకోసం రూ.350 కోట్ల అంచనాతో ఎన్‌హెచ్ఏఐ ప్రాథమికంగా అనుమతులు మంజూరు చేసింది. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)లను రూపొందించేందుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి కన్సల్టెన్సీలను ఖరారు చేసింది. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు ఆ 12 జంక్షన్ల భౌగోళిక స్వరూపాన్ని అనుసరించి 3 డిజైన్లలో ఫ్లై ఓవర్లు నిర్మించనుంది. నాలుగు రోడ్ల జంక్షన్ అయితే ప్లస్ (+), మూడు రోడ్ల కూడలి అయితే వై (Y), రెండు రోడ్ల కూడలి అయితే టీ (T) ఆకృతిలో వాటిని నిర్మించాలని నిర్ణయించారు. అవసరమైన ప్రదేశాల్లో అండర్ పాస్‌లు నిర్మిస్తారు. భవిష్యత్‌లో విశాఖ మెట్రో రైల్ నిర్మాణానికి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఏఐను కోరింది. 12 మినీ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి డీపీఆర్‌లను 2023 జనవరి చివరినాటికి ఖరారు చేసి ఆమోదించాలని భావిస్తున్నట్లుగా ఎన్‌హెచ్ఏఐ పేర్కొంది. మార్చి-ఏప్రిల్‌లో టెండర్ల ప్రక్రియ చేపట్టి ఏడాదిన్నరలో పూర్తి చేయాలని భావిస్తోంది.

మినీ ఫ్లై ఓవర్లు నిర్మించే జంక్షన్లు ఇవే...

లంకెలపాలెం, దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్, గాజువాక, డెయిరీ ఫాం,తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, గురుద్వార, సీతమ్మధార, మద్దిలపాలెం, ఎండాడ, మధురవాడ.

బలిమెల నీటి పంపకాలపై నిర్ణయం

మోతుగూడెం: బలిమెల జలాశయం నీటి పంపకాలపై ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అధికారులు అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరులోని ఏపీ జెన్‌కో అతిథి గృహంలో బుధవారం సమావేశమయ్యారు. బలిమెల జలాశయం నీటి నిల్వలపై సమీక్ష నిర్వహించి లెక్కలు తేల్చారు. ఒడిశా వాటా 50.7 టీఎంసీలు, ఆంధ్రా వాటా 49.3 టీఎంసీలుగా నిర్ధారించారు. ఇప్పటివరకు ఈ నీటి సంవత్సరంలో అక్టోబర్ 31 వరకు ఒడిశా అదనంగా 8.5 టీఎంసీలు నీటిని వాడుకున్నట్టు సమావేశంలో వెల్లడించారు. డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టా ప్రాంతాలకు జనవరిలో నీటిని విడుదల చేయాల్సి ఉండటంతో డిమాండ్‌కు అనుగుణంగా ప్రస్తుతం బలిమెల జలాశయం నుంచి ఏపీ జెన్‌కో వాటాగా 2 వేల క్యూసెక్కులు వాడుకోవడానికి, ఒడిశా వాటాగా వెయ్యి క్యూసెక్కులు వాడుకోవడానికి నిర్ణయించారు. వచ్చే ఏడాది జూన్ లోపు ఒడిశా అదనంగా వాడుకున్న నీటిని ఏపీ జెన్‌కో సరిసమానం చేయడానికి బలిమెల నుంచి ఎక్కువ మొత్తంలో వినియోగించుకోవాలని నిర్ణయించారు.

ఏపీహెచ్ఏఏ ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేయండి : హైకోర్టు

విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీహెచ్ఏఏ) ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎంతమాత్రం తగదని హైకోర్టు స్పష్టం చేసింది. ఇది ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తుందని పేర్కొంది. ఎన్నికల నిర్వహణ విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని, అసలు ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం ఉందా? అని ప్రస్తుత కార్యవర్గాన్ని ప్రశ్నించింది. 2023 మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రస్తుత కార్యవర్గం సమర్పించిన షెడ్యూల్ పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేయాలని, ఆ వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రస్తుత కార్యవర్గం కాల పరిమితి ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించేందుకు బార్ కౌన్సిల్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఈ విషయంలో తాను ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ న్యాయవాది ఎస్.విజయభాస్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారించిన సింగిల్ జడ్జి జస్టిస్ దేవానంద్.. పిటిషనర్ ఫిర్యాదు ఆధారంగా ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలని బార్ కౌన్సిల్‌ను ఆదేశించారు. ఈ ఆదేశాలతో బార్ కౌన్సిల్ చైర్మన్.. ఏపీహెచ్ఏఏ కార్యకలాపాల నిర్వహణకు సీనియర్ న్యాయవాదులతో ఓ అడహక్ కమిటీని నియమించారు. దీంతో వెంటనే ప్రస్తుత కార్యవర్గం నుంచి బాధ్యతలు తీసుకోవాలని అడహక్ కమిటీని ఆదేశిస్తూ జస్టిస్ దేవానంద్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రస్తుత కార్యవర్గం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనపల్లి నర్సిరెడ్డి వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై విచారించిన ధర్మాసనం సింగిల్‌జడ్జి ఉత్తర్వులపై స్టే విధించిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం సీజే ధర్మాసనం ఈ అప్పీళ్లపై మరోసారి విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత కార్యవర్గం తరఫున సీనియర్ న్యాయవాది సి.వి.మోహన్‌రెడ్డి ఎన్నికల షెడ్యూల్‌ను మెమో రూపంలో ధర్మాసనం ముందుంచారు. అయితే మార్చిలో ఎన్నికలు నిర్వహించే విధంగా ఆ షెడ్యూల్ ఉండటంతో దానిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. వీలైనంత త్వరగా ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణలో జాప్యం చేస్తే, సింగిల్‌జడ్జి ఉత్తర్వులపై తాము విధించిన స్టేను ఎత్తేస్తామని చెప్పింది. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను తాత్కాలిక కమిటీకి అప్పగిస్తామంది. తిరిగి షెడ్యూల్ ఖరారు చేసి, ఆ వివరాలతో సవరించిన మెమోను కోర్టు ముందుంచుతామని మోహన్‌రెడ్డి తెలిపారు.

మార్గదర్శి ప్రధాన కార్యాలయంలో సోదాలు

తెలంగాణ పోలీసుల సహకారంతో హైదరాబాద్‌లో తనిఖీలు

సాక్షి, అమరావతి/హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లను సేకరించి చిట్టీల సొమ్మును ఇతర సంస్థల్లోకి మళ్లించిన మార్గదర్శి చిట్‌ఫండ్‌కు చెందిన హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. తెలంగాణ పోలీసుల సహకారంతో ఆంధ్రప్రదేశ్ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ఐదు బృందాలతో ఈ సోదాలను నిర్వహించారు. ఉదయం నుంచి దాదాపు తొమ్మిది గంటలపాటు తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. గురువారం కూడా ఇవి కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మార్గదర్శి ముసుగులో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపు లాంటి అవకతవకలకు పాల్పడటంపై ఆరా తీస్తున్నారు. చిట్టీల డబ్బులను అక్రమంగా దారి మళ్లించి ఇతర సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మార్గదర్శి యాజమాన్యం ఎనిమిదేళ్లుగా ఎలాంటి వివరాలు ఇవ్వడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. తనిఖీల సందర్భంగా చిట్టీదారుల వివరాలు, వారి నుంచి సేకరించిన డిపాజిట్లపై ఆరా తీస్తున్నారు.

పక్కా ఆధారాలతోనే..

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మార్గదర్శి కార్యాలయాల్లో మూడు విడతలు సోదాలు నిర్వహించిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సోదాల్లో లభ్యమైన సమాచారం ఆధారంగా హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఎంత మంది డిపాజిట్ చేశారన్న వివరాలను వెల్లడించకుండా మార్గదర్శి గుట్టుగా వ్యవహరిస్తోందని అధికారులు చెబుతున్నారు. ప్రజల సొమ్మును ఇతర సంస్థలకు మళ్లించినట్లు పక్కా ఆధారాలు లభ్యమైన తరువాతే హైదరాబాద్‌లోని కార్యాలయంలో సోదాలు చేపట్టినట్లు అధికార వర్గాల సమాచారం.

రాత్రి వరకు తనిఖీలు..

ఉదయం పదిన్నర గంటలకు మొదలైన తనిఖీలు రాత్రి వరకు కొనసాగాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎంత మొత్తం డిపాజిట్లు సేకరించారు? ఎక్కడెక్కడ ఎంత మళ్లించారు? చిట్టీలు పాడిన వారికి సకాలంలో చెల్లిస్తున్నారా? డబ్బులు డిపాజిట్ చేయాలని ఎందుకు ఒత్తిడి తెస్తున్నారు? మొత్తం సభ్యుల సంఖ్య ఎంత? డబ్బు చెల్లిస్తున్న వారికి ఎలాంటి గ్యారంటీ ఇస్తున్నారన్న అంశాలపై అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

క్షుణ్నంగా దర్యాప్తు.. ప్రత్యేక ఆడిట్

ఆంధ్రప్రదేశ్‌లో లక్ష మంది చందారులతో 2,345 చిట్టీలను నిర్వహిస్తున్న మార్గదర్శి ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఏపీలో చందాదారుల నుంచి చిట్టీ డబ్బులు వసూలు చేస్తున్నందున కంపెనీ కార్యకలాపాలు, బ్యాలెన్స్ షీట్లు వివరాలు ఇవ్వాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అడిగిన సమాచారం ఇవ్వకుండా, ఏటా వివరాలు సమర్పించకుండా అక్రమాలకు పాల్పడుతున్న మార్గదర్శిపై మరింత లోతైన దర్యాప్తు చేపట్టనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సోదాల అనంతరం మార్గదర్శికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు నిపుణులతో మార్గదర్శిలో ప్రత్యేక ఆడిట్ నిర్వహించేలా సన్నాహాలు జరుగుతున్నాయి. మార్గదర్శి ఒక్కటే కాకుండా చిట్‌ఫండ్ కంపెనీలలో అవకతవకలపై అధికారులు ఇప్పటికే ప్రజలను అప్రమత్తం చేశారు.

మీడియాపై మార్గదర్శి సిబ్బంది దురుసుతనం..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సోదాల కోసం వచ్చారనే సమాచారం అందడంతో అక్కడకు చేరుకున్న మీడియా ప్రతినిధులపై మార్గదర్శి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నామని చెబుతున్నా వినిపించుకోకుండా సంస్థ ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది దుర్భాషలాడుతూ మీడియాను గెంటేసేందుకు ప్రయత్నించారు.

పోషకాల్లో మునగండి



- 2 లక్షల ఉపాధి హామీ కూలీలకు మునగ మొక్కల పంపిణీ
- వచ్చే ఆర్థిక ఏడాది మరో లక్ష కుటుంబాలకు అందజేత
- పౌష్టికాహారం, క్యాన్సర్ నివారణలో మునగ ప్రాధాన్యతపై కూలీలకు అవగాహన

సాక్షి, అమరావతి: క్యాన్సర్ నివారణతో పాటు అత్యధిక పోషకాలుండే మునగ చెట్లను ఉపాధి హామీ పథకం కూలీల ఇళ్లు, పొలాల్లో సాగు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 2 లక్షల మంది ఉపాధి హామీ కూలీలకు ఐదేసి మొక్కల చొప్పున పంపిణీకి గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో 2 వేల ఎకరాలలో కూలీలు మునగ పంటను సాగు చేసుకోవడానికి ఆర్థిక సహాయం అందజేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. మునగ చెట్లు, ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలను మొక్కల పంపిణీ సమయంలోనే కూలీలకు అవగాహన కల్పిస్తామని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, కూలీలకు పంపిణీ చేసే మునగ మొక్కలను గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోనే ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన నర్సరీలలో ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 177 నర్సరీలలో ఇప్పటికే మునగ మొక్కల పెంపకం చేపట్టగా.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 250 నర్సరీలలో మునగ మొక్కల్ని ఉత్పత్తి చేయనున్నారు. కూలీలు తమకు ఉండే కొద్దిపాటి వ్యవసాయ భూముల్లో మునగ పంట సాగు చేసుకోవడానికి ముందుకొస్తే రెండేళ్లలో ఎకరానికి రూ.85 వేల వరకు చెల్లిస్తారు.



ఈ క్షణంలో ప్రశాంతంగా జీవించండి;
మీ ముందరి సమస్త సౌందర్యాన్ని గమనించండి.
భవిష్యత్తు దానికదే చూసుకుంటుంది.
– పరమహంస యోగానంద

సాక్షి
గురువారం, డిసెంబర్, 15

నమ్మలేని పొరుగు దేశం

భారత–చైనా సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తత మరోమారు పార్లమెంట్ సహా దేశమంతటినీ కుదిపి వేస్తోంది. డిసెంబర్ 9న అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ వద్ద యాంగ్ట్సే ప్రాంతంలో చొచ్చుకొని రావడానికి చైనా సైన్యం చేసిన ప్రయత్నాన్ని భారత సైనికులు గట్టిగా తిప్పికొట్టిన తీరుపై వైనవైనాలుగా కథనాలు వస్తున్నాయి. అక్కడ నిజంగా జరిగిందేమిటో తెలుసుకొని, పరిస్థితిని సమీక్షించి, లోటుపాట్లను సరిదిద్దుకొని, రక్షణ దళాలను బలోపేతం చేసే పనిలో భారత ప్రభుత్వం ఇప్పటికే ఉంది. అయితే, సరిహద్దు వెంట శాంతి నెలకొనాలనీ, అనేక ఇతర అంశాల్లో సహకారం వెల్లివిరియాలనీ – ఇరుదేశాల మధ్య ఉన్న ఒప్పందాన్ని దశాబ్ద కాలంగా పొరుగుదేశం పదే పదే ఉల్లంఘించడం కీలకాంశం. పొరుగునే పొంచివున్న పాము పట్ల అప్రమత్తత అనివార్యం.

రెండేళ్ళ క్రితం 2020 జూన్ 15 నాటి గల్వాన్ ఘర్షణల్లోనూ, తాజా తవాంగ్ ఘటనలోనూ చైనా తన తప్పేమీ లేదనే భావన కలిగించడానికి శతవిధాల ప్రయత్నించింది. వాస్తవాలు వెలికి రావడంతో డ్రాగన్ పాచిక పారలేదు. భారత – చైనాల మధ్య సైనిక ఘర్షణ 1962 నుంచి 60 ఏళ్ళుగా సాగుతోంది. లద్దాఖ్ పరిసర పశ్చిమ ప్రాంతం – టిబెట్‌తో మన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల సరిహద్దుతో కూడిన మధ్యప్రాంతం – అరుణాచల్ ప్రదేశ్ వద్ద సరిహద్దుతో కూడిన తూర్పు ప్రాంతం... ఈ మూడూ భారత–చైనా సరిహద్దులో ప్రధాన ప్రాంతాలు. అరుణాచల్‌తో ఉన్న 1126 కి.మీల తూర్పు సరిహద్దుపై చైనా ఎప్పుడూ పేచీ పెడుతూనే ఉంది. అరుణాచల్ తనదేనంటోంది. అధిక భాగాన్ని 'దక్షిణ టిబెట్' అని ప్రస్తావిస్తూ, అక్కడి ప్రదేశాలకు తన పేర్లు పెట్టి పిలుస్తోంది.

అరుణాచల్‌పై రచ్చ రేపి, చివరకు పశ్చిమాన భారత్ అధీనంలో ఉన్న కీలక అక్సాయ్‌చిన్‌ని తమకు వదిలేస్తే, అరుణాచల్‌పై పట్టు వీడతామని బేరం పెట్టడం డ్రాగన్ వ్యూహమని ఓ విశ్లేషణ. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) తూర్పు ప్రాంతంలో వ్యూహాత్మక తవాంగ్ వద్ద చైనాకు ఎప్పుడూ పట్టు లేదు. 17వేల అడుగుల ఎత్తైన పర్వతప్రాంతాన్ని వశం చేసుకుంటే, ఎల్‌ఏసీకి ఇరువైపులా స్పష్టంగా చూడవచ్చు. ఆ గుట్టపై ఆధిక్యం సంపాదించి, భారత్‌కు చోటు లేకుండా చేయాలన్నది చైనా పన్నాగం. అలాగే అరుణాచల్‌లో వివాదాస్పద సరిహద్దు వెంట భారత దళాల బలమెంతో అంచనా వేయడానికీ తాజా చర్యకు దిగింది. అది ఫలించకపోవడంతో తవాంగ్‌లో ప్రస్తుతానికి భారత్‌దే పైచేయి. కానీ, మరోపక్క సిక్కిమ్ సరిహద్దులో 2017లో ఘర్షణ సాగిన కీలక డోక్లామ్ ప్రాంతంలో కొన్నేళ్ళుగా చైనా ఊళ్ళకు ఊళ్ళు కడుతోంది. వంతెనలు నిర్మిస్తోంది. ఇది ఆందోళనకరం.

తవాంగ్‌లో 13 వేల అడుగుల ఎత్తైన చోట, మైనస్ 15 డిగ్రీల్లోనూ భారత్ నిర్మిస్తున్న సేలా సొరంగ మార్గం పూర్తి కావచ్చింది. ఇటు ప్రజలకూ, అటు ఆర్మీకీ పనికొచ్చే ఇలాంటివి చైనాను చీకాకుపరుస్తున్నాయి. ఆసియాపై ఆధిక్యం చూపాలంటే, హిమాలయ ప్రాంతంపై పట్టు బిగించడం చైనాకు కీలకం. పైగా, భవిష్యత్ దలైలామా తవాంగ్ ప్రాంతంలో జన్మిస్తారని ఓ నమ్మకం. అలా ధార్మికంగానూ ఆ ప్రాంతం తమకు కీలకమనీ, అదీ తమ దేశంలో భాగమైపోవాలనీ చైనా తాపత్రయం. మరోపక్క బ్రహ్మపుత్రా నదిపై ప్రాజెక్టులు కడుతూ, ఆ జలాలపై ఆధారపడ్డ ఇతర పొరుగు దేశాలను అడకత్తెరలో బిగిస్తోంది. ఇక, తవాంగ్ ఘటనలో భారత్‌ను అమెరికా సమర్థించడంతో పుండు మీద కారం రాసినట్టయింది. భారత, అమెరికాల బంధం బలోపేతమైతే తన ప్రాంతీయ ఆధిపత్యానికి గండి పడుతుందని చైనా భావన. అందుకే, ఢిల్లీ, వాషింగ్టన్‌లు దగ్గరవుతున్న కొద్దీ కవ్వింపు పెంచుతోంది. ప్రపంచవేదికలు శాంతివచనాలు పలుకుతున్నా, వాటి ప్రభావం శూన్యం.

జాతీయ భద్రత, ప్రాదేశిక సమగ్రతపై మన దేశమంతా ఏకతాటిపై ఉందని చాటాల్సిన సమయమిది. కానీ తవాంగ్ ఘటన సైతం రాజకీయమవుతోంది. తమనూ విశ్వాసంలోకి తీసుకొని, సరిహద్దు రక్షణపై పార్లమెంట్‌లో చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతుంటే, కారణాలేమైనా అధికార బీజేపీ అంగీకరించట్లేదు. 1962 చైనా యుద్ధవేళ నెహ్రూ విధానాన్ని కాషాయధ్వజులు తప్పు పడుతున్నారు. అప్పట్లో నెహ్రూ సభలో చర్చించి, ఏకంగా 165 మంది ఎంపీలకు మాట్లాడే అవకాశమిచ్చి, ఆపైనే నిర్ణయం తీసుకున్నారని విస్మరిస్తే ఎలా అని కాంగ్రెసీయులు ప్రతిదాడి చేస్తున్నారు. వెరసి, అప్పట్లో గల్వాన్ ఘటనలోనూ, ఇప్పుడీ తవాంగ్‌పైనా ఈ రాజకీయ వాగ్వాదపర్వం కీలకమైన దేశభద్రతలో లోటుపాట్లపై లోతైన చర్చకు దారి తీయకపోవడమే విచారకరం.

సరిహద్దు వెంట చైనా లాగానే, టిబెట్, దక్షిణ మంగోలియా, హాంకాంగ్, తవాంగ్ లాంటి చోట్ల చైనాపై మనమూ దూకుడు చూపాలనేది కొందరి వాదన. అయితే, మన పాలకులు 'ఆత్మనిర్భరత' అంటూ రొమ్ము విరుచుకుంటున్నా, ఇవాళ్టికీ బొమ్మలు (86 శాతం), ఎలక్ట్రానిక్ విడిభాగాలు (37 శాతం), ఆటో విడిభాగాలు (30 శాతం) సహా అనేక అంశాల్లో మనం చైనా దిగుమతులపైనే ఆధారపడ్డాం. వస్తూత్పత్తిలో స్వీయపురోగతికి దీర్ఘకాలం పడుతుంది. అలా చూస్తే పొరుగున ఉన్న చైనాతో బద్ధశత్రుత్వంతో రోజులు గడవవు. దౌత్యపరమైన ఒత్తిడి పెడుతూనే, నేటికీ స్పష్టంగా అంగీకారం లేని సరిహద్దు రేఖపై చర్చించి, శాశ్వత పరిష్కారానికి ప్రయత్నించాలి. సరిహద్దుల్లో జరగనున్న భారత వైమానికదళ విన్యాసాలతో తోక తొక్కిన తాచులా చైనా బుసలుకొట్టవచ్చు. రానున్న రోజుల్లో ఉద్రిక్తతలూ పెరగవచ్చు. ఇటీవల ఢిల్లీ ఎయిమ్స్‌లో సర్వర్లను స్తంభింపజేసిన సైబర్ దాడి చైనా పనేనట. ఈ పరిస్థితుల్లో సైన్యం, భారత గూఢచారి దళాల అప్రమత్తతే మనకు రక్షాకవచం.

ఇంధన పొదుపే మానవాళికి రక్ష

సందర్భం



ఎ. చంద్రశేఖర రెడ్డి

మానవాళి సహజవనరుల వినియోగంలో సంయమనం పాటించకపోతే మొత్తం జీవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది. భూతాపం పెరుగుదలకు విచక్షణా రహితమైన ఇంధన వినియోగం ముఖ్య కారణం. ఈ సంగతిని గుర్తించింది కాబట్టే భారత్ కర్బన ఉద్గారాలను 2070 నాటికి సున్నా శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ లక్ష్య సాధనలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో ఉంది. ఇంధన పరిరక్షణ, ఇంధన సామర్థ్యం వంటివి కర్బన ఉద్గారాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇంధన సామర్థ్య కార్యక్రమాలను ప్రోత్సహించడం, ఇంధన పొదుపు సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో... అన్ని ప్రభుత్వ శాఖలలో ఇంధన సంరక్షణా విభాగాల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ 89 జారీ చేసింది.

వేగంగా అభివృద్ధి సాధించాలన్న తాపత్రయంతో విచక్షణారహితంగా సహజవనరులను కొల్లగొడుతుండడంతో వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. వాతావరణ మార్పులతో భూతాపం పెరిగిపోయి జీవవైవిధ్యం దెబ్బతింటోంది. రానున్న కాలంలో భూతాపోన్నతి 1.5 డిగ్రీలు దాటి 2.6–4.8 డిగ్రీ సెంటిగ్రేడ్‌లకు పెరిగిపోయే అవకాశం ఉందని పలు నివేదికలు హెచ్చరిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఏటా 40 నుంచి 45 గిగా టన్నుల కర్బన ఉద్గారాలు విడుదల అవుతున్నాయి. వచ్చే 10 ఏళ్ళలో ఇది 480 నుంచి 490 గిగా టన్నులకు చేరే అవకాశం ఉంది. ఈ ఉద్గారాలు 500 గిగా టన్నులకు మించి పెరిగితే వాతావరణంలో విపరీతమైన మార్పులు సంభవిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఉపరితల ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల పరిమితిని దాటకూడదనే లక్ష్యంతో కాప్–27 పర్యావరణ సదస్సు నిర్దేశించిన సంగతి తెలిసిందే. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన చర్యలపై ప్రపంచ దేశాలన్నీ దృష్టి సారించాయి.

కర్బన ఉద్గారాలను 2070 నాటికి సున్నా శాతానికి చేర్చాలని మన దేశం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో మన ప్రభుత్వాలు మనకున్న పరిమితమైన ఇంధన వనరులను కాపాడటం, గ్లోబల్ వార్మింగ్‌కు కారణమైన కాలుష్య కారకాలను తగ్గించడంపై దృష్టి పెడుతున్నాయి. ఇంధన భద్రత సాధించడంలో ఇంధన పరిరక్షణ, ఇంధన సామర్థ్యం కీలక పాత్ర పోషిస్తాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడానికి దోహదపడతాయి. కాలుష్య కారక ఇంధనాలను పునరుత్పాదక ఇంధన వనరులతో భర్తీ చేయడం, ఇంధన కొరతను ఎదుర్కోవటం, పర్యావరణాన్ని కాపాడడం అనేవి.. ఇంధన పరిరక్షణ అత్యంత చవకైన, తక్షణ పరిష్కారాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు.

విద్యుత్, ఇతర ఇంధన వనరుల ఉత్పత్తిలో సహజ వనరుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. సహజ వనరులను కాపాడుకోవడంలో ఇంధన పరిరక్షణ, ఇంధన సామర్థ్యం అత్యంత ప్రయోజనకరంగా ఉంటాయి. విద్యుత్తును ఆదా చేస్తే సహజ వనరులను పెద్ద ఎత్తున పరిరక్షించినట్లే. ఇంధన పరిరక్షణ వల్ల వాతావరణంలోకి కర్బన ఉద్గారాల విడుదలను తగ్గించగలుగుతాం. ఇంధన సామర్థ్య కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే, ఆర్థిక ప్రగతిని సాధించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని ఆయన ప్రకటించారు. అంతేగాక ఆంధ్రప్రదేశ్‌ను 2027 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మారుస్తామని కూడా ప్రకటించారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాలను ప్రోత్సహించడం, ఇంధన పొదుపు సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ శాఖలలో ఇంధన సంరక్షణ విభాగాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ 89 జారీ చేసింది. అటవీ పర్యావరణ శాఖను పర్యవేక్షిస్తున్న ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కాలుష్యం తగ్గించేందుకు టార్గెట్లను పెట్టడం కూడా మంచి పరిణామమే.



మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన పొదుపునకు పెద్ద ఎత్తున అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిసియెన్సీ గుర్తించింది. రాష్ట్రంలో 2030 నాటికి 6.68 మిలియన్ టన్ ఆఫ్ ఆయిల్ ఈక్వివలెంట్ (ఎంటీఓఈ) ఇంధనాన్ని పొదుపు చేయా లని రాష్ట్రానికి లక్ష్యంగా నిర్ణయించింది. ఈ లక్ష్య సాధనకు అవస రమైన అన్ని చర్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటోంది. ప్రభుత్వ, ప్రైవేట్, పారిశ్రామిక సంస్థలలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. విద్యుత్తు, ఇతర ఇంధన వనరులపై చేసే వ్యయాన్ని తగ్గించడం, విద్యుత్ డిమాండును తగ్గించడంలో ఇంధన సామర్థ్యం తక్షణ, చౌకైన పరిష్కారంగా పేర్కొనవచ్చు.

ఇంధన సామర్థ్యం, ఇంధన సంరక్షణ కార్యక్రమాలు పటిష్ఠంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో ఉన్న మొత్తం విద్యుత్ డిమాండ్ 65,830 మిలియన్ యూనిట్లలో సుమారు 25 శాతం (16,450 ఎంయూ) ఆదా చేసే అవకాశం ఉంది. దీని విలువ సుమారు రూ. 11,480 కోట్లుగా అంచనా వేశారు. ఏపీ ఇప్పటికే ఎంపిక చేసిన భారీ పరిశ్రమల్లో ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి 'పాట్' (పెర్ఫార్మ్, అచీవ్, ట్రేడ్) పథకం అమలు చేస్తోంది. దీని వల్ల రాష్ట్రం ఇప్పటికి 0.818 (ఎంటీఓఈ) ఇంధనాన్ని ఆదా చేయగలిగింది. రాష్ట్రంలో ఇప్పటికే నిర్వహించిన ఎల్‌ఈడీ వీధి లైట్లు, ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ, పాట్ వంటి కార్యక్రమాల ద్వారా రూ. 3,800 కోట్ల విలువైన దాదాపు 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేసింది.

ఇంధన సామర్థ్య రంగంలో భారీ పెట్టుబడులకు అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం అంటోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సులో 29 ఇంధన సామర్థ్య ఫైనాన్సింగ్ ప్రాజెక్టులను గుర్తించడం జరిగింది. వీటిలో 14 ప్రాజెక్టులకు ఇప్పటికే రూ. 411 కోట్లు పెట్టుబడి వ్యయం అవుతుందని కేంద్ర ప్రభుత్వ సంస్థ బీఈఈ అంచనా వేసింది. మిగిలిన ప్రాజెక్టుల పెట్టుబడి అంచనా వ్యయాన్ని అది త్వరలో ప్రకటించనుంది. ఈ సదస్సులను క్రమం తప్పకుండా నిర్వహించటం ద్వారా రాష్ట్రానికి ఇంధన సామర్థ్య పెట్టుబడులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది. దేశంలో తొలిసారిగా ఏపీ నిర్వహించిన ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సు స్ఫూర్తితో ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ తరహా సదస్సులు నిర్వహించడానికి బీఈఈ సమాయత్తమైంది.

ఇంధన పరిరక్షణ, ఇంధన సామర్థ్య కార్యక్రమాలకు ఉన్న విస్తృత ప్రయోజనాల దృష్ట్యా – ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో పాటు ప్రజల్లోనూ ఇంధన పరిరక్షణ, ఇంధన పొదుపు ఆవశ్యకతపై పెద్దఎత్తున అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 14 నుండి 20 వరకు జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలను జరుపుకొంటున్నాం. దీనిలో వివిధ వర్గాల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులను, స్వయం సహాయక సంఘాలను భాగస్వాములు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఇంధన పొదుపు, ఇంధన భద్రత సాధించే ప్రయత్నంలో రాష్ట్రంలోని ప్రతి పౌరుడినీ భాగస్వాములుగా చేయాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రజల్లో ఇంధన పొదుపు జీవన శైలిపై అవగాహన కల్పించడం, తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించేందుకు వారం రోజుల పాటు అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. ఇళ్లలో విద్యుత్ వృధాను అరికట్టడం ఒక బాధ్యతగా భావించాలి. వినియోగంలో లేనపుడు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయడం, ఎయిర్ కండీషనర్ 24 డిగ్రీల వద్ద సెట్ చేయడం వంటి పొదుపు చిట్కాలను తప్పక పాటించాలి. ఎల్‌ఈడీ లైట్లు, ట్యూబ్ లైట్లు, స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలను వినియోగించడంతో విద్యుత్ ఆదా అవుతుంది.

ఒక యూనిట్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలంటే 800 గ్రాముల బొగ్గు అవసరం. దీని వల్ల 700 గ్రాముల కార్బన్ డయాక్సైడ్ వెలువడుతుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ప్రజానీకాన్ని ఇంధన సామర్థ్య కార్యకలాపాలలో భాగస్వాములుగా చేయడం; ఇంధన సామర్థ్య సాంకేతికతను ప్రవేశపెట్టడం, ఇంధన పొదుపు కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలుచేసే విధంగా ఏపీఎస్ఈసీఎం ఒక రోడ్ మ్యాప్‌ను తయారు చేస్తోంది. రాష్ట్రం విద్యుత్ వినియోగంలో 25 శాతం పొదుపు సాధించడమే ఈ రోడ్ మ్యాప్ లక్ష్యం. రాష్ట్రాన్ని ఇంధన పొదుపులో దేశానికి ఆదర్శంగా నిలిపేలా చేస్తున్న కృషిలో మనమందరం భాగస్వాములమవుదాం.

వ్యాసకర్త సీఈఓ, ఏపీ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్
(ఇంధన పొదుపులో ఏపీ ప్రభుత్వం రాష్ట్రపతి నుంచి జాతీయ అవార్డు అందుకున్న సందర్భంగా)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వ్యూహం లేని నాయకుడు



ప్రాచీన చైనీస్ పండితుల ఆధునిక వ్యూహాల విషయంలో మోదీ నిరక్షరాస్యుడు. షీ జిన్‌పింగ్‌ను ఆయన అర్థం చేసుకోవడంలో విఫలం అయ్యారు. షీ ఇండియాతో పిల్లి–ఎలుక ఆట ఆడుతున్నారు. ఇండియా ప్రతిచర్యకు పూనుకునేలా చేస్తున్నారు. 18 సార్లు జరిగిన 1–1 సమావేశాల నుంచి మోదీకి ఒక ప్రో–యాక్టివ్ వ్యూహం లేదన్న అంచనాకు వచ్చారు షీ.

– సుబ్రమణియన్ స్వామి, విరాట్ హిందూ సంఘం అధ్యక్షుడు

బంధుప్రీతి పార్టీ



తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సొంత కుమారుడిని (ఉదయనిధి స్టాలిన్) తమిళనాడు మంత్రివర్గంలోకి చేర్చుకోవడం తిరోగమన చర్య. నిరుత్సాహపూరితం. ఇతర కుటుంబ పార్టీల్లాగే డీఎంకే కూడా బంధుప్రీతికి తలొగ్గుతుందని ఊహించలేదు.

– మాలినీ పార్థసారథి, సంపాదకురాలు

ఏదీ ఆట?



భారత జనాభా సుమారు 140 కోట్లు, మొరాకోది 3.7 కోట్లు. అంటే మనం దాదాపు 40 రెట్లు ఎక్కువ. పైగా మొరాకన్ల కన్నా ముందునుంచీ ఫుట్‌బాల్ ఆడుతున్నాం (మోహన్ బగాన్ క్లబ్ 1889లో స్థాపితం). కానీ మొరాకో ప్రపంచ కప్‌లో సెమీ ఫైనల్‌కు చేరింది. మనం కనీసం అర్హత కూడా సాధించలేదు. ఎంత సిగ్గుచేటు!

– మార్కండేయ ఖట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

మాటలదేముంది?



గత ఏడేళ్లలో పది లక్షలమంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. 1,60,000 మంది కేవలం 2021లోనే. ఇందులో సగం మంది యూఎస్ పౌరసత్వం కోసం వదులుకున్నారు. యూఎస్ వీసా కోసం ఇండియా పాస్‌పోర్టు ఉన్నవాళ్లు రెండేళ్లు వేచివుండాలి. కానీ అమెరికన్లు ఇండియా రావడానికి క్యూలో నిలబడతారని మోదీ చెప్పారు.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

బాపుయగుట దుష్కరమ్ము సుమ్ము

'నేనయితే కింద సంతకం లేకపోయినా సరే! బాపు బొమ్మని గుర్తుపడతాను' అని కొంతమంది అమాయకంగా అమాయకమై పోతుంటారు. అలా అవసరం లేదు. రేఖ పండిన చిత్రకారులకి సంతకం అవసరం లేదు. వారి బొమ్మే సంతకం అవుతుంది. మరి బాపు గొప్పతనమంతా సంతకంలో కాక మరెక్కడుంది అని మీరెవరైనా అడిగితే నేను ఇలా చెబుతాను.

అనగనగా అనేక కథలు మన సాహిత్యానికి ఉన్నాయి. ఒకానొక బంగారు కాలంలో ఆ కథలన్నిటికీ అరచేయంత కొలత దగ్గరి నుండి, రెండు పేజీల వరకు వ్యాపించిన డబుల్ డమ్మీ ఇలస్ట్రేషన్‌లను బాపు బొమ్మలు కట్టేరు. తన క్రియేటివిటీతో సమకాలీన తెలుగు సాహిత్యాన్ని అమరం చేశారు.

కన్యాశుల్కంలో గిరీశం వెంకటేశాన్ని అడుగుతాడు 'ఏమి వాయ్! క్రియేషన్ అనగానేమీ?' దానికి వెంకటేశం ఏమి చెప్పాడో మీ అందరికీ తెలిసిందే. ఈ రోజు మాత్రం నేను చెప్పేది వినండి. క్రియేషన్ అనగా తెల్లని కాగితంపై మూడు అక్షరాల నల్లని అచ్చుగా మాత్రమే ఉండిన గిరీశం అనే ఒక పేరుకి 'ఇదిగో ఇంత ఎత్తు, ఇది నుదురు, ఇలా పంచె అని కట్టి, చేతిలో చుట్ట పెట్టి మనమెవ్వరమూ ఎప్పటికీ ఊహించలేని ఒక ఊహకు రూపం ఇచ్చి మనకు పరిచయం చేయడమన్నది బాపు చేసిన క్రియేషన్. గిరీశం కానీ, మధురవాణి కానీ, సౌజన్యరావు పంతులు కానీ, బుచ్చమ్మ కానీ ఇలా ఉంటారు అని ఆ గురజాడ అప్పారావు తమ పుస్తకంలో ఎక్కడా వర్ణన చేయలేదు. కానీ బాపు వారందరికీ ఒక రంగూ, ఒక రూపం, ఒక లక్షణం, ఒక ధోరణి, ఒక రీతి ఇచ్చి వారిని బొమ్మలుగా మలిచి మనకు మప్పారు. ఒకసారి బాపు బొమ్మల్లో వారిని చూశాక... వారు అలా కాక మరి ఇంకోలా ఉండటానికి మన ఇమాజినేషన్‌లో కుదరదు. బాపు బొమ్మ అంటే ఒక సంతకం కాదు. పేరు కాదు. కాసింత కాగితం, కలం మాత్రమే కలిసి దిద్దిన కల్పన కాదు.

అంత కాక మరెంత? అనడిగితే, అదీ చెబుతా. తొంభైల నాటి తరం మాది. మేము చదువుకున్న కథా సాహిత్యమంతా కొకు కథా సంపుటాలు, శ్రీపాద కథా సంపుటాలు, రావిశాస్త్రి కథా సంపుటాలు. మా తరానికి ఆ కథలు తొలినాళ్లల్లో అచ్చయిన ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, యువ, జ్యోతి లాంటి అనేకానేక పుస్తక పుటలు తిరగేయడం కుదరలేదు. తరవాత్తరువాత ఆ పాత



పుస్తకాలు, అందులో వాటికి వేసిన బొమ్మలు చూసే అవకాశం దొరికినపుడు, ఒకోసారి ఇంటర్నెట్‌లో పైన కథ పేరు కూడా లేని చాలా బాపు బొమ్మలను చూసినపుడు... నా కళ్ళకు కనపడింది బొమ్మ కాదు అచ్చంగా కథలే. చలపతి, దాసూ పూర్వాశ్రమంలో సహాధ్యాయులు, వారిద్దరి మధ్య పెద్ద స్నేహమేం ఏర్పడలేదు. చదువుల అనంతరం ఎన్నో ఏళ్ళ తరువాత అనుకోకుండా చలపతికి దాసు కనపడతాడు. చలపతికి పెళ్ళి కావాల్సిన రాజ్యం అనే చెల్లెలు ఉంది. చలపతి దాసుని ఇంటికి ఆహ్వానిస్తాడు. ఇంట్లో చలపతి, అతని భార్య, వారి ఇద్దరు పిల్లలు, రాజ్యం ఉంటారు. అ చదువుకున్న మధ్యతరగతి ఇల్లు, ఈ దంపతులు, ఆ పిల్లలు, వంటగదిలోంచి రెండు లోటాలతో కాఫీ తెస్తున్న రాజ్యం, కుర్చీలో కూచుని బుగ్గన సొట్టతో నవ్వుతున్న దాసు. ఈ బొమ్మని, వీటితో పాటూ అదే కథకు బాపు చిత్రించిన మరికొన్ని బొమ్మలని చూసిన నాకు ఒక్కసారిగా ఆ కథ మొత్తం నోటికి తగిలింది. బొమ్మ బొమ్మలో వెంకమ్మ, భాగ్యమ్మ, గోపీ, సత్యం అనే అందరినీ గుర్తు పట్టగలిగాను. ఈ కథే కాదు. బాపు వేసిన ఎన్నో బొమ్మల్లో ఆ కథలనూ, అందులోని మనుష్యులనూ గుర్తుపట్టి థ్రిల్లవుతూ వారిని చేయి పట్టి ఊపి షేక్ హాండ్ ఇచ్చిన అనుభవాలు నాకు కొల్లలు.

దీనిని మించిన మరో అద్భుత సంఘటనను మీకు చెబుతా. భారత దేశానికి గాలిబ్ కవితా, తాజమహలూ మరవరాని అందాలు అని ఒక మహానుభావుడు అన్నాడుట. మరి గాలిబ్ కవితకు ఏమిటి అందం? ఏ చేతులది చందం? అని వెదుక్కుంటూ బంగారం వంటి కవి దాశరథి, గొప్ప పబ్లిషర్ ఎంఎస్ రావు బాపును కలిశారు, ఆయనకు గాలిబ్ గీతాల అనువాదం ఇచ్చారు. వాటన్నిటికీ బాపు బొమ్మలు వేశారు. ఆ తరువాత ఆ పుస్తకం సాధించిన ఘన కీర్తి, తెలుగు వారి హృదయాలలో సంపాదించుకున్న సుస్థిర యశస్సు అందరికీ తెలిసినదే. అయితే చాలా మందికి తెలియని ఒక గొప్ప విషయం, బాపు బొమ్మకే అందిన అందలం ఏమిటంటే, దాశరథి గాలిబ్ గీతాల తెలుగు అనువాదం పుచ్చుకుని ఒక్క తెలుగు అక్షరం కూడా ఎరుగని ఎక్కడెక్కడి ఉర్దూ కవులూ కేవలం బాపు బొమ్మల్ని చూసి గాలిబ్ ఉరుదూ మూలం చదివేవారుట. ఇంతకూ చెప్పదలుచుకున్నదేమిటంటే... 'ప్రతిదీ సులభముగా సాధ్యపడదు లెమ్ము. మరియొకడు బాపుయగుట ఎంతో దుష్కరమ్ము సుమ్ము.'

– అన్వర్

(నేడు బాపు జయంతి; తెలుగు యూనివర్సిటీలో బాపు–రమణ పురస్కారాల ప్రదానం.)

తిరుప్పావై ప్రతిధ్వనించే మాసం

సందర్భం



మాడభూషి శ్రీధర్

గోదా దేవి పేరుతో తిరుప్పావై కావ్యాన్ని ఉపనిషత్తుల సారాంశం అని వర్ణిస్తారు. భగవద్గీతతో సమానంగా సంభావిస్తారు. భగవద్గీత కూడా ఉపనిషత్తుల సారాంశం కనుక గీతోపనిషత్ అంటూ తిరుప్పావైని గోదోపనిషత్ అని గౌరవించారు. వేదోపనిషత్తులను సూర్యోదయం లోనే పఠించాలి.

అందాల పల్లె వ్రేపల్లెలో కరువువచ్చింది. అందరూ ఆందోళన పడుతూ క్రిష్ణయ్య దగ్గరకు వెళ్లి తమను ఆదుకోమని గోప గోపీజనులు కోరారు. చిన్నారి కన్నె పిల్లలయిన గోపికలతో వ్రతం చేయిస్తే బాగుంటుందనీ అన్నారట. సరేనని శ్రీకృష్ణుడు గోపికలను పిలిపించి నియమాలు వివరించి, తెల్లవారు ఝామున రావాలని గోపికలకు మరీ మరీ చెప్పి పంపించాడు. దాంతో తిరుప్పావై కథావస్తువు మొదలైంది. శ్రీకృష్ణుడితో గడిపితే కలిగే ఆనందం, ఉత్సాహం గుర్తుకు వచ్చి గోపికలకు నిద్ర పట్టలేదు. ఎంత త్వరగా జాములు గడుస్తాయా, ఎప్పుడు బ్రహ్మ ముహూర్తం వస్తుందా అని ఎదురుచూస్తూ కష్టంగా రాత్రి గడిపారు. తెల్లవారు ఝామునే రమ్మన్నాడు కిట్టయ్య అందరినీ లేపుదాం అని బయలుదేరారు గోపికలు. ఇదీ తిరుప్పావై నాందీ ప్రస్తావన.

తమిళంలో అందరికీ అర్థమయ్యేందుకు సులువుగా రచించిన నాలుగు వేల కవితలను నాలాయరమ్ (నాల్ అంటే నాలుగు, ఆయిరం అంటే వేలు) అంటారు. శాత్తుమఱై అంటే నైవేద్యం తరువాత నాలాయిర ప్రబంధ పారాయణం... తిరుప్పావై మంగళా శాసనం ప్రణవ నాదంతో ముగుస్తుంది. ఈ తమిళ ప్రబంధ పారాయణానికి ఏ ప్రతి బంధకాలూ లేవు. కఠినమైన నిబంధనలు లేవు. వర్ణ భేదం లేదు. కులభేదం లేదు. ఎవరైనా నేర్చుకోవచ్చు.

అందరికీ అందే అందమైన కావ్యం తిరుప్పావై. నారాయణ మంత్ర సారాంశాన్ని పాశురంలోని అక్షరక్షరంలో పొదిగిన గోదాదేవి అందరికీ అందించినట్టే, నారాయణుని తిరుమంత్రాన్ని గుడి గోపురం ఎక్కి అందరికీ రహస్యాలు విప్పినవాడు రామానుజుడు. కుల మత భేదాలు లేకుండా అందరికీ నారాయణుని చేరే జ్ఞాన, వ్రత, మంత్ర సాధనా సోపానాలు తెలియాలని తపించిన వారే ఇద్దరూ– గోదాదేవి, శ్రీరామానుజుడు. తిరుప్పావై జీయర్ అని రామానుజుని అంటారు. గోదాదేవి పుట్టి కావేరి నది తీరంలో శ్రీరంగనిలో లీనమైన రెండు వందల ఏళ్ల తరువాత క్రీస్తు శకం 1000లో జన్మించిన రామానుజుడిని గోదాగ్రజుడిగా కీర్తి



స్తారు. దానికి కారణం రామానుజుడు తిరుప్పావైని అంతగా అభిమానించి అందరికీ బోధించడం ఒక కారణమైతే... తనకు రంగనితో వివాహమైతే మధురైకి దగ్గరలో ఉన్న తిరుమాలియుం శోలై ఆలయంలో శ్రీ సుందర బాహుస్వామికి వేయి బిందెల పాయసం చేయిస్తానన్న మొక్కును ఆయన తీర్చడం మరో కారణం. గోదాదేవి శ్రీరంగడిలో లీనం కావడం వల్ల ఆమె తన మొక్కు తీర్చలేకపోయారు. ఆ విషయం విన్న మరుక్షణమే రామానుజుడు శ్రీసుందర బాహుస్వామి ఆలయానికి వెళ్లి వేయిబిందెల పాయసం సమర్పించారట.

శంగత్తమిళ్ అంటే అందమైన తమిళ భాష అని అర్థం. డిసెంబర్ మధ్యలో ఉండే ధనుర్మాసంలో వచ్చే తమిళ నెల. సూర్యుడు ధనుర్ రాశిలో ఉండే నెలను ధనుర్మాసం అంటారు. గోదాదేవి రోజుకో పాశురాన్ని పాడి తోటి వారిని పూజకు పిలిచిన నెల ఇది. ఆ విధంగా 30 అందమైన ఎనిమిది పాదాల కవితలు గోదా గళం నుంచి జాలువారాయి ఈ నెలలో. పదం పదంలో పుణ్యకథ కనిపిస్తుంది. వాటిని వింటుంటే రామాయణ ఘట్టాలూ, భాగవత తత్వం, శ్రీకృష్ణలీలలు కళ్ల ముందు కదలాడుతాయి.

ఇందులో భక్తి సాహిత్యం, శరణాగతి, విశిష్టాద్వైత సిద్ధాంత సారం ఉంటుంది. కానీ ఇది సిద్ధాంత తత్వ గ్రంథం కాదు. ఒక్కో పాశురం ఒక్కొక్క బోధనా, సాధనా... ఒక పిలుపు, వ్రతం, ఆరాధన కలిసిన ప్రేమరస ప్రవాహం. ఆద్యంతం భక్తిభావ బంధురం.

తిరుమల తిరుపతిలో ఈ ధనుర్మాసపు ముప్పయ్ రోజులు వెంకన్న సుప్రభాతం వినడు. 'తిరుపళ్లియజిచ్చి' అని విప్రనారాయణుడు రచించిన పాశురాలు విన్న తరువాత... శ్రీనివాసుడు పొద్దున్నే లేవగానే శ్రావ్యంగా ఈ తిరుప్పావై పాశురాలు రోజుకొకటి చొప్పున మొత్తం 30 వింటాడు. గోదా గీతాగోవిందాన్ని వింటూ గోవిందుడు పరవశిస్తాడు. కనుక ఇది ధనుర్మాసపు గోవింద సుప్రభాతం. మొత్తం దేశమంతటా ఉన్న వైష్ణవాలయాలలో తిరుప్పావై గ్రంథ రహస్యాలను రోజుకో రెండుగంటల చొప్పున వివరించే ఉపన్యాస కార్యక్రమాలు 30 రోజులు సాగుతాయి. తెలుగు రాష్ట్రాలు రెండింటా నారాయణుని కోవెలల్లో ఈ నెలంతా తిరుప్పావై ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. సిరినోము సంక్రాంతి దాకా సాగే ఆధ్యాత్మికోద్యమం ఇది.

వ్యాసకర్త డీన్, స్కూల్ ఆఫ్ లా, మహీంద్ర యూనివర్సిటీ
(డిసెంబర్ 16న ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.సప్తమి రా.9.06 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పుబ్బ తె.4.01 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.10.44 నుండి 12.28 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.04 నుండి 10.50 వరకు, తదుపరి ప.2.29 నుండి 3.11 వరకు, **అమృతఘడియలు:** రా.9.03 నుండి 11.29 వరకు : **రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం :** ఉ.6.00 నుండి 7.30 వరకు : **సూర్యోదయం** 6.26 : **సూర్యాస్తమయం** 5.24.

గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమీషన్ (APERC) వారి సమక్షములో

డోర్ నెం.11-4-660, 4వ అంతస్థు, సింగరేణి భవన్, రెడ్‌హిల్స్, హైదరాబాద్-500 004.

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్

డాక్టర్ వై.ఎస్.ఆర్. విద్యుత్ సౌధ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రక్కన, ఐటిఐ రహదారి, విజయవాడ-520 008

బహిరంగ ప్రకటన

1. అందుబాటులోని ఏపిసిపిడిసియల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ నెం.1/2020 కలిగి ఉన్న పంపిణీ సంస్థ "ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసియల్)", 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవసరత, టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీల ప్రతిపాదనలను తేది:30-11-2022న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఈఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలు గౌరవ కమీషను వారిచే ఓ.పి. నెం.66/2022 గా నమోదు చేయబడినది.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) "ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసియల్)", కార్పొరేట్ కార్యాలయం, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి ప్రక్కన, ఐటిఐ రోడ్, విజయవాడ-520008 మరియు విజయవాడ, సిఆర్‌డిఏ, గుంటూరు మరియు ఒంగోలు సర్కిల్‌లలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయముల వద్ద లభ్యమగును. ఆసక్తి గల వారు ఈ ప్రతిపాదనలను కార్యాలయం పనివేళలలో ఉచితంగా పరిశీలించవచ్చు. ఈ ప్రతిపాదనలు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ www.apcpdcl.in లో అందుబాటులో మరియు వీటిని www.aperc.gov.in వెబ్‌సైట్‌లో కూడా పొందవచ్చును. ప్రచురించిన తేదీ నుండి కాపీ ఒక్కింటికి రూ.100/- (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా అకౌంట్స్ ఆఫీసర్/సిటీ, ఏపిసిపిడిసియల్, విజయవాడ వారి పేరున డిడి రూపేణా) చెల్లించిన మీదట ఈ ప్రతిపాదనలను పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్ లేదా తెలుగులో కాపీ ఒక్కింటికి రూ.10/- (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా అకౌంట్స్ ఆఫీసర్/సిటీ, ఏపిసిపిడిసియల్, విజయవాడ వారి పేరున డిడి రూపేణా) చొప్పున చెల్లించి పైన తెలిపిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవసరత, టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీల ప్రతిపాదనలు (ఏ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరచి తేది:05-01-2023 సా॥ 5.00 గం॥లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా గాని సదరు అభ్యంతరాల ప్రతులను ఏపిసిపిడిసియల్, కార్పొరేట్ కార్యాలయంలోని చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) "ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసియల్)", కార్పొరేట్ కార్యాలయం, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి ప్రక్కన, ఐటిఐ రోడ్, విజయవాడ-520008 గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు ప్రతిని పంపిన ఋజువును కమీషన్ సెక్రటరీ, ఏపిఈఆర్‌సికి పైన తెలిపిన చిరునామాకు పంపగలరు. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు తప్పనిసరిగా సంతకం చేయబడవలెను మరియు పూర్తి పేరు(లు), పోస్టల్ చిరునామా(లు) కలిగి ఉండవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరి తరుపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఇవ్వదలచినచో ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలను గాని / అభ్యంతరాలను గాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మౌఖికంగా విన్నవించుకోదలచుకుంటే ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచి జతపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నంబరు (వాట్సప్ నెం. & ఇమెయిల్ ఐడి)	సూచనలు/ అభ్యంతరాలు/ సలహాలు సంక్షిప్త వివరాలు	ఏపిసిపిడిసియల్ ప్రతిపాదనల మీద అభ్యంతరాలు	ఏపిసిపిడిసియల్ కార్పొరేట్ కార్యాలయంనకు అభ్యంతర ప్రతిని & పంపిన ఋజువును జతపరచడమైనది (అవును/కాదు)	అభ్యంతర దారు వీడియో సమావేశం ద్వారా స్వయంగా విచారణ కోరుచున్నారా (అవును/కాదు) అవును అయితే తమకు ఏ DE/EE ఆఫీసు నుండి హాజరౌతారనునేది తెలపండి

గమనిక: నిర్దేశిత గడువు తరువాత సమర్పించిన అభ్యంతరములను గౌరవ కమీషను వారిచే పరిగణించబడవు.

4. ఆర్థిక సంవత్సరం 2023-24 కొరకు లైసెన్సీల ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారం కొరకు ఏఆర్ఆర్, టారిఫ్ మరియు సిఎస్ఎస్ షెడ్యూలు సారాంశం

ఏపిసిపిడిసిఎల్ యొక్క ఏఆర్ఆర్ షెడ్యూలు

క్రమ సంఖ్య	వివరాలు	2023-24 అంచనాలు (రూ.కోట్లు)	క్రమ సంఖ్య	వివరాలు	2023-24 అంచనాలు (రూ.కోట్లు)
1	ట్రాన్స్ మిషన్ ఖర్చు	817.09	10	ఇతర ఖర్చులు, ఏవైనా ఉన్నట్లయితే	5.39
2	ఎస్.ఎల్.డి.సి ఖర్చు	10.07	11	పింఛన్ బాండ్లు పైన అదనపు వడ్డీ (APGENCO ఉత్తర్వు)	238.09
3	పంపిణీ ఖర్చు	2578.15			
4	పి.జి.సి.ఐ.యల్ ఖర్చు	364.10	12	సరఫరా వ్యయం (7+8+9+10+11)	8370.78
5	యు.ఎల్.డి.సి. ఛార్జీలు	0.74	13	సమగ్ర ఆదాయ అవసరత (6+12)	12140.92
6	నెట్‌వర్క్ మరియు ఎస్.ఎల్.డి.సి వ్యయం (1 + 2 + 3 + 4 + 5)	3770.14	14	మొత్తం రాబడి (15 + 16 + 17)	12140.92
			15	ప్రతిపాదిత ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ నుండి రాబడి	11668.12
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	8013.31	16	టారిఫేతర రాబడి	440.23
8	వినియోగదారుల ధరావత్తు మీద వడ్డీ	88.00	17	క్రాస్ సబ్సిడీ సర్ ఛార్జీ మరియు గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలు	32.57
9	రిటైల్ సరఫరా వ్యాపారంలో సరఫరా మార్జిన్	25.99	18	నికర ఆదాయ లోటు (14-13)	0.00

ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్

పి&టి కాలనీ, సీతమ్మధార, గురుద్వారా కూడలి ప్రక్కన, విశాఖపట్నం-530 013

బహిరంగ ప్రకటన

1. అందుబాటులోని ఏపిఈపిడిసియల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ మరియు రిటైల్ సరఫరా లైసెన్స్ నెం.12/2000 కలిగి ఉన్న పంపిణీ సంస్థ "ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసియల్)" 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవసరత, టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీల ప్రతిపాదనలను తేది:30-11-2022న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఈఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలు గౌరవ కమీషను వారిచే ఓ.పి.నెం.67/2022 గా నమోదు చేయబడినది.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు చీఫ్ జనరల్ మేనేజర్ (పి.పి.ఎ, ఆర్.ఎ.సి. & సోలార్ ఎనర్జీ) "ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసియల్)", కార్పొరేట్ కార్యాలయం, పి & టి కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-530013 మరియు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం మరియు ఏలూరు సర్కిల్‌లలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయముల వద్ద లభ్యమగును. ఆసక్తి గల వారు ఈ ప్రతిపాదనలను కార్యాలయం పనివేళలలో ఉచితంగా పరిశీలించవచ్చు. ఈ ప్రతిపాదనలు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ www.apeasternpower.com లో అందుబాటులో మరియు వీటిని www.aperc.gov.in వెబ్‌సైట్‌లో కూడా పొందవచ్చును. ప్రచురించిన తేదీ నుండి కాపీ ఒక్కింటికి రూ.100/- (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా పే ఆఫీసర్, ఏపిఈపిడిసియల్, విశాఖపట్నం వారి పేరున డిడి రూపేణా) చెల్లించిన మీదట ఈ ప్రతిపాదనలను పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్ లేదా తెలుగులో కాపీ ఒక్కింటికి రూ.10/- (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా పే ఆఫీసర్, ఏపిఈపిడిసియల్, విశాఖపట్నం వారి పేరున డిడి రూపేణా) చొప్పున చెల్లించి పైన తెలిపిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవసరత, టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీల ప్రతిపాదనలు (ఏ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరచి తేది:05-01-2023 సా॥ 5.00 గం॥లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా గాని సదరు అభ్యంతరాల ప్రతులను ఏపిఈపిడిసియల్, కార్పొరేట్ కార్యాలయంలోని చీఫ్ జనరల్ మేనేజర్ (పి.పి.ఎ, ఆర్.ఎ.సి & సోలార్ ఎనర్జీ), "ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసియల్)", కార్పొరేట్ కార్యాలయం, పి & టి కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం-530013 గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు ప్రతిని పంపిన ఋజువును కమీషన్ సెక్రటరీ, ఏపిఈఆర్‌సికి పైన తెలిపిన చిరునామాకు పంపగలరు. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు తప్పనిసరిగా సంతకం చేయబడవలెను మరియు పూర్తి పేరు(లు), పోస్టల్ చిరునామా(లు) కలిగి ఉండవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరి తరుపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఇవ్వదలచినచో ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలను గాని / అభ్యంతరాలను గాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మౌఖికంగా విన్నవించుకోదలచుకుంటే ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచి జతపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నంబరు (వాట్సప్ నెం. & ఇమెయిల్ ఐడి)	సూచనలు/ అభ్యంతరాలు/ సలహాలు సంక్షిప్త వివరాలు	ఏపిఈపిడిసియల్ ప్రతిపాదనల మీద అభ్యంతరాలు	ఏపిఈపిడిసియల్ కార్పొరేట్ కార్యాలయంనకు అభ్యంతర ప్రతిని & పంపిన ఋజువును జతపరచడమైనది (అవును/కాదు)	అభ్యంతర దారు వీడియో సమావేశం ద్వారా స్వయంగా విచారణ కోరుచున్నారా (అవును/కాదు) అవును అయితే తమకు ఏ DE/EE ఆఫీసు నుండి హాజరౌతారనునేది తెలపండి

గమనిక: నిర్దేశిత గడువు తరువాత సమర్పించిన అభ్యంతరములను గౌరవ కమీషను వారిచే పరిగణించబడవు.

4. ఆర్థిక సంవత్సరం 2023-24 కొరకు లైసెన్సీల ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారం కొరకు ఏఆర్ఆర్, టారిఫ్ మరియు సిఎస్ఎస్ షెడ్యూలు సారాంశం

ఏపిఈపిడిసిఎల్ యొక్క ఏఆర్ఆర్ షెడ్యూలు

క్రమ సంఖ్య	వివరాలు	2023-24 అంచనాలు (రూ.కోట్లు)	క్రమ సంఖ్య	వివరాలు	2023-24 అంచనాలు (రూ.కోట్లు)
1	ట్రాన్స్ మిషన్ ఖర్చు	1163.96	10	ఇతర ఖర్చులు, ఏవైనా ఉన్నట్లయితే	50.06
2	ఎస్.ఎల్.డి.సి ఖర్చు	15.61	11	పింఛన్ బాండ్లు పైన అదనపు వడ్డీ (APGENCO ఉత్తర్వు)	369.48
3	పంపిణీ ఖర్చు	3351.66			
4	పి.జి.సి.ఐ.యల్ ఖర్చు	565.03	12	సరఫరా వ్యయం (7+8+9+10+11)	14481.70
5	యు.ఎల్.డి.సి. ఛార్జీలు	1.15	13	సమగ్ర ఆదాయ అవసరత (6+12)	19579.01
6	నెట్‌వర్క్ మరియు ఎస్.ఎల్.డి.సి వ్యయం (1 + 2 + 3 + 4 + 5)	5097.31	14	మొత్తం రాబడి (15 + 16 + 17)	19579.01
			15	ప్రతిపాదిత ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ నుండి రాబడి	19087.17
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	13892.31	16	టారిఫేతర రాబడి	456.67
8	వినియోగదారుల ధరావత్తు మీద వడ్డీ	143.36	17	క్రాస్ సబ్సిడీ సర్ ఛార్జీల నుండి రాబడి	35.18
9	రిటైల్ సరఫరా వ్యాపారంలో సరఫరా మార్జిన్	26.48	18	నికర ఆదాయ గేపు (14-13)	0.00

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్

19-13-65/ఎ, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, తిరుపతి-517 503

బహిరంగ ప్రకటన

1. అందుబాటులోని ఏపిఎస్‌పిడిసియల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ మరియు రిటైల్ సరఫరా లైసెన్స్ నెం.15/2000 కలిగి ఉన్న పంపిణీ సంస్థ "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసియల్)" 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవసరత, టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీల ప్రతిపాదనలను తేది:30-11-2022 న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఈఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలను గౌరవ కమీషను వారిచే ఓ.పి.నెం.65/2022 గా నమోదు చేయబడినది.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు చీఫ్ జనరల్ మేనేజర్, (ఆర్ఏసి & ఐపిసి), "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసియల్)", కార్పొరేట్ కార్యాలయం, డోర్ నెం. 19-13-65/ఎ, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, తిరుపతి-517503 మరియు నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం మరియు కర్నూలు సర్కిల్‌లలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయముల వద్ద లభ్యమగును. ఆసక్తి గల వారు ఈ ప్రతిపాదనలను కార్యాలయం పనివేళలలో ఉచితంగా పరిశీలించవచ్చు. ఈ ప్రతిపాదనలు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ www.apspdcl.in లో అందుబాటులో మరియు వీటిని www.aperc.gov.in వెబ్‌సైట్‌లో కూడా పొందవచ్చును. ప్రచురించిన తేదీ నుండి కాపీ ఒక్కింటికి రూ.100/- (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా అకౌంట్స్ ఆఫీసర్/సిటీ, ఏపిఎస్‌పిడిసియల్, తిరుపతి వారి పేరున డిడి రూపేణా) చెల్లించిన మీదట ఈ ప్రతిపాదనలను పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్ లేదా తెలుగులో కాపీ ఒక్కింటికి రూ.10/- (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా అకౌంట్స్ ఆఫీసర్/సిటీ, ఏపిఎస్‌పిడిసియల్, తిరుపతి వారి పేరున డిడి రూపేణా) చొప్పున చెల్లించి పైన తెలిపిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవసరత, టారిఫ్ మరియు క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జీల ప్రతిపాదనలు (ఏ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరచి తేది:05-01-2023 సా॥ 5.00 గం॥లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా గాని సదరు అభ్యంతరాల ప్రతులను ఏపిఎస్‌పిడిసియల్, కార్పొరేట్ కార్యాలయంలోని చీఫ్ జనరల్ మేనేజర్, (ఆర్ఏసి & ఐపిసి), "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసియల్)", కార్పొరేట్ కార్యాలయము, డోర్ నెం. 19-13-65/ఎ, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, తిరుపతి-517503 గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు ప్రతిని పంపిన ఋజువును కమీషన్ సెక్రటరీ, ఏపిఈఆర్‌సికి పైన తెలిపిన చిరునామాకు పంపగలరు. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు తప్పనిసరిగా సంతకం చేయబడవలెను మరియు పూర్తి పేరు(లు), పోస్టల్ చిరునామా(లు) కలిగి ఉండవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరి తరుపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఇవ్వదలచినచో ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలను గాని / అభ్యంతరాలను గాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మౌఖికంగా విన్నవించుకోదలచుకుంటే ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచి జతపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నంబరు (వాట్సప్ నెం. & ఇమెయిల్ ఐడి)	సూచనలు/ అభ్యంతరాలు/ సలహాలు సంక్షిప్త వివరాలు	ఏపిఎస్‌పిడిసియల్ ప్రతిపాదనల మీద అభ్యంతరాలు	ఏపిఎస్‌పిడిసియల్ కార్పొరేట్ కార్యాలయంనకు అభ్యంతర ప్రతిని & పంపిన ఋజువును జతపరచడమైనది (అవును/కాదు)	అభ్యంతర దారు వీడియో సమావేశం ద్వారా స్వయంగా విచారణ కోరుచున్నారా (అవును/కాదు) అవును అయితే తమకు ఏ DE/EE ఆఫీసు నుండి హాజరౌతారనునేది తెలపండి

గమనిక: నిర్దేశిత గడువు తరువాత సమర్పించిన అభ్యంతరములను గౌరవ కమీషను వారిచే పరిగణించబడవు.

4. ఆర్థిక సంవత్సరం 2023-24 కొరకు లైసెన్సీల ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారం కొరకు ఏఆర్ఆర్, టారిఫ్ మరియు సిఎస్ఎస్ షెడ్యూలు సారాంశం

ఏపిఎస్‌పిడిసిఎల్ యొక్క ఏఆర్ఆర్ షెడ్యూలు

క్రమ సంఖ్య	వివరాలు	2023-24 అంచనాలు (రూ.కోట్లు)	క్రమ సంఖ్య	వివరాలు	2023-24 అంచనాలు (రూ.కోట్లు)
1	ట్రాన్స్ మిషన్ ఖర్చు	1415.79	10	ఇతర ఖర్చులు, ఏవైనా ఉన్నట్లయితే	68.43
2	ఎస్.ఎల్.డి.సి ఖర్చు	50.81	11	పింఛన్ బాండ్లు పైన అదనపు వడ్డీ (APGENCO ఉత్తర్వు)	412.53
3	పంపిణీ ఖర్చు	4414.29			
4	పి.జి.సి.ఐ.యల్ ఖర్చు	769.41	12	సరఫరా వ్యయం (7+8+9+10+11)	14219.20
5	యు.ఎల్.డి.సి. ఛార్జీలు	1.28	13	సమగ్ర ఆదాయ అవసరత (6+12)	20870.78
6	నెట్‌వర్క్ మరియు ఎస్.ఎల్.డి.సి వ్యయం (1 + 2 + 3 + 4 + 5)	6651.58	14	మొత్తం రాబడి (15 + 16 + 17)	20870.78
			15	ప్రతిపాదిత ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ నుండి రాబడి	19452.50
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	13555.63	16	టారిఫేతర రాబడి	1312.10
8	వినియోగదారుల ధరావత్తు మీద వడ్డీ	137.67	17	క్రాస్ సబ్సిడీ సర్ ఛార్జీ మరియు గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలు	106.18
9	రిటైల్ సరఫరా వ్యాపారంలో సరఫరా మార్జిన్	45.04	18	నికర ఆదాయ గేపు (14-13)	0.00

ఆర్థిక సంవత్సరం 2023-24 నకు రిటైల్ సరఫరా వ్యాపారం కొరకు ప్రతిపాదించిన టారిఫ్ షెడ్యూలు దిగువ తెలుపబడినది

కేటగిరి	వినియోగదారుని కేటగిరి	ఎల్ టి సరఫరా: స్థిర/డిమాండ్ ఛార్జీలు నెలకు (రూ./హెచ్ పి లేక కిలో వాటు)	ఎల్ టి సరఫరా: ఎనర్జీ ఛార్జీలు (రూ./యూనిట్)	జి.ఓ.ఆర్.టి.నెం.161, తేది:15-11-2021 ప్రకారం ప్రతిపాదించిన ఫుల్ కాస్ట్ రికవరీ ఛార్జీలు రూ./యూనిట్: ఏపిసిపిడిసిఎల్	ఏపిఈపిడిసిఎల్	ఏపిఎస్‌పిడిసిఎల్	బిల్లింగ్ యూనిట్	హెచ్‌టి సరఫరా: స్థిర/డిమాండ్ ఛార్జీలు నెలకు (రూ./కెవిఎ)	ఎనర్జీ ఛార్జీలు (రూ./యూనిట్): 11కెవి	33కెవి	132కెవి	220కెవి	ఫుల్ కాస్ట్ రికవరీ ఛార్జీలు
I	గృహ వినియోగం												ఏపిసిపిడిసిఎల్, ఏపిఈపిడిసిఎల్ మరియు ఏపిఎస్‌పిడిసిఎల్ లకు సంబంధించి అన్ని కేటగిరి వారికి ప్రతిపాదిత సమానంగా ఫుల్‌కాస్ట్ రికవరీ ఛార్జీలు ఉంటాయి.
	ఎ) గృహోపకరణము (టెలిస్కోపిక్)												
	0-30		1.90	4.14	3.91	4.60	kWh	-	-	-	-	-	
	31-75		3.00	4.66	4.59	5.60	kWh	-	-	-	-	-	
	76-125	10	4.50	6.10	4.69	6.60	kWh	-	-	-	-	-	
	126-225		6.00	7.84	6.00	7.57	kWh	-	-	-	-	-	
	226-400		8.75	8.75	8.75	8.75	kWh	-	-	-	-	-	
	>400		9.75	9.75	9.75	9.75	kWh	-	-	-	-	-	
	నెల ఒక్కింటికి 500 యూనిట్లు పైబడి వినియోగిస్తున్న వినియోగదారులు స్మార్ట్ మీటర్లు ఎంపిక చేసుకోవచ్చును మరియు అట్టి వినియోగదారులకు ఉ.గం. 10.00 నుండి మ.గం. 12.00 మధ్య వినియోగమునకు యూనిట్ ఒక్కింటికి రూ.1/- చొప్పున టిఓడి తగ్గింపు వర్తిస్తుంది.												
	బి) టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు		-	-	-	-	kVAh	75	7.00	7.00	7.00	7.00	
II	వాణిజ్యము మరియు ఇతరములు												
	ఎ (i): వాణిజ్యము												
	0-50		5.40	5.40	5.40	5.40	kWh/kVAh						
	51-100		7.65	7.65	7.65	7.65	kWh/kVAh						
	101-300	75	9.05	9.05	9.05	9.05	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65	
	301-500		9.60	9.60	9.60	9.60	kWh/kVAh						
	500 యూనిట్లు పైబడి		10.15	10.15	10.15	10.15	kWh/kVAh						
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి)-పీక్ (సా॥ 6.00 నుండి రా॥ 10.00 వరకు)	-	-	-	-	-	kWh/kVAh		8.65	7.95	7.70	7.65	
	(ii) ప్రకటనల హోర్డింగులు	100	12.25	12.25	12.25	12.25	kWh/kVAh	-	-	-	-	-	
	(iii) ఫంక్షన్ హాల్‌లు / ఆడిటోరియంలు	-	12.25	12.25	12.25	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25	
	బి) స్టార్టప్ పవర్	-	12.25	12.25	12.25	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25	
	సి) విద్యుత్ వాహనాలు (ఇవిలు) / ఛార్జింగ్ స్టేషన్‌లు	-	6.70	6.70	6.70	6.70	kWh/kVAh	-	6.70	6.70	6.70	6.70	
	డి) గ్రీన్ పవర్	-	12.25	12.25	12.25	12.25	kWh/kVAh	-	12.25	12.25	12.25	12.25	
III	పరిశ్రమలు												
	(ఎ) : పరిశ్రమలు (సాధారణ)	75	6.70	6.70	6.70	6.70	kWh/kVAh		-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) (అధిక గ్రిడ్ డిమాండ్) (ఫిబ్రవరి '24, మార్చి '24), (ఏప్రిల్ '23 - మే '23) & (సెప్టెంబర్ '23 - అక్టోబర్ - '23)												
	పీక్ (06-10) & (18-22)	-	-	-	-	-	kWh/kVAh		7.80	7.35	6.90	6.85	
	ఆఫ్-పీక్ (10-15) & (00-06)	-	-	-	-	-	kWh/kVAh		5.55	5.10	4.65	4.60	
	సాధారణం (15-18) & (22-24)	-	-	-	-	-	kWh/kVAh	475	6.30	5.85	5.40	5.35	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) (తక్కువ గ్రిడ్ డిమాండ్) (జూన్ '23-ఆగస్ట్-'23) & (నవంబర్ '23 - జనవరి '24)												
	పీక్ (06-10) & (18-22)	-	-	-	-	-	kWh/kVAh		7.30	6.85	6.40	6.35	
	ఆఫ్-పీక్ (10-15) & (00-06)	-	-	-	-	-	kWh/kVAh		5.55	5.10	4.65	4.60	
	సాధారణం (15-18) & (22-24)	-	-	-	-	-	kWh/kVAh		6.30	5.85	5.40	5.35	
	పరిశ్రమలు కాలనీలు	-	-	-	-	-	kWh/kVAh	-	7.00	7.00	7.00	7.00	
	(బి) : సీజనల్ పరిశ్రమలు (ఆఫ్ సీజన్)	75	7.45	7.45	7.45	7.45	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65	
	(సి) : ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు												
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) (అధిక గ్రిడ్ డిమాండ్) (ఫిబ్రవరి '24, మార్చి '24), (ఏప్రిల్ '23 - మే '23) & (సెప్టెంబర్ '23 - అక్టోబర్ - '23)												
	పీక్ (06-10) & (18-22)	-	-	-	-	-	kWh/kVAh		7.30	6.85	6.45	6.40	
	ఆఫ్-పీక్ (10-15) & (00-06)	-	-	-	-	-	kWh/kVAh		5.05	4.60	4.20	4.15	
	సాధారణం (15-18) & (22-24)	-	-	-	-	-	kWh/kVAh	475	5.80	5.35	4.95	4.90	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఓడి) (తక్కువ గ్రిడ్ డిమాండ్) (జూన్ '23-ఆగస్ట్-'23) & (నవంబర్ '23 - జనవరి '24)												
	పీక్ (06-10) & (18-22)	-	-	-	-	-	kWh/kVAh		6.80	6.35	5.95	5.90	
	ఆఫ్-పీక్ (10-15) & (00-06)	-	-	-	-	-	kWh/kVAh		5.05	4.60	4.20	4.15	
	సాధారణం (15-18) & (22-24)	-	-	-	-	-	kWh/kVAh		5.80	5.35	4.95	4.90	
	(డి) : కుటీర పరిశ్రమలు 10 హెచ్ పి* వరకు	20	3.75	3.75	3.75	3.75	kWh/kVAh	-	-	-	-	-	
	*-గవర్నమెంట్ జారీ చేసిన ఉత్తర్వులు సూచిక జి.ఓ. ఆర్.టి.నెం. 75, తేది. 27-06-2018 ప్రకారం ధోబి ఘాట్లకు ఉచిత విద్యుత్ సరఫరాను విస్తరించాలి												
IV	ఇన్‌స్టిట్యూషనల్												
	(ఎ) : యుటిలిటీలు (వీధి దీపాలు, యన్.టి.ఆర్ సుజల పథకం, సివరేజ్ స్కీమ్స్ మరియు పిడబ్ల్యుయస్)	75	7.00	7.00	7.00	7.00	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65	
	(బి) : సాధారణ ప్రయోజనాలు	75	7.00	7.00	7.00	7.00	kWh/kVAh	475	7.95	7.25	7.00	6.95	
	(సి) : మత సంబంధమైన ప్రదేశాలు	30	5.00	5.00	5.00	5.00	kWh/kVAh	30	5.00	5.00	5.00	5.00	
	(డి) : రైల్వే ట్రాక్షన్	-	-	-	-	-	KVAh	350	5.50	5.50	5.50	5.50	
V	వ్యవసాయం మరియు సంబంధిత												
	(ఎ) : వ్యవసాయం												
	(i) కార్పోరేట్ రైతులు	-	3.50	7.57	7.41	3.50	kWh	-	-	-	-	-	
	(ii) కార్పోరేట్ రైతులు కానివారు	-	-	8.03	7.52	8.19	-	-	-	-	-	-	
	(iii) ఉప్పు తయారీ కేంద్రాలు 15 హెచ్ పి. వరకు	-	2.50	7.62	7.48	2.50	kWh/kVAh	-	-	-	-	-	
	(iv) చెరుకు గానుగ	-	-	6.66	7.39	8.19	-	-	-	-	-	-	
	(v) గ్రామీణ ఉద్యానవన నర్సరీలు	-	-	7.76	7.52	8.19	-	-	-	-	-	-	
	(vi) ఫ్లోరీ కల్చర్ ఇన్ గ్రీన్ హౌస్	75	4.50	4.50	4.50	4.50	kWh/kVAh	-	-	-	-	-	
	(బి) : ఆక్వా కల్చర్ మరియు పశు సంవర్ధక	30	3.85	7.50	7.22	3.85	kWh/kVAh	30	3.85	3.85	3.85	3.85	
	(డి) : వ్యవసాయ ఆధారిత కుటీర పరిశ్రమలు 10 హెచ్ పి వరకు	20	3.75	7.45	6.91	3.75	kWh/kVAh	-	-	-	-	-	
	(ఇ) : ప్రభుత్వ మరియు ప్రైవేటు ఎత్తిపోతల స్కీములు	-	6.40	7.75	6.40	6.40	kVAh	-	7.15	7.15	7.15	7.15	

గమనిక: i. హెచ్‌టి ఎనర్జీ ఇన్‌టెన్సివ్ పరిశ్రమల వినియోగదారులు తప్పనిసరిగా సంవత్సరమునకు 6701 KVAh/KVA (సగటు సిఎండి మీద లేదా సగటు వాస్తవ డిమాండ్ మీద ఏది అధికంగా వుంటే దాని మీద) చొప్పున వినియోగించవలెను. వాస్తవ వార్షిక వినియోగము 6701 KVAh/KVA కన్నా తగ్గినచో ఆ వినియోగమును డీమ్డ్ వినియోగము క్రింద బిల్లింగు చేయడం జరుగుతుంది. ii. అన్ని ఇతర షరతులు ఆర్థిక సంవత్సరం 2022-23 నందలి రిటైల్ టారిఫ్ షెడ్యూలు యొక్క చాప్టర్-X ప్రకారం ఉంటాయి.

ఆర్థిక సంవత్సరం 2023-24 కొరకు ప్రతిపాదించిన క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ ధరలు క్రింద తెలుపబడినవి

కేటగిరి		హెచ్‌టి సరఫరా	వర్తించే సియస్‌యస్ (రూ/యూనిట్): ఏపిసిపిడిసిఎల్	ఏపిఈపిడిసిఎల్	ఏపిఎస్‌పిడిసిఎల్
11 కెవి వద్ద					
I	B	టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	1.06	1.12	1.01
II	A (i)	వాణిజ్యము	2.14	2.20	2.11
II	A(iii)	ఫంక్షన్ హాలులు / ఆడిటోరియంలు	2.45	2.45	2.45
II	B	స్టార్టప్ పవర్	2.45	2.45	2.45
II	D	గ్రీన్ పవర్	2.48	-	2.45
III	A	పరిశ్రమలు సాధారణ	1.69	1.73	1.66
III	B	సీజనల్ పరిశ్రమలు	2.45	2.67	3.10
III	C	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.72	-	1.68
IV	A	యుటిలిటీలు	1.90	1.93	1.91
IV	B	సాధారణ ప్రయోజనము	2.09	2.25	2.18
V	E	ప్రభుత్వ / ప్రైవేట్ లిఫ్ట్ ఇరిగేషన్	0.67	0.60	0.69
33 కె.వి. వద్ద					
I	B	టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	1.55	1.46	1.54
II	A (i)	వాణిజ్యము	1.97	1.91	1.89
II	A(iii)	ఫంక్షన్ హాలులు / ఆడిటోరియంలు	-	-	2.45
II	B	స్టార్టప్ పవర్	2.45	2.45	2.45
II	D	గ్రీన్ పవర్	-	-	2.45
III	A	పరిశ్రమలు సాధారణ	1.54	1.47	1.49
III	B	సీజనల్ పరిశ్రమలు	-	1.84	2.63
III	C	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.88	1.01	0.85
IV	A	యుటిలిటీలు	-	1.60	1.79
IV	B	సాధారణ ప్రయోజనము	2.10	-	2.30
V	E	ప్రభుత్వ / ప్రైవేట్ లిఫ్ట్ ఇరిగేషన్	1.43	1.43	1.43
132 కె.వి. వద్ద					
II	A (i)	వాణిజ్యము	-	1.62	1.66
II	A (iii)	ఫంక్షన్ హాలులు / ఆడిటోరియంలు	-	-	2.45
II	B	స్టార్టప్ పవర్	-	2.45	2.45
II	D	గ్రీన్‌పవర్	-	-	2.45
III	A	పరిశ్రమలు సాధారణ	1.36	1.37	1.34
III	C	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	-	0.89	1.00
IV	D	రైల్వే ట్రాక్షన్	1.36	1.33	1.41
V	E	ప్రభుత్వ / ప్రైవేట్ లిఫ్ట్ ఇరిగేషన్	1.43	-	1.43
220 కె.వి. వద్ద					
II	A(i)	వాణిజ్యము	-	1.96	-
II	B	స్టార్టప్ పవర్	-	2.45	-
III	A	పరిశ్రమలు సాధారణ	-	1.32	1.41
III	C	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	-	0.67	-
IV	D	రైల్వే ట్రాక్షన్	-	-	1.46
V	E	ప్రభుత్వ / ప్రైవేట్ లిఫ్ట్ ఇరిగేషన్	-	1.43	1.43

లైసెన్సీల ఏఆర్ఆర్, టారిఫ్ & సి.యస్.యస్ విచారణ షెడ్యూలు

5. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని అందరు భాగస్వాములకు అవకాశం కల్పించుట కొరకు వీడియో సమావేశం ద్వారా విచారణ నిర్వహించుటకు కమీషన్ నిర్ణయం తీసుకోవడం జరిగినది. 3 డిస్కంలకు సంబంధించిన ఈ విచారణలు 19-01-2023, 20-01-2023 మరియు 21-01-2023 తేదీలలో ఉ॥గం.10:30 నుండి మ॥గం.1:00 వరకు మరియు మ॥గం.2:00 నుండి సా॥గం.4:30 నిల వరకు నిర్వహిస్తారు.

తేది: 19-01-2023 (గురువారం) షెడ్యూలు

ఉ.గం.10:30 నుండి ఉ.గం.10:35	కమీషన్ సెక్రటరీ ప్రారంభ వ్యాఖ్యలు
ఉ.గం.10:35 నుండి ఉ.గం.10:40	గౌరవ ఛైర్మన్ APERC వారి వ్యాఖ్యలు
ఉ.గం.10:40 నుండి ఉ.గం.11:30	డిస్కంల సమర్పణలు
ఉ.గం.11:30 నుండి మ.గం.1:00	ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
మ.గం.1:00 నుండి మ.గం.2:00	మధ్యాహ్న భోజన విరామం
మ.గం.2:00 నుండి సా.గం.4:30	ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు

తేది: 20-01-2023 (శుక్రవారం) షెడ్యూలు

ఉ.గం.10:30 నుండి మ.గం.1:00	ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
మ.గం.1:00 నుండి మ.గం.2:00	మధ్యాహ్న భోజన విరామం
మ.గం.2:00 నుండి సా.గం.4:30	ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు

తేది: 21-01-2023 (శనివారం) షెడ్యూలు

ఉ.గం.10:30 నుండి మ.గం.1:00	ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
మ.గం.1:00 నుండి మ.గం.2:00	మధ్యాహ్న భోజన విరామం
మ.గం.2:00 నుండి మ.గం.3:00	ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
మ.గం.3:00 నుండి సా.గం.4:30	డిస్కంల స్పందన

6. బహిరంగ విచారణలో వీడియో సమావేశం ద్వారా పాల్గొనగోరు ఆసక్తి కల సభ్యులు తమ ఉద్దేశాన్ని ముందస్తుగా డిస్కంకు తెలియజేస్తూ కమీషన్‌కు నకలు సమర్పించవలెను. ఆ ఉద్దేశంలో సభ్యుడు సమీపములోని ఏ కార్యనిర్వాహక ఇంజనీరు/డివిజనల్ ఇంజనీరు కార్యాలయము నుండి తన అభిప్రాయములను సమర్పించాలనుకుంటున్నారో ఆ కార్యాలయమును తెలియజేయాలి.
7. రోజువారీగా తమ దృక్పథం (ఆలోచన) వెలిబుచ్చే అభ్యంతర దారుల పేర్ల జాబితాను కమీషను తమ వెబ్‌సైట్ నందు ఉంచుతుంది. 8. తమ మౌఖిక సమర్పణలు చేయుటకు ఇంతకుపూర్వం తెలియజేయని వ్యక్తుల నుండి ఏదైనా డిఈ/ఈఈ ఆఫీసుకు అభ్యర్థనలు అందితే వారిని షెడ్యూలులోని అభ్యంతరములు విన్న తరువాత విచారణ రోజున సంబంధిత డిఈ/ఈఈ వీడియో సమావేశం ద్వారా కమీషన్‌కు తెలియపరుస్తారు. కమీషన్ అనుమతించినచో అట్టి వ్యక్తులు సమర్పణలు చేయవచ్చును. డిస్కంలు సమావేశపు లింకును ఏర్పాటుచేసి, ప్రజలు డిఈ కార్యాలయమునకు వెళ్ళనవసరము లేకుండా తమ వ్యక్తిగత ఉపకరణముల ద్వారా అభ్యంతరములను వీడియో సమావేశం పద్ధతిలో సమర్పించుటకు పత్రికలలో వేరుగా లింకును ప్రచురించును. 9. పైన తెలిపిన మూడు రోజులు విశాఖపట్నంలో వున్న APEPDCL సమావేశమందిరము నందు కమీషను వారు సమావేశమగుదురు. 10. బహిరంగ విచారణలు ప్రత్యక్ష ప్రసారం చేయబడతాయి. ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించే పద్ధతి మరియు విధానం విడిగా ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచురించబడుతుంది.

తేది: 15-12-2022
ప్రదేశం: విజయవాడ

ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్

తేది: 15-12-2022
ప్రదేశం: విశాఖపట్నం

ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్

తేది: 15-12-2022
ప్రదేశం: తిరుపతి

ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్

రైళ్లలో వృద్ధులకు రాయితీలు ఇప్పుడే కాదు: కేంద్రం

న్యూఢిల్లీ: రైల్వేలపై ఖర్చుల భారం విపరీతంగా పెరిగిపోతోందని ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గతేడాది ప్యాసింజర్ సేవలకు రూ.59,000 కోట్ల రాయితీలు ఇచ్చామని, పెన్షన్లు, జీతాల బిల్లు భారీగానే ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైళ్లలో వృద్ధులకు రాయితీలను ఇప్పట్లో పునరుద్ధరించే అవకాశం లేదని పరోక్షంగా చెప్పారు. వాటిని కరోనా సమయంలో రద్దు చేయడం తెలిసిందే. ''ప్రయాణికుల సేవలకు ఏటా రూ.59,000 కోట్ల రాయితీలివ్వడం మామూలు విషయం కాదు. పైగా రూ.60,000 కోట్ల పెన్షన్ బిల్లు, రూ.97,000 కోట్ల జీతాల బిల్లు, రూ.40,000 కోట్ల ఇంధన ఖర్చు భరించాల్సి వస్తోంది. కొత్త నిర్ణయాలు తీసుకొనే ముందు రైల్వేల ఆర్థిక పరిస్థితినీ పరిగణనలోకి తీసుకోవాలి'' అని ఆయన చెప్పారు.

క్లుప్తంగా...

కల్తీ సారా కాటుకు బిహార్‌లో 21 మంది బలి

పట్నా: మద్య నిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో శరన్ జిల్లాలో బుధవారం కల్తీ సారా కాటుకు 21 మంది బలయ్యారు. వారంతా మంగళవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని ప్రొహిబిషన్ మంత్రి సునీల్ కుమార్ చెప్పారు. ఇది బుధవారం అసెంబ్లీని కుదిపివేసింది. సారాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విపక్ష బీజేపీ సభ్యులు ఆరోపించారు. వారిపై సీఎం నితీశ్ కుమార్ మండిపడ్డారు.

ఎయిమ్స్ సర్వర్ల హ్యాకింగ్ చైనా ముఠాల పనే!

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ప్రతిష్టాత్మక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) సర్వర్లపై సైబర్ దాడికి పాల్పడింది చైనా, హాంకాంగ్ ముఠాలేనని అనుమానిస్తున్నట్లు అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. ఎయిమ్స్ సర్వర్లు నవంబర్ 23న హ్యాకింగ్‌కు గురైన సంగతి తెలిసిందే. దీంతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. అధికారుల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన ఇంటెలిజెన్స్ ఫ్యూజన్, స్ట్రాటజిక్ ఆపరేషన్స్(ఐఎఫ్ఎస్ఓ) విభాగం నవంబర్ 25న 'సైబర్ టెర్రరిజం' కేసు నమోదు చేసింది. ఢిల్లీ ఎయిమ్స్‌లో 40 ఫిజికల్, 100 వర్చువల్ సర్వర్లు ఉన్నాయి. వీటిలో కొన్ని సర్వర్లలో వైరస్ ఆనవాళ్లు కనిపించాయి. వీటిలోని డేటాను సురక్షితంగా పునరుద్ధరించారు. చైనా, హాంకాంగ్‌లోని కొన్ని ప్రాంతాల నుంచే సర్వర్లను హ్యాకింగ్ చేసినట్లు అనుమానిస్తున్నారు. చైనా సైబర్ నేరగాళ్ల సమాచారం ఇంటర్‌పోల్ ద్వారా సేకరించేందుకు ఢిల్లీ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

1,472 ఐఏఎస్, 864 ఐపీఎస్ ఖాళీలు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 1,472 ఐఏఎస్, 864 ఐపీఎస్, 1,057 ఇండియన్ ఫారెస్ట్ సర్వీసు(ఐఎఫ్ఎస్) పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రకటించింది. 2022 జనవరి 1వ తేదీ నాటికి దేశంలో శాంక్షన్డ్ ఐఏఎస్ పోస్టులు 6,789, ఐపీఎస్ పోస్టులు 4,984, ఐఎఫ్ఎస్ పోస్టులు 3,191 ఉన్నాయని కేంద్ర సిబ్బంది వ్యవహారాల సహాయ మంత్రి జితేంద్రసింగ్ బుధవారం సభలో లిఖితపూర్వకంగా తెలియజేశారు. ప్రస్తుతం 5,317 ఐఏఎస్ అధికారులు, 4,120 ఐపీఎస్ అధికారులు, 2,134 ఐఎఫ్ఎస్ అధికారులు పనిచేస్తున్నారని వెల్లడించారు. ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రభుత్వ విభాగాల్లో 9.79 లక్షల ఖాళీలు

కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో 2021 మార్చి 1 నాటికి ఏకంగా 9.79 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జితేంద్ర సింగ్ లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. వీటి భర్తీకి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

9 రాష్ట్రాలు సీబీఐకి 'నో'

న్యూఢిల్లీ: ముందస్తు అనుమతిలేకుండా తమ రాష్ట్రాల్లో కేసులను దర్యాప్తు చేయడానికి వీల్లేదంటూ సీబీఐని తొమ్మిది రాష్ట్రాలు నిరోధించాయని కేంద్రం బుధవారం వెల్లడించింది. తెలంగాణ, పశ్చిమబెంగాల్, కేరళ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మేఘాలయ, మిజోరం, పంజాబ్ రాష్ట్రాలు నిర్ణయం తీసుకున్నాయని మంత్రి జితేంద్రసింగ్ సభలో పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వంతో బేదాభిప్రాయాలు, ఇతరత్రా ప్రత్యేక కారణాలను చూపుతూ కొన్ని రాష్ట్రాలు సీబీఐకి సాధారణ అనుమతికి నిరాకరించిన విషయం తెల్సిందే. ఈ విషయాన్ని కేంద్రం బుధవారం పార్లమెంట్ సాక్షిగా వెల్లడించింది.

వారసత్వ ముద్రను పనితీరుతో తొలగిస్తా: ఉదయనిధి

సాక్షి, చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ చీఫ్, ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్(45) బుధవారం రాష్ట్ర మంత్రిగా ప్రమాణంచేశారు. చపాక్-తిరువల్లికేని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అయిన ఉదయనిధిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని డీఎంకే వర్గాలు ఎప్పటినుంచో డిమాండ్‌చేస్తున్న సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలో చెన్నైలో గవర్నర్ అధికార నివాసం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవి ఈయన చేత మంత్రిగా ప్రమాణంచేయించారు. పార్టీలో యువజన విభాగం కార్యదర్శి అయిన ఈయనకు యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖను డీఎంకే సర్కార్ కేటాయించింది. కుటుంబ రాజకీయాలను విమర్శించే వారికి తన అద్భుత పనితీరు ద్వారా సమాధానం చెప్తానని ఈ సందర్భంగా ఉదయనిధి వ్యాఖ్యానించారు. తమిళనాడు రాష్ట్రాన్ని దేశానికే క్రీడా రాజధానిగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

అసహజమేనా!

స్వలింగ సంపర్కంపై మారుతున్న దృక్కోణం • హీనంగా చూసే స్థాయి నుంచి హక్కు దాకా • స్వలింగ వివాహాలకు పలు దేశాల్లో చట్టబద్ధత



స్వలింగ సంపర్కం. అసహజ లైంగిక ప్రవృత్తి. ఇది కొత్తదేమీ కాదు. ఒకసారి చరిత్రలోకి తొంగి చూస్తే అన్ని సమాజాల్లోనూ, అన్ని కాలాల్లోనూ అనివార్యంగా కన్పించే ధోరణే. కానీ కొన్ని దశాబ్దాల క్రితం దాకా దీనికి సమాజం ఆమోదం లేదు. సరికదా, ఇందుకు పాల్పడే వారిని దోషుల్లా పరిగణిస్తూ హీనంగా చూసే ధోరణే చాలా సమాజాల్లో ఉండేది. ప్రఖ్యాత ఆంగ్ల రచయిత ఆస్కార్ వైల్డ్‌ను కూడా గే సెక్స్‌కు పాల్పడ్డారంటూ జైల్లో పెట్టారు! అత్యంత ప్రగతిశీల దేశంగా చెప్పుకునే ఇంగ్లండ్‌లో కూడా వందేళ్ల క్రితం ఇదీ పరిస్థితి! ఇప్పటికీ ఐరాస సభ్య దేశాల్లో 76కు పైగా స్వలింగ సంపర్కులపై వివక్షపూరితమైన చట్టాలను అమలు చేస్తున్నాయి. అయితే గత పాతికేళ్లుగా ఈ విషయంలో పౌర సమాజం దృక్కోణంలో చెప్పుకోదగ్గ మార్పు కన్పిస్తోంది. లైంగిక ప్రవృత్తి విషయంలో స్వేచ్ఛ కూడా ప్రాథమిక హక్కు వంటిదేనన్న వాదనలూ బయల్దేరాయి. అగ్రరాజ్యమైన అమెరికాలో ఈ సంబంధాలకు సమర్థన 1990ల్లో 20 శాతం లోపే ఉండగా 2020 నాటికి 70 శాతానికి పైగా పెరిగింది! తాజాగా స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తూ అధ్యక్షుడు బైడెన్ సంతకం కూడా చేశారు. ఐక్యరాజ్యసమితితో పాటు పలు అంతర్జాతీయ సంస్థలు, హక్కుల సంఘాలు కూడా స్వలింగ సంపర్కానికి, ఆ వివాహాలకు కొన్నేళ్లుగా ఎంతగానో మద్దతిస్తున్నాయి. స్వలింగ వివాహాలను తొలిసారిగా 2000లో నెదర్లాండ్స్ చట్టబద్ధం చేసింది. ఆ తర్వాత ఇప్పటిదాకా 34 దేశాల్లో చట్టపరంగానో, కోర్టు ఆదేశాల రూపేణో అందుకు ఆమోదం లభించింది. ఐరాస సభ్య దేశాల్లో భారత్‌తో పాటు మొత్తం 71 దేశాలు స్వలింగ సంపర్కాన్ని నేరాల జాబితా నుంచి తొలగించాయి.

ఆసియా దేశాల్లో...

దక్షిణ, మధ్య ఆసియాతో పాటు ఆఫ్రికాలోని పలు దేశాల్లో స్వలింగ సంపర్కం, వివాహాలపై తీవ్ర వ్యతిరేకత, నిషేధం అమల్లో ఉన్నాయి. ఆసియాలో ఈ వివాహాలకు చట్టబద్ధత కల్పించిన తొలి దేశంగా తైవాన్ నిలిచింది. అలాగే చైనా కూడా స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించడం లేదు. అయితే వారి వివాహాన్ని మాత్రం నేరంగానే చూస్తోంది. వియత్నాం కూడా ఇవి నేరం కాదని పేర్కొన్నా ఇంకా పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించలేదు.

ఆ దేశాల్లో మరణశిక్షే...

సౌదీ అరేబియా, సుడాన్, యెమన్, ఇరాన్‌ల్లో స్వలింగ సంపర్కానికి పాల్పడితే మరణశిక్షే! నైజీరియా, సోమాలియాల్లోనూ కొన్ని ప్రావిన్సుల్లో ఇదే పరిస్థితి! అసహజ రతి, వివాహేతర సంబంధాలతో పాటు స్వలింగ సంపర్కులను కూడా రాళ్లతో కొట్టి చంపే శిక్షలు అరబ్ దేశాలతో పాటు పలు ఇతర దేశాల్లో అమల్లో ఉన్నాయి. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, యూఏఈ, ఖతార్ వంటి దేశాల్లోనూ ఇందుకు మరణశిక్ష విధించే అవకాశముంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్రూనై మాత్రం స్వలింగ సంపర్కాలకు మరణశిక్ష అమలు చేయబోమని ప్రకటించడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్‌లో పరిస్థితి?

మన దేశంలో ఆది నుంచీ స్వలింగ సంపర్కంపై చిన్నచూపే ఉంటూ వచ్చింది. బ్రిటిష్ వారి హయాంలో దీనిపై నిషేధం విధించారు. సుప్రీంకోర్టు కూడా ఇది ప్రకృతి విరుద్ధమని, శిక్షార్హమైన నేరమేనని 2013లో తీర్పు చెప్పింది. ఇది దేశవ్యాప్తంగా తీవ్ర వాదోపవాదాలకు దారి తీసింది. ఐపీసీ సెక్షన్ 377 ప్రకారం స్వలింగ సంపర్కం నాన్ బెయిలబుల్ నేరం. దీనికి పదేళ్ల దాకా జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. దీన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు స్వలింగ సంపర్కం ఎంతమాత్రమూ నేరం కాదని పేర్కొంటూ 2018లో చరిత్రాత్మక తీర్పు వెలువరించింది.

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత ఉన్న దేశాలు

చిలీ, స్విట్జర్లాండ్, కోస్టారికా, ఈక్వెడార్, తైవాన్, ఆస్ట్రియా, ఆస్ట్రేలియా, మాల్టా, జర్మనీ, కొలంబియా, అమెరికా, గ్రీన్‌లాండ్, ఐర్లండ్, ఫిన్లండ్, లగ్జెంబర్గ్, స్కాట్లండ్, ఇంగ్లండ్, బ్రెజిల్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, ఉరుగ్వే, డెన్మార్క్, అర్జెంటీనా, పోర్చుగల్, ఐస్‌లాండ్, స్వీడన్, మెక్సికో, నార్వే, దక్షిణాఫ్రికా, స్పెయిన్, కెనడా, బెల్జియం, నెదర్లాండ్స్, తైవాన్

ఏమిటీ ఎల్జీబీటీక్యూఐ?



- రకరకాల అసహజ లైంగిక ప్రవృత్తు లున్న వారందరినీ కలిపి ఎల్‌జీబీటీక్యూఐ అని వ్యవహరిస్తుంటారు.
- ఇది లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్, ఇంటర్ సెక్స్‌కు సంక్షిప్త నామం.
- ఇద్దరు మహిళల మధ్య ఉండే లైంగికాసక్తి లెస్బియనిజం. ఇలాంటివారిని లెస్బియన్‌గా పిలుస్తారు. అదే పురుషుల మధ్య ఉంటే వారిని గే అంటారు.
- సందర్భాన్ని బట్టి ఎవరి మీదనైనా ఆకర్షణ చూపేవారు బై సెక్సువల్.
- ఇక పుట్టినప్పుడు ఆడ/మగగా ఉండి, పెరిగి పెద్దయ్యాక అందుకు భిన్నంగా మారేవారిని/మారేందుకు ఆసక్తి చూపేవారిని ట్రాన్స్‌జెండర్/ట్రాన్స్ సెక్సువల్ అంటారు. అంటే తృతీయ ప్రకృతులన్నమాట. మన దగ్గర హిజ్రాలుగా పిలిచేది వీరినే. దేశవ్యాప్తంగా వీరికి రకరకాల పేర్లున్నాయి. మళ్లీ వీరిలో చాలా రకాల వారుంటారు. ఉదాహరణకు మగ పిల్లాడిగా పుట్టి కూడా తనను తాను అమ్మాయిగా భావించుకుంటూ మరో అబ్బాయిని ఇష్టపడేవాళ్లు ఈ కోవలోకే వస్తారు. ఇలాంటివారిని హెటిరో సెక్సువల్ ట్రాన్స్‌జెండర్ అంటారు.
- క్యూ అంటే క్వీర్. వీరికి తాము ఆడా, మగా, ట్రాన్స్‌జెండరా, మరోటా అన్నదానిపై వాళ్లకే స్పష్టత ఉండదు. అందుకే వీరిని క్వశ్చనింగ్ అని కూడా అంటూంటారు.
- చివరగా ఇంటర్‌సెక్స్. అంటే పుట్టినప్పుడు జననాంగాల స్థితిగతులను బట్టి ఆడో, మగో చెప్పలేనివారు. మళ్లీ వీరిలోనే క్రాస్‌డ్రెస్సర్స్ అనీ, మరోటనీ పలు రకాలున్నాయి.
- ఎల్‌జీబీటీక్యూఐ మొత్తాన్నీ కలిపి ఇటీవల కామన్‌గా గే గా వ్యవహరిస్తున్నారు.
- వీరు తమ ఆకాంక్షలకు ప్రతీకగా తరచూ ఆరు రంగులతో కూడిన జెండాను ప్రదర్శిస్తుంటారు. కొన్నేళ్లుగా ఈ జెండా ఒకరకంగా ఎల్‌జీబీటీక్యూఐ హక్కుల ఉద్యమానికి ప్రతీకగా మారిపోయింది.

అమెరికాలో స్వలింగ వివాహాలు ఇక చట్టబద్ధం

బిల్లుపై సంతకం చేసిన అధ్యక్షుడు జో బైడెన్



వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో మంగళవారం మధ్యాహ్నం వేలాది మంది వీధుల్లోకి వచ్చి సంబరాలు జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని, పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. స్వలింగ వివాహాలకు వీలు కల్పించే బిల్లు చట్టరూపం దాల్చడమే వారి ఆనందానికి కారణం. అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్) ఉభయ సభల్లో ఇప్పటికే ఆమోదం పొందిన స్వలింగ వివాహాల(గే, లెస్బియన్ మ్యారేజెస్) బిల్లుపై అధ్యక్షుడు జో బైడెన్ సంతకం చేశారు. దీంతో బిల్లు ఇక చట్టంగా మారింది. ఈ చట్టం సమాజంలో పలు రూపాల్లో ఉన్న ద్వేషాలకు ఒక ఎదురుదెబ్బ అని బైడెన్ అభివర్ణించారు. ప్రతి ఒక్క అమెరికన్‌కు ఇది చాలా ప్రాధాన్యం అంశమని అన్నారు. బిల్లుపై అధ్యక్షుడు సంతకం చేసే కార్యక్రమాన్ని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని పోరాటం చేసిన వారికి ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లూ భయంతో బంకర్‌లో పుతిన్!

ఎగువ సభలో ప్రసంగం, వార్షిక మీడియా సమావేశం రద్దు



మాస్కో: రష్యాను 'ఫ్లూ' భయం వణికిస్తోంది. దేశంలో చాలా ప్రాంతాల్లో ఫ్లూ వేగంగా వ్యాప్తి చెందుతోంది. ప్రభుత్వ అధికార యంత్రాంగంలో చాలా మంది అంటువ్యాధి బారినపడినట్లు తెలిసింది. అధ్యక్ష భవనంలో అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి పనిచేసే సిబ్బందికి సైతం ఫ్లూ సోకినట్లు వార్తలు వస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా పుతిన్‌ను అధికారులు రష్యా తూర్పు ప్రాంతంలోని ఉరాల్ పర్వతాల వెనుక ఉన్న ఓ బంకర్‌కు తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం పుతిన్ అక్కడే ఐసోలేషన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. నూతన సంవత్సరం వేడుకలను ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి బంకర్‌లోనే జరుపుకుంటారని ఓ మీడియా సంస్థ పేర్కొంది. 70 ఏళ్ల పుతిన్ ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన ఆరోగ్యంపై మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఈ ఏడాది రష్యా పార్లమెంట్ ఎగువ సభ డ్యూమాలో తన ప్రసంగాన్ని రద్దు చేసుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రతి ఏటా సంవత్సరం ఆఖరున నిర్వహించే మీడియా సమావేశాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. ఇందుకు గల కారణాలను మాత్రం ఆయన బహిర్గతం చేయలేదు. పుతిన్ ఇలా మీడియా సమావేశాన్ని రద్దు చేసుకోవడం గత పదేళ్లలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అయితే, ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా వైఫల్యానికి సంబంధించి విలేకరులు సంధించే ప్రశ్నలకు సమాధానం చెప్పే పరిస్థితి లేకే ఆయన వార్షిక మీడియా సమావేశాన్ని రద్దు చేసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

'చైనా'పై చర్చించాల్సిందే

పార్లమెంట్‌లో విపక్షాల పట్టు, వాకౌట్

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వెంట చైనా సైనికులతో భారత సేన ఘర్షణ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చించాల్సిందేనన్న ఉభయసభల్లో విపక్షాలు పట్టుబట్టాయి. అయితే, ఈ అంశాన్ని రాజ్యసభ, లోక్‌సభల్లో చర్చించే ప్రసక్తేలేదని ఇరుసభల సభాపతులు తేల్చిచెప్పడంతో విపక్ష సభ్యులు వాకౌట్‌చేశారు. బుధవారం ఉదయం లోక్‌సభలో ప్రశ్నావళి ముగియగానే సభలో కాంగ్రెస్ పక్షనేత అధీర్ రంజన్ చౌదరి ఈ అంశాన్ని లేవనెత్తారు. '1962లో భారత్–చైనా యుద్ధంపై స్వయంగా ప్రధాని నెహ్రూనే చర్చించారు. ఆనాడు 165 మంది సభ్యులకు మాట్లాడే అవకాశమిచ్చారు. ఇప్పుడూ తవాంగ్‌లో చైనా దుందుడుకుపై సభలో చర్చించాల్సిందే' అని పట్టుబట్టారు. చర్చించాలా వద్దా అనేది సభావ్యవహారాల సలహా కమిటీ భేటీలో నిర్ణయిస్తామని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా స్పష్టం చేశారు. ఇందుకు ఒప్పుకోబోమంటూ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు సైతం వేర్వేరు అంశాలపై ప్రభుత్వాన్ని నిరసిస్తూ కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీపీ, ఎస్సీ పార్టీల సభ్యులు కొందరు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ)ను దాటి చైనా సైనికులు భారత భూభాగంలోకి వచ్చిన అంశాన్ని చర్చించాలంటూ రాజ్యసభలోనూ విపక్షాలు డిమాండ్ల మోత మోగించాయి. అయితే, ఈ అంశంపై చర్చకు ముందస్తు నోటీసు ఇవ్వనికారణంగా రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ చర్చకు నిరాకరించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్, టీఎంసీ, ఎన్సీపీ, ఆర్‌జేడీ తదితర పార్టీల సభ్యులు వాకౌట్ చేశారు.

ఎనిమిదేళ్లలో కొత్తగా 20 అణు విద్యుత్కేంద్రాలు

న్యూఢిల్లీ: అదనంగా 15వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని పెంచే ఉద్దేశంతో 2031 ఏడాదికల్లా దేశంలో కొత్తగా 20 అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పనున్నట్లు కేంద్రప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ విషయం చెప్పారు. కొత్త వాటిల్లో మొదటిదానిని వచ్చే ఏడాది గుజరాత్‌లోని కాక్రపార్‌లో 700 మెగావాట్ల సామర్థ్యంతో నెలకొల్పుతారు. 2024 ఏడాదిలో కల్పకంలో 50 మెగావాట్ల సామర్థ్యంతో ప్రోటోటైప్ ఫాస్ట్‌బ్రీడ్ రియాక్టర్‌ను, 2025లో చెరో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లను కుడంకుళంలో నిర్మిస్తారు. రాజస్తాన్‌లోని రావత్‌భటాలో చెరో 700 మెగావాట్ల సామర్థ్యంతో రెండు, 2027లో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో మరో రెండు అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. హరియాణాలోని గోరఖ్‌పూర్‌లో 2029 ఏడాదిలో 700 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు సిద్ధంచేస్తారు. 700 సామర్థ్యంతో మరో పదింటిని వేర్వేరు రాష్ట్రాల్లో.. అంటే హరియాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో నిర్మిస్తారు.



రాహుల్‌తో రఘురాం రాజన్

జైపూర్: రాజస్తాన్‌లో కొనసాగుతున్న భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీతోపాటు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కలిసి నడిచారు. బుధవారం ఉదయం సవాయ్ మాధోపూర్ పరిధిలోని భడోతీ ప్రాంతంలో యాత్ర ప్రారంభమైంది. మార్గమధ్యంలో రాహుల్‌తో రఘురామ్ రాజన్ జతకలిశారు.

స్పేస్ ఎక్స్ 'చంద్రయాన్'లో భారత నటుడు దీప్ జోషి




వాషింగ్టన్: 'డియర్ మూన్' పేరుతో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అంతరిక్ష యాత్రకు వెళ్లే బృందంలో బాల్‌వీర్ టీవీ షోతో దేశవ్యాప్త క్రేజ్ సాధించిన భారత నటుడు దీప్ జోషి చోటు దక్కించుకున్నారు! చంద్రుని సమీపానికి స్పేస్ ఎక్స్ చేపడుతున్న తొలి వాణిజ్య అంతరిక్ష యాత్ర డియర్ మూన్. దాంట్లో అందుబాటులో ఉన్న టికెట్లన్నింటినీ జపాన్ కుబేరుడు యసాకు మజావా కొనుగోలు చేశారు. తన వెంట పలు రంగాల నుంచి 8 మంది ప్రఖ్యాత కళాకారులను తీసుకెళ్లాలని తొలుత భావించినా చివరికి వారిని ఇంటర్వ్యూల ద్వారా ఎంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 10 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఏడాదిన్నర పాటు అనేకానేక వడపోతల అనంతరం జోషితో పాటు ప్రఖ్యాత బ్రిటిష్ ఫొటోగ్రాఫర్ కరీం ఇలియా, అమెరికా నుంచి ప్రముఖ డీజే, నిర్మాత స్టీవ్ అవోకీ, సినీ దర్శకుడు బ్రెండన్ హాల్, యూట్యూబర్ టిమ్ డాడ్, దక్షిణ కొరియాకు చెందిన కె-పాప్ మ్యుజిషియన్ షాయ్ సెయంగ్ హుయాన్ (టాప్) విజేతలుగా నిలిచారు. వీరంతా వచ్చే ఏడాది స్పేస్ ఎక్స్ స్టార్‌షిప్ వెహికిల్‌లో మజావాతో పాటు 8 రోజుల పాటు అంతరిక్షంలో విహరిస్తారు. 3 రోజులు చంద్రుని చుట్టూ తిరుగుతారు. 22 ఏళ్ల జోషి ఈ బృందంలో అత్యంత పిన్న వయస్కుడు. 2000 నవంబర్‌లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పుట్టారు. పలు గుజరాతీ సినిమాల్లో నటించారు. ''దేవ్ యువోత్సాహం తమకెంతో స్ఫూర్తినిస్తుంది. అందుకే ఆయన్ను ఎంపిక చేసుకున్నాం'' అని మజావా పేర్కొన్నారు.

గుజరాత్ ఓటేసిందిలా...

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దుమ్ము రేపి వరుసగా ఏడోసారి అధికారంలోకి రావడంపై పలు రాజకీయ వర్గాల్లో పలు కోణాల్లో విశ్లేషణలు కొనసాగుతూనే ఉన్నాయి. నిజానికి రాష్ట్రంలో బీజేపీ పాలనపై ప్రజల్లో చాలా విషయాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. అంతటి అసంతృప్తిని, అధికార వ్యతిరేకతను అధిగమిస్తూ ఏకంగా నాలుగింట మూడొంతులకు పైగా మెజారిటీ సాధించిన వైనం రాష్ట్ర బీజేపీ ముఖ్యులను కూడా ఆశ్చర్యపరిచింది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా బీజేపీకి కనీసం గట్టి పోటీ ఇస్తుందని భావించిన కాంగ్రెస్ చివరికి ఘోర పరాజయం పాలైంది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా బీజేపీని అడ్డుకోలేకపోగా, కాంగ్రెస్ ఓటు బ్యాంకును చీల్చడం ద్వారా దాని జైత్రయాత్రకు పరోక్షంగా సహకరించినట్టయింది! దాంతో రాష్ట్రంలో ఎటు చూసినా కాషాయ రెపరెపలే కనిపించాయి. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఓ విహంగ వీక్షణం... - సాక్షి, నేషనల్ డెస్క్


ప్రాంతాలవారీగా సగటు విక్టరీ మార్జిన్స్






గుజరాత్ ఎన్నికల్లో ఘన విజయం నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీకి రక్షణ మంత్రి రాజ్‌నాథ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరుల అభినందనలు


ప్రాంతాలవారీగా పార్టీల ఓట్ల శాతం




అసెంబ్లీలో పార్టీల తాజా బలాబలాలు



ప్రాంతాలవారీగా పోటీ చేసిన స్థానాల్లో గెలుపు శాతం (స్ట్రైక్ రేట్)



గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతం



సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 15 । డిసెంబర్ । 2022

ఉత్సవ శోభ

నేటి నుంచి భవానీ దీక్షల విరమణ



విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్న ఇంద్రకీలాద్రి

ఇంద్రగిరి ఉత్సవ శోభతో కళకళలాడుతోంది. విద్యుత్ దీపాల ధగధగలతో కాంతులీనుతోంది. దిగువన వయ్యారంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మలో తన దేదీప్యమాన రూపాన్ని చూసుకొని మురిసిపోతోంది. భవానీ దీక్షల విరమణ పర్వం గురువారం నుంచి ఆరంభం కానున్న నేపథ్యంలో దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. ఐదు రోజుల పాటు అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా విరమణను నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. దిగువన నదిలో పుణ్యస్నానాలు మొదలుకొని, ఎగువన అమ్మవారి దర్శనం పూర్తయ్యి మళ్లీ కిందకు వచ్చేంత వరకూ భవానీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పక్కా ఏర్పాట్లు చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఘాట్ రోడ్డు గాలిగోపురం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



ఇరుముళ్లతో దీక్షల విరమణకు వస్తున్న భవానీలు

న్యూస్‌రీల్

భవానీ దీక్షల విరమణకు ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణకు విజయవాడలోని ఇంద్రకీలాద్రి అమ్మవారి దేవస్థానానికి చేరుకునే భవానీలు, భక్తుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి విజయవాడకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

- శ్రీకాకుళం రోడ్డు–వరంగల్లు ప్రత్యేక రైలు(07148) ఈ నెల 15న మధ్యాహ్నం 2 గంటలకు శ్రీకాకుళంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6 గంటలకు వరంగల్లు చేరుకుంటుంది.
- వరంగల్లు–బెరంపూర్ ప్రత్యేక రైలు (07149) ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు వరంగల్లులో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు బెరంపూర్ చేరుకుంటుంది.
- బెరంపూర్–విజయవాడ ప్రత్యేక రైలు(07150) 17న మధ్యాహ్నం 12.45 గంటలకు బెరంపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 3 గంటలకు విజయవాడ చేరుకుంటుంది.
- విజయవాడ–బెరంపూర్ ప్రత్యేక రైలు (07151) ఈ నెల 15, 17, 18, 19 తేదీలలో రాత్రి 9.20 గంటలకు విజయవాడలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు బెరంపూర్ చేరుకుంటుంది.
- బెరంపూర్–విజయవాడ ప్రత్యేక రైలు(07152) ఈ నెల 16, 18, 19, 20 తేదీలలో మధ్యాహ్నం 12.45 గంటలకు బెరంపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 3 గంటలకు విజయవాడ చేరుకుంటుంది.

19న అథ్లెటిక్స్ క్రాస్‌కంట్రీ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: అథ్లెటిక్స్ క్రాస్‌కంట్రీ అండర్–16, 18, 20 సీనియర్ స్త్రీ, పురుషుల ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను ఈ నెల 19వ తేదీన ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆకుల హైమ తెలిపారు. కృష్ణాజిల్లా కంకిపాడులోని సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియంలో ఆ రోజు ఉదయం ఆరు గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో ఆ రోజు ఉదయం ఆరు గంటలకు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ప్రకాశం జిల్లాలో ఈ నెల 24వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

18న అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

అథ్లెటిక్స్ అండర్–14, 16 బాలబాలికల ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 18వ తేదీన ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆకుల హైమ తెలిపారు. ఆ రోజు ఉదయం విజయవాడ మొగల్రాజపురంలోని వీపీ సిద్ధార్థ స్కూల్ మైదానంలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో ఆ రోజు ఉదయం 8 గంటలకు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు 2023 జనవరి 12 నుంచి 14వ తేదీ వరకు బిహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి అంతర్ జిల్లాల పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

నవ వైద్యం.. అత్యున్నతం

- అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన వైద్యం
- లక్షలు విలువ చేసే చికిత్సలు పూర్తి ఉచితం
- ఇటీవల ఆరో నెలలో జన్మించిన ఇద్దరు శిశువులకు కొత్త ఊపిరి
- ఐదు జిల్లాల ప్రజలకు పెద్ద దిక్కుగా ఆస్పత్రి

నవజాత శిశువులకు సంజీవనిగా విజయవాడ జీజీహెచ్

పసిగుడ్డుకు కొత్త ఊపిరి

నూజివీడుకు చెందిన ఓ గర్భిణికి ఆరో నెలలోనే డెలివరీ అయిపోయింది. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జరిగిన ఈ కాన్పులో బేబి 800 గ్రాముల బరువుతో జన్మించింది. వెంటనే స్పందించిన ఆ ఆస్పత్రి సిబ్బంది విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. దీంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 108(నియోనేటల్ అంబులెన్స్)లోనే జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. బేబిని పరీక్షించిన వైద్యులు వెంటనే ఆస్పత్రిలోని ఎస్ఎన్‌బీసీ(స్పెషల్ న్యూ బోర్న్ కేర్) యూనిట్‌లో ఉంచి, రెండు నెలల పాటు చికిత్స అందించారు. ఆ తర్వాత బిడ్డను సంపూర్ణ ఆరోగ్యంతో తల్లిదండ్రులకు అప్పగించారు. ఇదే వైద్యం ఏదైనా కార్పొరేట్ ఆస్పత్రిలో చేయించుకుంటే దాదాపు రూ. 10లక్షలు ఖర్చయ్యేది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స చేసి ఆ బిడ్డకు ఊపిరిపోశారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): అప్పుడే పుట్టిన శిశువులకు ప్రైవేటులో వైద్యం ఎంత ఖరీదైనదో తెలియనిది కాదు. రెండు రోజులు ఎన్ఐసీయూ(న్యూబోర్న్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లో ఉంచితే రూ. లక్ష వరకు బిల్లు అవుతుంది. వారం రోజులకు రూ. 3 లక్షలు నుంచి రూ.5 లక్షలు వరకూ బిల్లు చేస్తారు. నెలలు నిండకుండా పుట్టిన శిశువుల వైద్యానికి రూ. 10 లక్షలు ఖర్చు చేసిన వారు కూడా ఉన్నారు. అలాంటి ఖరీదైన వైద్యం ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా అందిస్తున్నారు. అందుకోసం కార్పొరేట్‌కు మించిన సౌకర్యాలతో ఎస్ఎన్‌బీసీ(స్పెషల్ న్యూ బోర్న్ కేర్)యూనిట్ అందుబాటులో ఉంది. పుట్టిన తర్వాత ఊపిరితిత్తులు పూర్తిస్థాయిలో రూపుదిద్దుకునేందుకు అవసరమైన రూ.15 వేలు విలువ కలిగిన ఇంజెక్షన్స్‌ను కూడా ఉచితంగా అందిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే మెరుగైన సేవలు అందిస్తూ.. ఇక్కడి వైద్యులు అందరి మన్ననలు పొందుతున్నారు.

ముందస్తు డెలివరీలు..

ఆరో నెల, ఏడో నెలలో డెలివరీ అయిన శిశువులే ఎక్కువగా చికిత్స కోసం వస్తున్నారు. అలా వస్తున్న వారిలో 800 గ్రాములు, 900 గ్రాములు బరువు ఉన్న శిశువులు కూడా ఉంటున్నారు. అలాంటి వారిని పూర్తిగా కోలుకునేలా చికిత్స అందిస్తున్నారు. వీరితో పాటు పుట్టిన తర్వాత శ్వాస తీసుకోలేని శిశువులు, ఇతర సమస్యలు ఉన్న వారిని ఎంఎన్‌సీయూ(మదర్ అండ్ నియోనేటల్ కేర్ యూనిట్)లో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

40 పడకలతో ఎస్ఎన్‌బీసీ..

స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్‌లో 40 పడకలు అందుబాటులో ఉన్నాయి. వెంటిలేటర్స్ 30, సీపాప్‌లు 10, ఫొటో థెరపీ యూనిట్లు 20 అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ ప్రతినెలా 250 నుంచి 300 మంది నవజాత శిశువులకు చికిత్స అందిస్తున్నారు. ఎప్పుడు చూసినా ఈ వార్డులో 45 నుంచి 50 మంది శిశువులు చికిత్స పొందుతూ ఉంటారు. కొత్తగా 20 పడకలతో ఎంఎన్‌సీయూ వార్డును కూడా అందుబాటులో తెచ్చారు. ఇక్కడ తల్లి ఒడిలోనే ఉంచి శిశువుకు చికిత్స అందిస్తున్నారు. 'కంగారు వైద్య విధానం'లో చికిత్సలు కేవలం ప్రభుత్వాస్పత్రిలోనే అందుబాటులో ఉన్నాయి.

ఐదు జిల్లాల నుంచి రాక..

ఇక్కడికి వైద్యం కోసం కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలివరీ అయిన నవజాత శిశువులు చికిత్స కోసం వస్తుంటారు. అలా వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారు. మూడు షిఫ్టుల్లో ప్రతిషిఫ్టుకు ఒక పిడియాట్రిక్ స్పెషలిస్టు, ఐదుగురు స్టాఫ్‌నర్సులు, మూడు నుంచి ఐదుగురు పీజీలు విధులు నిర్వర్తిస్తారు. వీరితో పాటు పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ డి. దేవకుమార్, ప్రొఫెసర్ డాక్టర్ పి. ఇందిర, డాక్టర్ కేవీ రామారావులు అవసరమైన సమయంలో సేవలు అందిస్తుంటారు.



విజయవాడ జీజీహెచ్‌లోని అత్యాధునిక స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్



ఎస్ఎన్‌బీసీలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న శిశువు



శిశువుకు ఫొటో థెరపీ

అత్యుత్తమ వైద్యం అందిస్తున్నాం..



నవజాత శిశువులకు అత్యుత్తమ వైద్యం అందిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు అయిన వారు కూడా శిశువుల చికిత్స కోసం మా వద్దకు వస్తున్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అవసరమైన ఖరీదైన మందులను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో లేని విధంగా 30 వెంటిలేటర్స్ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ బి. సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్, జీజీహెచ్

బరువు తక్కువ ఉన్న శిశువులే ఎక్కువ..



మా వద్దకు నెలలు నిండకుండా ప్రసవించిన కేసులే ఎక్కువగా వస్తున్నాయి. ఇక్కడ 800 గ్రాములు, 900 గ్రాములతో పుట్టిన శిశువులను సైతం రికవరీ చేస్తున్నాం. కొందరికి రెండు నెలలు కూడా చికిత్స అందిస్తున్నాం. అత్యాధునిక సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి.

– డాక్టర్ బి. సునీత, నోడల్ ఆఫీసర్, ఎంఎన్‌సీయూ

కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న హెల్ప్‌లైన్ సెంటర్ సిబ్బంది

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఏపీ ఈఏపీ సెట్–2022 ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించిన బైపీసీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బుధవారం కొనసాగింది. అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రత్యేక కేటగిరికి చెందిన 59 మంది అభ్యర్థులు బుధవారం సెంటర్‌కు వచ్చి సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. ఎన్‌సీసీ–30, స్పోర్ట్స్ అండ్ గేమ్స్–6, క్యాప్ (ఆర్మీ ఉద్యోగుల పిల్లలు)–6, విభిన్న ప్రతిభావంతులు–17 మంది మొత్తం 59 మంది సర్టిఫికెట్లను పరిశీలించామని హెల్ప్‌లైన్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.విజయసారథి చెప్పారు. బుధవారం సాయంత్రంతో ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి అయ్యిందన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన, ఆప్షన్ల నమోదు చేసుకున్న వారికి ఈ నెల 19 తేదీన కళాశాలల్లో సీట్లు కేటాయిస్తామని, ఈ నెల 20 నుంచి 23 తేదీలోగా విద్యార్థులు వారికి కేటాయించిన కళాశాలకు వెళ్లి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ఆయన వివరించారు.

వేంకటేశ్వరునికి రూ.12.65 లక్షల ఆదాయం

జగ్గయ్యపేట: తిరుమలగిరి గ్రామంలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామికి పలు రకాల వేలం పాటల ద్వారా రూ. 12.65 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం కొండ కిందనున్న షాపింగ్ కాంప్లెక్స్ షాపులకు వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో 10 షాపులకు గానూ రూ. 11.83 లక్షల ఆదాయం రాగా, ఫొటోలు తీసుకునే హక్కుకు రూ. 82,500 ఆదాయం వచ్చిందన్నారు. ఈ హక్కులు ఏడాది పాటు అమలులో ఉంటాయని తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, చైర్మన్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యాశాఖలో బదిలీల సందడి

- మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
- ఒకే చోట ఎనిమిదేళ్లు పనిచేస్తే స్థానచలనమే..
- హెచ్ఎంలకు ఐదేళ్లు పూర్తయితే బదిలీ తప్పనిసరి
- జీరో సర్వీసుతోనూ బదిలీకి అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



ఉన్నతాధికారుల సమీక్షకు హాజరైన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల డీఈవోలు తాహెరా సుల్తానా, సీవీ రేణుక

మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణా జిల్లా విద్యాశాఖలో బదిలీల కోలాహలం మొదలైంది. ఉపాధ్యాయులు కోరుకున్న స్థానానికి బదిలీపై వెళ్లేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఈ బదిలీలు జరగనున్న నేపథ్యంలో సొంత ఊళ్లకు దగ్గరగా వెళ్లేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు. పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ, బదిలీల ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే చేపట్టడంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. బదిలీల కార్యాచరణ ఖరారుపై విద్యాశాఖ ఉన్నతాధికారులు బుధవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల డీఈఓలు తాహెరా సుల్తానా, సి.వి.రేణుక పాల్గొన్నారు.

ఖాళీల గుర్తింపునకు కసరత్తు..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఉపాధ్యాయ పోస్టులు, కేడర్లు, పాఠశాలల వారీగా ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో తెలుసుకునేందుకు ప్రస్తుతం లెక్క తీస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలకు క్షేత్రస్థాయి నుంచి వాస్తవ సమాచారాన్ని సేకరిస్తున్నారు. విమర్శలకు తావులేకుండా, ఆయా మండలాల పరిధిలోని ఎంఈఓల ద్వారా పాఠశాలల వారీగా ఉన్న ఖాళీలను గుర్తించి, విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటికే దీనిపై కసరత్తు పూర్తయింది. కృష్ణా జిల్లాకు సంబంధించిన ఎంఈఓలతో మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు.

జీరో సర్వీసుతో ఇదే తొలిసారి..

ఒకే చోట ఐదేళ్లు పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్లు పనిచేసిన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. విద్యాశాఖ చరిత్రలో జీరో సర్వీసుతో బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు తొలిసారిగా అవకాశం కల్పించడంపై ఉపాధ్యాయ వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. పాఠశాలల విలీనం అనంతరం చేపట్టిన రేషనలైజేషన్‌తో ఉపాధ్యాయులను వేర్వేరు చోట్లకు అనివార్యంగా సర్దుబాటు చేయాల్సి వచ్చింది. ఇలాంటి వారికి అన్యాయం జరుగకూడదనే ఉద్దేశంతో అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు ప్రతి ఒక్కరూ బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు విధి విధానాలు జారీ చేశారు.

అందరికీ ఆమోదయోగ్యంగా..



ఉపాధ్యాయులు అందరికీ ఆమోదకరమైన రీతిలో బదిలీలు నిర్వహిస్తాం. మా ఉన్నతాధికారులు కూడా ఇదే అంశాన్ని స్పష్టం చేశారు. విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా, అవసరమైన స్కూళ్లల్లో తప్పనిసరిగా సరిపడా ఉపాధ్యాయులు ఉండేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. కేడర్ల వారీగా ఖాళీలను గుర్తిస్తున్నాం. బదిలీల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది.

– తాహెరా సుల్తానా, నోడల్ అధికారి, ఉమ్మడి కృష్ణా జిల్లా

సర్వీసుకు నష్టం లేకుండా చూడాలి



పాఠశాలల విలీనం వల్ల రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులకు సర్వీసు పాయింట్లు నష్టం లేకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. పాత స్టేషన్ సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలి. జీరో సర్వీసుతో బదిలీకి అవకాశం కల్పించడం హర్షణీయం. బదిలీలపై ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

– చేబ్రోలు శరత్ చంద్ర, బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు

ఆన్‌లైన్ విధానంతో మేలు



ఉపాధ్యాయుల బదిలీలు అంటే గతంలో కొన్ని సంఘాల పెత్తనం ఉండేది. ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా బదిలీలు నిర్వహిస్తుండటం వల్ల ఎటువంటి లాబీయింగ్‌లకు తావులేదు. ఉపాధ్యాయుడు ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. బదిలీ ఉత్తర్వులు కూడా సెల్‌ఫోన్లకు చేరుతాయి. ఇది మంచి నిర్ణయం. సర్వీసు పాయింట్ల విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– ఎం.వి.మహంకాళీరావు, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి కృష్ణా జిల్లా



అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు

ఇంధనం.. పొదుపు అనివార్యం

- ప్రజల్లో మార్పు తీసుకురావాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంధన వినియోగంపై ప్రజల్లో మార్పు తీసుకువచ్చి, విద్యుత్‌ను పొదుపు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ఇంధన పొదుపుతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీని బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు ర్యాలీ జరిగింది. అనంతరం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. భావితరాలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం 'ఇంధన పొదుపు సామాజిక బాధ్యతగా స్వీకరిస్తానని' కలెక్టర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ పృథ్వీతేజ్, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జేఎండీ మల్లారెడ్డి, ఏపీఈఆర్‌సీ ఎడ్వయిజరీ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

భూ వివాదాల పరిష్కారానికే రీ సర్వే

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



లబ్ధిదారుడికి శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: భూములకు సంబంధించి వందేళ్ల క్రితం బ్రిటిష్ పాలనలో సర్వే జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సమస్యలు ఏర్పడ్డాయని, వాటి పరిష్కారానికే రీ సర్వే చేపట్టామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెనుమల్లి రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద భూ యజమానులకు శాశ్వత భూమి హక్కు పత్రాలను మంత్రి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటి నుంచో భూములకు సంబంధించి వాగ్వివాదాలు, హక్కుల విషయంలో గొడవలు, ఘర్షణలు చోటు చేసుకుంటూనే ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రీ సర్వే చేయిస్తున్నారని తెలిపారు. శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద అన్ని భూములను రైతులు, భూ యజమానుల సహాయ సహకారాలతో రీ సర్వే చేస్తున్నామని పేర్కొన్నారు. పెడన మండలంలోని నేలకొండపల్లి, కుమ్మరిగుంట గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీసర్వే పూర్తి చేశామని వివరించారు. ఈ గ్రామాల్లో రీ సర్వే విజయవంతం కావడంతో మండల, జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రమంతటా ఆధునిక పరిజ్ఞానంతో డ్రోన్ల ద్వారా రీ సర్వే చేయించి భూ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. సరిహద్దుల వివాదాలు లేకుండా, పూర్వీకుల ఆస్తులకు వారసులు, అర్హతలు ఉన్న వారికి చట్టబద్ధత కల్పిస్తూ శాశ్వత భూమి పత్రాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎస్.కె.ఎస్.ప్రకాశరావు, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, పెనుమల్లి, నేలకొండపల్లి సర్పంచుల గరికిపాటి వెంకటరామానాయుడు, వూచా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అంకెం గిరిబాబు, తహసీల్దారు పి.మధుసూదనరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఈపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పోటీల నిర్వహణ
- వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అవినాష్ నేతృత్వంలో టోర్నీ
- పోటీలను ప్రారంభించిన మంత్రి జోగి రమేష్
- విజేత జట్టుకు రూ.లక్ష నగదు బహుమతి



బ్యాటింగ్ చేస్తున్న మంత్రి జోగి రమేష్.



లబ్బీపేట లయన్స్, రామలింగేశ్వర నగర్ రాయల్స్ మధ్య హోరాహోరీ పోరు

విజయవాడ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని నిర్వహిస్తున్న విజయవాడ 'ఈస్ట్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్)' టీ–20 పురుషుల క్రికెట్ చాంపియన్‌షిప్ సిద్ధార్థ మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. తూర్పు నియోజకవర్గంలోని 21 డివిజన్ల జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ పోటీల్లో విజేతగా నిలిచే జట్టుకు రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచే జట్టుకు రూ.25 వేల నగదు బహుమతులు అందిస్తామని టోర్నీ నిర్వాహకుడు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ తెలిపారు. వారం రోజుల పాటు జరిగే ఈ పోటీలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీ, యనమలకుదురులోని కేకే క్రికెట్ మైదానం, పెదఅవుటపల్లిలోని క్రికెట్ మైదానంలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు జరుగుతాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజైన ఈ నెల 21వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకే పోటీలు

రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికతో తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి జోగి రమేష్ అన్నారు. గ్రామీణ, వార్డు స్థాయిలో అట్టడుగు వర్గాల ప్రజల్లోని క్రీడా నైపుణ్యాలను గుర్తించేందుకు జగనన్న క్రీడా సంబరాలు, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో సీఎం కప్, శాప్ లీగ్ పోటీలను అన్ని క్రీడాంశాల్లోనూ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల మనసెరిగి, సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు అంటే రాష్ట్ర ప్రజలు అందరికీ పండుగ రోజన్నారు. ముఖ్యమంత్రి పుట్టిన రోజును పురస్కరించుకుని పోటీలు నిర్వహించి, క్రీడాకారుల్లో నూతనోత్తేజం నింపుతున్న దేవినేని అవినాష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తామన్నారు. టోర్నీలో పాల్గొన్న ప్రతి జట్టుకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. అనంతరం దేవినేని అవినాష్ బౌలింగ్‌లో మంత్రి జోగి రమేష్ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, పార్టీ నాయకుడు కడియాల బుచ్చిబాబు, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐదు వికెట్ల తేడాతో 'లబ్బీపేట లయన్స్' విజయం

తొలి మ్యాచ్‌లో రామలింగేశ్వరనగర్ రాయల్స్ జట్టుపై లబ్బీపేట లయన్స్ జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన లబ్బీపేట లయన్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. రామలింగేశ్వరనగర్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లకు 160 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన లబ్బీపేట లయన్స్ 18 ఓవర్లకు ఐదు వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసి గెలుపొందింది.

పీహెచ్‌సీ వైద్యులపై డీఎంహెచ్ఓ ఆగ్రహం

పలువురు వైద్యులకు షోకాజ్ నోటీసులు

మచిలీపట్నం: మాతా శిశు సంరక్షణ (ఆర్‌సీహెచ్) సేవల ప్రగతి నివేదికల నమోదులో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీలు) వైద్యులపై కృష్ణా డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లాలోని 12 పీహెచ్‌సీల వైద్యులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వారి నుంచి వచ్చే సంజాయిషీ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా మాతా శిశు సంరక్షణ కోసం అమలు చేసే కార్యక్రమాలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని ఆర్‌సీహెచ్ రాష్ట్ర సూచికలో కృష్ణా జిల్లా ప్రగతిని అంచనా వేస్తారు. అయితే జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల్లో అమలు చేసే కార్యక్రమాల వివరాలను సకాలంలో ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయడం లేదు. ఈ కారణంగా జిల్లా ప్రగతి వెనుబడుతోంది. దీనిని గుర్తించిన వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వివరణ కోరారు. ఎందుకు ఇలా జరిగిందనేది సమీక్షించిన డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి, అలసత్వంగా ఉంటున్న వారిపై చర్యలకు ఉపక్రమించారు. మచిలీపట్నం డివిజన్ పరిధిలోని తాళ్లపాలెం, చిన్నాపురం, ఎదురుమొండి, గుడివాడ డివిజన్‌లో పెదఅవుటపల్లి, బాపులపాడు, ముస్తాబాద్, ఉయ్యూరు డివిజన్‌లో పెనమలూరు, తోట్లవల్లూరు పీహెచ్‌సీలు నివేదికల నమోదులో బాగా వెనుకబడినట్లు గుర్తించారు. అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో మచిలీపట్నంలోని వర్రె గూడెం, శారదానగర్, నారాయణ పురం, చిలకలపూడి, పెడనలోని గూడూరు రోడ్, గుడివాడ ఎన్టీఆర్ కాలనీ, బేతవోలు వెనుకబడ్డాయి. ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్ వైజర్ సిబ్బంది తగిన రీతిలో శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయిలోని ఏఎన్‌ఎంల నుంచి సమాచారం తెప్పించుకోనందునే ఇలా జరుగుతోందని డీఎంహెచ్ఓ అభిప్రాయపడ్డారు. సంబంధిత ఏఎన్‌ఎం, సూపర్‌వైజర్ నుంచి తగిన వివరణ తీసుకొని సమగ్ర నివేదికను తన కార్యాలయంలో సమర్పించాలని ఆయా పీహెచ్‌సీల వైద్యులను డీఎంహెచ్ఓ ఆదేశించారు. ఒకే సారి ఇంతమంది వైద్యులకు షోకాజ్ నోటీసు జారీ కావడంపై జిల్లా వైద్య శాఖలో చర్చనీయాంశమైంది.

రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్టీఆర్ జిల్లాను రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని రోడ్డు భద్రత కమిటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,421 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 379 మంది ప్రాణాలను కోల్పోయారని, 1,274 మంది క్షతగాత్రులు అయ్యారని వివరించారు. రోడ్డు ప్రమాదాలు సాయంత్రం ఆరు నుంచి అర్ధరాత్రి 12 గంటల్లోపు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నమోదైన ప్రమాదాల్లో 474 ద్విచక్ర వాహనాలు, 351 కార్లు, జీపు, టాక్సీలు, 266 లారీలు, ట్రక్కులు, 171 ఆటోల కారణంగా జరిగాయని వివరించారు. ప్రమాదాల నివారణపై రవాణా, పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హైవే పెట్రోలింగ్ కోసం 25 వాహనాలను వినియోగిస్తున్నామని, ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను రక్షించేందుకు 108 వాహనాలను సిద్ధంగా ఉంచామని వివరించారు. అనంతరం రవాణా శాఖ రూపొందించిన 'రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేయడం మన అందరి బాధ్యత' వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు ఆవిష్కరించారు. ప్రమాదాల్లో బాధితులకు సహాయం చేసిన వ్యక్తులకు గౌరవ సూచకంగా రూ.5 వేల వరకు పారితోషికం, యోగ్యతా పత్రం మంజూరు చేసే అధికారం తనకు ఉందన్నారు. డీటీసీ ఎం.పురేంద్ర, డీసీపీ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా పంచాయతీ అధికారి జె.సునీత, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఆర్.శ్రీనివాసమూర్తి, పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ జాతీయ రహదారుల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు బ్యాంకర్లు సహకరించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



అధికారుల సమక్షంలో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి (మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి టిడ్కో గృహాల పురోగతిపై బ్యాంకు మేనేజర్లు, కో–ఆర్డినేటర్లతో కలెక్టర్ బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీన గుడివాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులకు టిడ్కో గృహాలు అందజేసే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందు కోసం లబ్ధిదారులకు రుణాలు మంజూరును బ్యాంకర్లు వేగవంతం చేయాలన్నారు. మరో వారం వ్యవధి మాత్రమే ఉన్నందున లబ్ధిదారులు దరఖాస్తు చేసిన వెంటనే రుణం అందించేలా చూడాలని కోరారు. మచిలీపట్నంలో నిర్మించిన టిడ్కో గృహాలు సంపూర్ణంగా పూర్తయ్యాయని తెలిపారు. రుద్రవరంలో 1440 గృహాలకు ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. రహదారులు, డ్రెయిన్లు, అండర్ గ్రౌండ్ వాటర్ సంపులు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బ్యాంకులో రుణాలు తిరస్కరించిన లబ్ధిదారుల వివరాలు సేకరించి తిరిగి రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. గుడివాడ పట్టణంలో 220 జీ+3 బ్లాక్‌లలో మొత్తం 8,912 లబ్ధిదారులకు గృహాలు అందజేయనున్నారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, టిడ్కో ప్రాజెక్టు ఆఫీసర్ చిన్నోడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయిరాం, మెప్మా పీడీ విశాలక్ష్మి, గుడివాడ కమిషనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: వివాహితను లైంగికంగా వేధింపులకు గురి చేసి, ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన వ్యక్తికి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజాదేవి బుధవారం తీర్పు చెప్పారు. భర్త, ఇద్దరు పిల్లలతో మాచవరంలో నివాసం ఉంటున్న వివాహితను అదే ప్రాంతానికి చెందిన కోటి లైంగికంగా వేధించేవాడు. అతని వేధింపులు తాళలేక 2016 నవంబర్ ఐదో తేదీన ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. బాధితురాలి మరణ వాగ్మూలం మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు కోటిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. బాధితుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్.విష్ణువర్ధన్ కోర్టులో వాదనలు వినిపించారు. 18 మంది సాక్షులను విచారించిన అనంతరం కోటిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



పెద్దకృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

గంపలగూడెం(తిరువూరు): గంపలగూడెం – నూజివీడు ఆర్ అండ్‌బీ రహదారిలో కొత్తపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఏఎస్ఐ లక్ష్మి కథనం మేరకు.. గంపలగూడెం మండలం అనుముల్లంక గ్రామానికి చెందిన మిరియాల పెద్దకృష్ణ (60) బుధవారం కొత్తపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని పెట్రోల్ బంకులో ఆయిల్ తీసుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెద్దకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఏఎస్ఐ లక్ష్మి తెలిపారు. పెద్దకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తిరువూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా వికాస్ కాలేజీ జట్టు



హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలుపొందిన వికాస్ కాలేజీ జట్టు

విజయవాడ రూరల్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో వికాస్ బీపీఈడీ కాలేజీ జట్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. నున్న వికాస్ కాలేజీ మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన హ్యాండ్ బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. నాకౌట్ కమ్ లీగ్ విధానంలో జరిగిన ఈ టోర్నీలో విజయవాడకు చెందిన ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ద్వితీయ, నూజివీడు డీఏఆర్ కాలేజీ తృతీయ స్థానంలో నిలిచాయి. లీగ్‌కు నాలుగు జట్లు చేరగా అందులో వికాస్ బీపీఈడీ కాలేజీ మూడు లీగ్ మ్యాచ్‌లలో గెలుపొంది విజేతగా నిలిచింది. ఈ జట్టు ఎస్ఆర్ఆర్, డీఏఆర్, కేబీఎన్ కాలేజీ జట్లపై గెలుపొందింది. ఎస్ఆర్ఆర్ కాలేజీ జట్టు డీఏఆర్, కేబీఎన్ కాలేజీలపై గెలుపొందగా, వికాస్ చేతిలో ఓటమిపాలైంది. దీంతో వికాస్ బీపీఈడీ జట్టు చాంపియన్‌షిప్ సాధించింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో వికాస్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ ఎస్.సత్యనారాయణరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. వికాస్ బీపీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజు, టోర్నీ నిర్వాహక కార్యదర్శి జి.రఘురామ్, వ్యాయామ అధ్యాపకులు డి.రత్నబాబు, నాగరాజు, బాలాజీ, కృష్ణా యూనివర్సిటీ సెలెక్షన్ కమిటీ సభ్యులు రఘురామ్, హేమచంద్ర, ఎస్ఆర్ఆర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్ పాల్గొన్నారు. కృష్ణా యూనివర్సిటీ జట్టు వచ్చే నెలలో సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొంటుందని పోటీల నిర్వాహక కార్యదర్శి రఘురామ్ తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి బలవన్మరణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చిట్టినగర్ బంగారయ్య కొట్టు ప్రాంతానికి చెందిన కొల్లిపర కుసుమకుమారి, కృష్ణకిశోర్ దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు భానుసాయి(29) వస్త్రదుకాణంలో పనిచేస్తాడు. కొన్ని రోజుల కిందట భానుసాయి వేరు ఊరిలో షాపునకు వెళ్లి రెండు రోజుల క్రితం తిరిగి విజయవాడ వచ్చాడు. మంగళవారం కుసుమకుమారి దుర్గగుడి వద్ద కొబ్బరి కాయలు విక్రయించేందుకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చింది. ఇంట్లో భానుసాయి లుంగీతో ఉరి వేసుకుని దివాన్ కాట్‌పై పడి ఉండటంతో ఆందోళన చెందిన ఆమె భర్త సాయంతో కుమారుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అప్పటికే భానుసాయి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

నేటి విద్యార్థులే భావి శాస్త్రవేత్తలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైజ్ఞానిక రంగంలో నేటి విద్యార్థులే దేశానికి భావి శాస్త్రవేత్తలని నలంద విద్యాసంస్థల అధినేత ఎ.విజయబాబు అన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన సీబీఎస్‌ఈ రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్ బుధవారం ముగిసింది. ఈ ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన 41 సీబీఎస్‌ఈ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయ నిర్ణేతలు అత్యుత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అందరిలోనూ మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నాయని, సైంటిఫిక్ టెంపర్‌మెంట్ అనేది అందరిలో ఉందని వారు పేర్కొన్నారు. అనంతరం విజయబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తమ ప్రతిభను జిల్లా స్థాయి నుంచే జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రాజెక్టులు రూపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. నలంద స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ విజేతలైన విద్యార్థులను ప్రకటించారు.



సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న న్యాయనిర్ణేతలు, నలంద విద్యాసంస్థల అధినేత విజయబాబు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చర్యలు అభినందనీయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దశాబ్దాలుగా సింగ్‌నగర్, పాయకాపురం, వాంబేకాలనీ పరిసర ప్రాంతాలలోని ప్రజలు పడుతున్న చెత్త డంపింగ్ యార్డ్ సమస్య నుంచి విముక్తి కలిగించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు అభినందనీయమని సీపీఐ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. సింగ్‌నగర్ చెత్త డంపింగ్ యార్డ్‌ను సీపీఐ బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. డంపింగ్ యార్డ్ వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై సీపీఐ పలుమార్లు పోరాటాలు కూడా చేసిందని గుర్తుచేశారు. డంపింగ్ యార్డ్ సమస్య నుంచి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, అధికారయంత్రాంగం కృషిచేయడం శుభపరిణామం అని తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు, బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు కొట్టు రమణారావు, తూనం వీరయ్య, కొడాలి ఆనందరావు పాల్గొన్నారు.


డంపింగ్ యార్డ్‌లో పనులను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

రేపు కామర్స్ విద్యార్థులకు పోటీలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కామర్స్ చదివే విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ నెల16వ తేదీన తమ కళాశాల ఆధ్వర్యంలో ఇన్‌కెండో–2కె22 పేరుతో విద్యార్థులకు వారు చదువుతున్న అంశాలతో పాటుగా సాంస్కృతిక అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాల తెలిపారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో ఇన్‌కెండో–2కె22 కార్యక్రమ పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కామర్స్ విభాగాధిపతి నారాయణరావుతో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, యాడ్–మాడ్, ఫైనాన్షియల్ అనలిస్ట్, డ్యాన్స్ టూ ట్రిబ్యూట్, మైండ్ ఇట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిస్ ఇన్‌కెండో–2022 పేరుతో ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కామర్స్ విభాగాధిపతి నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో కామర్స్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఇన్‌కెండో అంటే ఫైర్ అనే అర్థమని తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల డీన్ రాజేష్, ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు

క్లుప్తంగా

వాహనాల వేలం

పటమట(విజయవాడతూర్పు): స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ), విజయవాడ తూర్పు స్టేషన్ పరిధిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 21వ తేదీన వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ స్వామినాథన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రామవరప్పాడులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వెనుక ఉన్న సుందరయ్యనగర్‌లోని ఎస్‌ఈబీ విజయవాడ తూర్పు స్టేషన్ కార్యలయంలో ఈ 21వ తేదీ ఉదయం 9 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక కారుకు వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనదలచినవారు ద్విచక్ర వాహనాలకు రూ.5వేలు, కార్లకు రూ.10వేలు ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పాడుకున్న ఒక్కో వాహనానికి అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని తెలిపారు. వివరాలకు 94409 02454, 99598 41282లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా ఇంధన పరిరక్షణ దినోత్సవం



లబ్బీపేట(విజయవాడతూర్పు): పోరంకిలోని భాష్యం బ్లూమ్స్ పాఠశాలలో బుధవారం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దియా బెనర్జీ మాట్లాడుతూ అనవసర ఇంధన వినియోగాన్ని నివారించడం ద్వారా భవిష్యత్ అవసరం కోసం ఆదా చేయవచ్చన్నారు. వివిధ పద్ధతుల ద్వారా ఇంధన పొదుపు ఎలా చేయవచ్చునో సోదాహరణంగా విద్యార్థులకు వివరించారు. విద్యార్థినులు హవిష్య, హరిత, చైత్రశ్రీలు ఇంధన పరిరక్షణ ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు.

ఆయుర్వేద కళాశాలకు కొత్త పోస్టులు అభినందనీయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆయుర్వేద విద్య, వైద్యానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వ కృషి అభినందనీయమని ప్రభుత్వ ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.బుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఏకైక ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలగా ఉన్న విజయవాడలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ఆయుర్వేద కళాశాలకు కొత్తగా 15 పోస్టులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినిలకు తమ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అదనంగా కొత్తపోస్టులు మంజూరు కోసం కృషి చేసిన వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆయుష్ కమిషనర్ వి.రాములు, ఏపీ సెక్రటేరియెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.వెంకట్రామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిసుధాకర్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

భానూనగర్‌లో యూనిసెఫ్ బృందం పర్యటన

మధురానగర్(విజయవాడసెంట్రల్): 28వ డివిజన్ భానూనగర్‌లో బుధవారం యూనిసెఫ్ బృందం సభ్యులు పర్యటించారు. చిన్న వయస్సులోనే వివాహం చేసుకున్న మహిళలు, యుక్త వయస్సు బాలికలను కలిసి బృందం సభ్యులు మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, అనారోగ్య సమస్యల గురించి వివరంగా తెలియజేశారు. అలాగే విద్య ప్రాముఖ్యత, చదువుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని, ఇందుకు విద్య ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం బీఆర్‌టీఎస్ రోడ్డు, నగరపాలక సంస్థ పాఠశాలలో బాలికలను కలిసి బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు తెలియజేశారు.

జోరుగా వాటర్ పైపులైన్ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీలో వాటర్‌పైపులైన్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ ఇప్పటికే అంతర్గత పైపులైన్ పనులు పూర్తిచేశారు. ఇప్పుడు మెయిన్ రోడ్డులో ప్రధాన పైపులైన్ పనులు చేపట్టారు. అలాగే పైపులైన్ చాంబర్ పనులు చేస్తున్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు)/చిట్టినగర్(విజయవాడపశ్చిమ): : క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా తడి–పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించేందుకు నగరపాలక సంస్థ అందించిన మూడు రంగుల చెత్త బుట్టలను వినియోగించాలని నగరపాలక అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి అన్నారు. సర్కిల్–1 పరిధిలోని 48 వ డివిజన్‌లో బుధవారం అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేయడంతోపాటు సీ.ఎన్.జీ ఆటోలకు స్టిక్కర్లను అంటించి ప్రజలకు అవగాహన కల్పించారు. వీక్లీ యాక్టివిటిలో భాగంగా 48వ డివిజన్‌లో శ్రీ కామాక్షి విశ్వ బ్రహ్మణ కల్యాణ మండపం వద్ద, తడి, పొడి, ప్రమాదకర చెత్త, వ్యర్థాలు విడివిడిగా వీఎంసీ అందించిన మూడు చెత్త బుట్టల్లో వేసి, పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని స్థానికులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ నెల 12 డిసెంబర్ 18 వరకు వారం రోజుల పాటు నగరంలోని 64 డివిజన్ల పరిధిలోని 286 సచివాలయ ప్రాంతాల్లోని మూడు లక్షల కుటుంబాలకు మూడు రకాల చెత్త బుట్టలకు సంబంధించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తడి చెత్తను ఆకుపచ్చ బుట్ట, పొడి చెత్తను నీలిరంగు బుట్టలో, ఎరుపు రంగు బుట్టలో ప్రమాదకర వ్యర్థాలను వేసి నగరపాలక సిబ్బందికి అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, జోనల్ కమిషనర్ -1 కె.టి. సుధాకర్, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


చెత్తను విభజించి అందిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కమిషనర్ సత్యవతి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మాణాలను అంకిత భావంతో పూర్తి చేయాలని, సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, నాడు–నేడు పనుల ప్రగతి, స్పందన గ్రీవెన్స్ వంటి అంశాలపై బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులతో మాట్లాడారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల విషయంలో అలస త్వం సహించబోమని, ఇప్పటికే వివిధ దశలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పనులను వేగవంతం చేసి ఈ నెల 21న జరిగే సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ విషయంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలఆధ్వర్యంలో ఏర్పడిన టీమ్‌తో గ్రామ, వార్డు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకోవాలన్నారు. గృహ ప్రవేశాలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. నాడు నేడుపనులను సకాలంలో పూర్తిచేయా లన్నారు. పనులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. స్పందనలో అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అ ధికారులను కోరారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె. మోహన్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఘనంగా బసవపున్నయ్య జయంతి


బసవపున్నయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎం.బి.విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ మధు

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమర యోధుడు, మార్క్సిస్టు సిద్ధాంత కర్త మాకినేని బసవపున్నయ్య 108వ జయంతిని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి తులసీరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎం.బి.విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ పి.మధు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ సోషలిస్టు ఉద్యమకారుల్లో ఒకరైన బసవపున్నయ్య ఆనాడు స్వాతంత్ర్యోద్యమంలో చురుకైన పాత్ర వహించారు. గుంటూరు ఏసీ కాలేజీలో చదువుకుంటూ విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించి బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా, జమీందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో ముందుండి సమీకరించారు. దేశంలో స్వాతంత్రం, సోషలిజం నిర్మాణం కోసం, పేదరికం లేని నవ సమాజం నిర్మించడానికి అంతర్జాతీయంగా కమ్యూనిస్టు యోధులు స్టాలిన్, మావోతో సంప్రదింపులు చేశారన్నారు. ఆయన జీవిత కాలంలో నమ్మిన సిద్ధాంతానికి రాజీలేని పోరాటం నిర్వహించారన్నారు. పేదవారి అభ్యున్నతికి, నిరుద్యోగులు, ఆకలిమంటలతో ఉండే వారికి ఏదో ఒక విధంగా సహాయపడాలనే బసవపున్నయ్య ఆశయాల బాటలోనే ఎం.బి.విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్థిక అసమానతులు ఉండకూడదని, స్త్రీ పురుషులకు సమాన హక్కులు ఉండాలని, కులరహిత సమాజం రావాలని, వ్యవసాయ కార్మికుల సమస్యలపై విశేష కృషి చేశారని కొనియాడారు. బసవపున్నయ్య పేరుతోనే విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం, ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు యు.వి.రామరాజు, క్రాంతి, జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు గుండు నారాయణరావు, డి.వి.రాజు,బోస్, విజయ, డీవైఎఫ్ఐ కార్యదర్శి రామన్న పాల్గొన్నారు.

యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి

పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు పట్టుదలగా కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా పేర్కొన్నారు. సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం సివిల్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది యువత ఎటువంటి లక్ష్యాలను నిర్దేశించుకోకుండా జీవితాన్ని కొనసాగిస్తున్నారని, కేవలం ఐదు శాతం మంది మాత్రమే లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకుంటూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు. సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించడం వల్ల సమాజంలో మంచి గుర్తింపు ఉండటమే కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. సివిల్స్ పోటీ పరీక్షలో విజయం సాధించేందుకు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ రోజుకు 16 గంటల పాటు చదవాలన్నారు. సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చునని చెప్పారు. ఐఏఎస్ స్టడీ సర్కిల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, డీన్ రాజేష్ సి.జంపాల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా

హనుమత్ పీఠంలో దీక్షల విరమణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠంలో బుధవారం పలువురు భక్తులు దీక్షలను విరమించారు. తెలంగాణాలోని జనగాంకు చెందిన పలువురు భక్తులు ఆంజనేయస్వామి వారి దీక్షలను పూర్తి చేశారు. బుధవారం ఇరుముడులను ధరించి హనుమత్ దీక్షా పీఠానికి విచ్చేశారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ అభయ వీరాంజనేయ స్వామికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం దీక్షపరులతో స్వామీజీ దీక్షలను విరమింపజేసి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం భక్తులకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

ఉత్సాహంగా నలంద టెక్‌మన్‌థన్ 2కే 22

లబ్బీపేట(విజయవాడతూర్పు): చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు నలంద డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన టెక్‌మన్‌థన్ 2కే 22 ఘనంగా జరిగింది. నగరంలోని వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థలకు బైండ్‌టెక్, క్విజ్, పీపీటీ, స్పాట్ ఫొటోగ్రఫీ, లోగో మేకింగ్, టెక్‌హంట్, స్పాట్ రీల్ మేకింగ్, డంబ్ యాక్ట్, మిస్టర్ అండ్ మిస్, డ్యాన్స్, షార్ట్ ఫిల్మ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగు హెచ్‌ఓడీ సుందరకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్ట్‌తో పాటు, ప్రోగ్రామింగ్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి పి.దుర్గాభవానీ పాల్గొన్నారు.



డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



● కనులవిందుగా విద్యుత్ వెలుగులు

భవానీ దీక్షల విరమణ సందర్భంగా ప్రకాశం బ్యారేజీని విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ దీపాల వెలుగులు కృష్ణానదిలోని నీటిపై పడి ప్రకాశిస్తుండడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సిద్ధార్థ ఫార్మసీ కళాశాల క్రీడాకారుల సత్తా

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల క్రీడా పోటీల్లో విజయవాడ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల క్రీడాకారులు సత్తాచాటారు. ఈ నెల 9,10 తేదీల్లో భీమవరంలోని విష్ణు ఫార్మసీ కళాశాలలో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 15 ఫార్మసీ కళాశాలల నుంచి 400 మంది క్రీడాకారులు అథ్లెటిక్స్, వాలీబాల్, త్రోబాల్, చెస్ క్రీడాంశాలకు ప్రాతినిథ్యం వహించారు. ఈ పోటీల్లో సిద్ధార్థ ఫార్మసీ కళాశాల వాలీబాల్, త్రోబాల్ జట్లు రన్నర్ ట్రోఫీలను సాధించాయి. అదేవిధంగా చదరంగంలో కళాశాల స్త్రీ, పురుషుల జట్లు రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. 100 మీటర్ల రన్నింగ్‌లో మూడో స్థానం, 400 మీటర్ల రన్నింగ్‌లో రెండో స్థానం, లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం, డిస్కస్ త్రోలో మూడో స్థానాన్ని కాలేజీ క్రీడాకారులు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కాలేజీ ప్రిన్సిపాల్ అచంటి సునీత, పీడీ ఎల్.వినయ్‌శేఖర్ కళాశాలలో బుధవారం అభినందించారు.


సిద్ధార్థ ఫార్మసీ కళాశాల క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

సమావేశం హాలు నిర్మించాలని విజ్ఞప్తి

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 61వ డివిజన్లో డ్వాక్రాగ్రూపు మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు సమావేశం హాలు నిర్మించాలని మహిళలు వీఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో డివిజన్ మహిళా సంఘం కార్యదర్శి అరుణ మాట్లాడుతూ గతంలో శాంతినగర్ వాటర్‌ట్యాంక్ వద్ద ఉన్న మీటింగ్ హాలును ఆరోగ్య కేంద్రానికి ఏర్పాటు చేశారన్నారు. నెలకో పర్యాయం డ్వాక్రాగ్రూపుల మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందిగా ఉండడంతో హాలు నిర్మించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

విజయవాడ డివిజన్‌కు నేషనల్ అవార్డులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్‌లలో దక్షిణ మధ్య రైల్వే ఆరు అవార్డులు సాధించగా అందులో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ డివిజన్ మూడు జాతీయ అవార్డులు అందుకుంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బుధవారం అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌ల విభాగంలో విజయవాడ డివిజన్‌లోని రాజమండ్రి, తెనలి స్టేషన్లు ఎనర్జీ కన్జర్వేషన్ మెరిట్ అవార్డులు, భవనాల విభాగంలో విజయవాడ సత్యనారాయణపురంలోని ఈటీటీసీ (ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్) మరో అవార్డు సాధించాయి. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు, సీఈజీఈ ఎం.గోపాల్, సీనియర్ డీఈఈ టీ.సురేష్‌బాబు, ఇతర అధికారులు కేంద్ర విద్యుత్, నూతన, పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ఆర్‌కే సింగ్ చేతులమీదుగా అవార్డులను అందుకున్నారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డులు రావడంలో కృషి చేసిన ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఈటీటీసీ అధికారులను డీఆర్ఎం శివేంద్రమోహన్ అభినందించారు.



కేంద్రమంత్రి ఆర్‌కే సింగ్ నుంచి అవార్డులను అందుకుంటున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుంది

పార్టీ నాయకుల సమీక్షలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రోజురోజుకు ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్న విషయం జగన్‌రెడ్డికి అర్థమైందన్నారు. అందుకే ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు కూడా ఆలోచిస్తున్నారని చెప్పారు. ఆయన బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నాయకులతో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంపై సమీక్షించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ ఓటమి వందకు వెయ్యిశాతం ఖాయమని చెప్పారు. మేలో ఎన్నికలకు వెళ్లాలా, అక్టోబర్‌లోనా, 2024 వరకు ఆగాలా అనే అంశంలో జగన్ ఆలోచనలో పడ్డారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడంలో టీడీపీ చేపట్టిన బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ కార్యక్రమానికి ప్రజల్లోంచి అనూహ్య స్పందన వస్తోందని చెప్పారు. పింఛన్లు, ఇతర పథకాలు నిలిపేస్తామని వలంటీర్లతో బెదిరించినా ప్రజలు పెద్ద ఎత్తున టీడీపీ కార్యక్రమాలకు వస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీయడంతో అర్హులకు పింఛన్లు, ఇతర పథకాల్లో కోతలు పెడుతున్నారన్నారు. నష్టపోయిన వారందరికీ టీడీపీ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు నానా కష్టాలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటంలేదని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం 12 లక్షల ఇళ్లు నిర్మిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలో పేదలకు కేవలం ఐదిళ్లు మాత్రమే కట్టిన విషయంపై ప్రజలతో చర్చించాలని సూచించారు. దక్షిణ భారతదేశంలో తలసరి ఆదాయంలో అన్ని రాష్ట్రాల కంటే ఏపీ వెనుకబడిపోయిందని ఆయన పేర్కొన్నారు.

బీసీ వ్యతిరేక వైఖరిని కేంద్రం మార్చుకోవాలి: ఆర్.కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం బీసీలపట్ల అనుసరిస్తోన్న వ్యతిరేక వైఖరిని మార్చుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మనిషిని మనిషిగా గౌరవించే వ్యవస్థ కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో వారికి 50% రిజర్వేషన్లు కల్పించేంతవరకు బీసీ ఉద్యమాన్ని విస్తరిస్తామని హెచ్చరించారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం, తెలంగాణ బీసీ 26 కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. జనాభా లెక్కల్లో బీసీ కులాలను లెక్కించాలని, బీసీలకు ప్రత్యేకమంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పాల్గొన్నారు.

చక్కని సాగుకు.. చిన్న డ్రోన్లు



షేడ్ నెట్‌లో తిరుగుతున్న డ్రోన్లు

డ్రోన్ టెక్నాలజీలో విప్లవాత్మక మార్పుల దిశగా ఎన్జీ రంగా యూనివర్సిటీ పయనం

వ్యవసాయ రంగంలో 45 కిలోల వరకు బరువు గల ప్రైవేట్ డ్రోన్లు గతంలో సేవలందించేవి. ఆయిల్ ఇంజన్ సహాయంతో నడిచే ఈ డ్రోన్ల వల్ల ఎక్కువ శబ్దంతో పాటు దాని బరువు కారణంగా వినియోగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ పరిస్థితుల్లో వాటి బరువును 25 కేజీలకు కుదించిన ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఆధునిక సాంకేతికతను వినియోగించటం ద్వారా తాజాగా ఆ బరువును 250 గ్రాములకు తగ్గించగలిగింది. రానున్న రోజుల్లో అరచేతిలో ఇమిడిపోయేలా కేవలం 10 గ్రాముల బరువుతో డ్రోన్లను తయారు చేయడంపై దృష్టి సారించింది. ఈ తరహా డ్రోన్ అందుబాటులోకి వస్తే షేడ్ నెట్, గ్రీన్ మ్యాట్ తరహా సాగు విధానంలో సమస్యగా మారిన పరపరాగ సంపర్కాన్ని విజయవంతంగా జరిపించవచ్చు.

ఫోన్ కంటే స్మార్ట్‌గా..

కూలీల కొరత తీవ్రమవటం, ఎరువులు, పురుగు మందు ధరలు పెరిగిపోవటం వల్ల నష్టపోతున్న రైతులకు ఊరట కల్పించడమే కాకుండా యువతరాన్ని రాబోయే కాలంలో వ్యవసాయం వైపు మరల్చడానికి డ్రోన్ టెక్నాలజీ దోహదం చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్జీ రంగా యూనివర్సిటీ డ్రోన్ బరువును 45 కిలోల నుంచి 25 కిలోలకు తగ్గించింది. తాజాగా కేవలం 250 గ్రాముల బరువైన డ్రోన్లను సైతం రూపొందించింది. కాగా, కొన్ని ప్రైవేటు కంపెనీలు 45 కిలోల బరువున్న డ్రోన్లను ఆయిల్ ఇంజన్ సహాయంతో నడుపుతున్నాయి. వీటి నుంచి ఎక్కువ శబ్దం చేయడంతోపాటు దాని బరువు కారణంగా వినియోగించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. షేడ్‌నెట్స్, గ్రీన్‌మ్యాట్ వంటి పద్ధతుల్లో పంటలు పండించే చోట గాలి ఎక్కువగా తగలకపోవడం వల్ల పుప్పొడి ఒక పుష్పం నుంచి మరో పుష్పంపైకి చేరటం లేదు. ఈ కారణంగా మొక్కల్లో పరపరాగ సంపర్కం జరగక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అరచేతిలో ఇమిడిపోయేంత డ్రోన్లను ఆ మొక్కలపై తిప్పితే పరపరాగ సంపర్కం అవుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకోసం అతి చిన్న డ్రోన్లను తయారు చేయడానికి ఎన్జీ రంగా శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ తరహా డ్రోన్లు విదేశాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటి బరువు కేవలం 10 గ్రాముల వరకూ ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీటిని అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా షేడ్ నెట్స్, గ్రీన్ మ్యాట్ సాగులో మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంది.



- విత్తు నాటడం నుంచి పంట చేతికి వచ్చేవరకు అన్ని పనుల్లోనూ డ్రోన్ల వినియోగం
- యూనివర్సిటీ కృషితో ప్రస్తుతం 25 కిలోల నుంచి 250 గ్రాములకు తగ్గిన వ్యవసాయ డ్రోన్ల బరువు
- ఇకపై 10 గ్రాముల బుల్లి డ్రోన్లు సృష్టించేందుకు యూనివర్సిటీ ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, గుంటూరు: డ్రోన్ అంటే ఒకప్పుడు పెళ్లిళ్లు, బహిరంగ సభలు, పాదయాత్రల వీడియో, ఫొటోలు తీయడానికి మాత్రమే పరిమితం. అదే డ్రోన్ టెక్నాలజీ ఇప్పుడు అన్ని రంగాల్లో అడుగుపెట్టింది. సైనిక అవసరాలతో పాటు ఫుడ్ డెలివరీకి కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేకి కూడా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే. రానున్న రోజుల్లో అరచేతిలో ఇమిడిపోయే బుల్లి డ్రోన్లు రంగ ప్రవేశం చేయనున్నాయి. ఈ తరహా డ్రోన్లను అభివృద్ధి చేసి వ్యవసాయ రంగంలో వినియోగించేలా ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది. ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయ రంగంలో వినియోగించడంతోపాటు రైతులనే డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దే బాధ్యతను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం భుజాన వేసుకుంది. ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీని ఎరువులు, విత్తనాలను వెదజల్లేందుకు మాత్రమే వ్యవసాయ రంగంలో వినియోగిస్తున్నారు. రానున్న కాలంలో రోజుల్లో ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసి రైతులకు అన్ని దశల్లోనూ వ్యవసాయ పనులు చేసి పెట్టేలా డ్రోన్లను రూపొందించేందుకు ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఎరువులు, పురుగు మందులు చల్లేందుకే..

వ్యవసాయంలో డ్రోన్లను ప్రస్తుతం పురుగు మందులు పిచికారీ చేసేందుకు వాడుతున్నారు. దీనివల్ల 25 శాతం వరకూ పురుగు మందులు ఆదా కావడంతోపాటు పొలం మొత్తం సమానంగా పిచికారీ చేసే అవకాశం కలిగింది. మరోవైపు ఎరువుల్ని చల్లడం, వెద పద్ధతిలో విత్తనాలు వేయడానికి వినియోగిస్తున్నారు. దీనివల్ల కూలీల ఖర్చు తగ్గుతోంది. మరోవైపు డ్రోన్లను వినియోగించి నేల స్వభావం తెలుసుకోవడం ద్వారా నేలలో ఏయే పోషకాలు అవసరం, ఏ పోషకాలు అధికంగా ఉన్నాయి, ఉప్పు నేలలు, చౌడు, ఉరకెత్తు ప్రాంతాలను గుర్తించి వాటికి అనుగుణంగా యాజమాన్య పద్ధతులు చేపట్టేందుకు ఉపయోగపడుతున్నాయి. ఇదే సందర్భంలో డ్రోన్లను ఉపయోగించి అడవుల్లో మొక్కల సాంద్రత తెలుసుకుని అవసరమైన ప్రాంతాల్లో విత్తనాలు చల్లుకునే అవకాశం ఉంది. చెరువులు, కుంటలు, నదులు, జలపాతాల్లో నీటి పరిమాణం అంచనా వేయడానికి, నీటిని నిల్వచేయడానికి వాటర్‌షెడ్స్, చెక్‌డ్యామ్‌లు ఎక్కడ ఎలా కట్టుకోవాలనే అంశాన్ని డ్రోన్ టెక్నాలజీతో తెలుసుకోవచ్చు.

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

"డ్రోన్ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. విత్తనాలు చల్లుకోవడం నుంచి ఎరువులు, పురుగు మందులు వేయడం, పంటల అంచనా, పంటలకు అందించాల్సిన పోషకాలు అందించడంతో పాటు పలు అంశాల్లో ఈ టెక్నాలజీ ప్రయోజనకారిగా ఉంటుంది. అంగ్రూ తరపున డ్రోన్ వినియోగంపై శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. రానున్న రోజుల్లో చిన్నపాటి డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తెచ్చేలా కృషి జరుగుతోంది.

– ఎ.సాంబయ్య, సీనియర్ శాస్త్రవేత్త, అంగ్రూ

• తెలంగాణ

ఢిల్లీలో బీఆర్ఎస్ జెండా!

- జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించిన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్
- మాజీ సీఎంలు కుమారస్వామి, అఖిలేశ్ యాదవ్, ఎంపీ తిరుమావళావన్, రైతు సంఘాల నేతల హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి ప్రస్థానానికి తొలి అడుగు పడింది. పార్టీ జాతీయ కార్యాలయం ఢిల్లీలో ఏర్పాటైంది. పలువురు జాతీయ నేతల సమక్షంలో, పార్టీ నేతల కోలాహలం మధ్య కేసీఆర్ ఈ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఢిల్లీలోని సర్దార్‌పటేల్ మార్గ్‌లో బీఆర్ఎస్ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు కేసీఆర్ మధ్యాహ్నం 12 గంటలకు చేరుకున్నారు. తర్వాత వేద పండితులు ఫణి శశాంక శర్మ, గోపీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో చేపట్టిన రాజశ్యామల యాగం పూర్ణాహుతిలో సీఎం కేసీఆర్, ఆయన సతీమణి శోభారాణి, వారి కుమార్తె, ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, తమిళనాడు వీసీకే పార్టీ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్, జాతీయ కిసాన్ నేత గుర్నామ్ సింగ్‌తోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల నాయకులు కూడా పాల్గొన్నారు. 12.37 గంటలకు సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జాతీయ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయం మొదటి అంతస్తులో తనకు కేటాయించిన చాంబర్‌లోని కుర్చీలో జాతీయ అధ్యక్షుడి హోదాలో కేసీఆర్ ఆసీనులయ్యారు. జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేశారు. తర్వాత బీఆర్ఎస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా, హరియాణాలోని కురుక్షేత్రకు చెందిన జాతీయ రైతు సంఘం నేత గుర్నామ్ సింగ్ చడూనిని.. జాతీయ కార్యాలయ కార్యదర్శిగా రవి కొహార్‌ను నియమించారు.

బీజేపీపై ఉమ్మడిగా పోరాడుదాం!

దేశ సమగ్రతను దెబ్బతీసేలా, రాష్ట్రాల హక్కులను కాలరాలేసేలా, ప్రాంతీయ పార్టీల అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్న బీజేపీపై ఉమ్మడి పోరు సాగించాలని పలు పార్టీల నేతలు, రైతు సంఘాల నాయకులకు కేసీఆర్ పిలుపునిచ్చారు. కలిసి నడిచేందుకు ముందుకొచ్చిన పార్టీలతోపాటు భవిష్యత్తులో మద్దతుగా నిలిచే ఇతర భావసారూప్య పార్టీలను, సంఘాలను కలుపుకొని జాతీయ స్థాయిలో ఉద్యమాలు నిర్మిద్దామని పేర్కొన్నారు. జేడీఎస్ నేత కుమారస్వామి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, వీసీకే పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్, జాతీయ కిసాన్‌నేత గుర్నామ్‌సింగ్‌తోపాటు హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన నేతలతో కేసీఆర్ విడివిడిగా భేటీ అయ్యారు. వారితో వివిధ జాతీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కేసీఆర్ మరో మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఉంటారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

26న హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక

- 30వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు రానున్నారు. శీతకాల విడిదిలో భాగంగా ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. 26న మధ్యాహ్నం శ్రీశైలం దేవస్థానాన్ని సందర్శించి అక్కడ జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అనంతరం తెలంగాణ పర్యటనకు బయలుదేరనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3.05 గంటల నుంచి 3.15 వరకు బొల్లారంలో యుద్ధస్మారకాన్ని సందర్శించి నివాళి అర్పించడంతో పాటు వీరనారులను సన్మానించనున్నారు. సాయంత్రం 7.45 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇచ్చే విందుకు హాజరు అవుతారు. 27న ఉదయం 10.30 గంటలకు నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీని సందర్శించి విద్యార్థులతో సంభాషించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు సర్దార్ వల్లభాయ్ జాతీయ పోలీసు అకాడమీని సందర్శించి శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులతో మాట్లాడనున్నారు.

భద్రాచలం, రామప్ప ఆలయాలకు రాష్ట్రపతి

ఈ నెల 28న ఉదయం 10.40 నుంచి 11.10 గంటల వరకు భద్రాచలం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. కేంద్ర పర్యాటక శాఖకి సంబంధించిన 'ప్రశాద్' అనే ప్రాజెక్టును ఈ సందర్భంగా ఆమె ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు వరంగల్ జిల్లాలోని రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు.

ఆశ, అంగన్‌వాడీలతో సమావేశం

29న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు షేక్‌పేట్‌లోని నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌ను రాష్ట్రపతి సందర్శించి విద్యార్థులతో మాట్లాడనున్నారు. సాయంత్రం 5–6 గంటల వరకు శంషాబాద్‌లోని శ్రీరామానుజచార్యుల విగ్రహాన్ని సందర్శిస్తారు. 30న ఉదయం 10–11 గంటల వరకు రంగారెడ్డి జిల్లా శాంతివనంలోని శ్రీరామచంద్ర మిషన్‌ను సందర్శించి అక్కడ జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఏపీ, తెలంగాణకు చెందిన అంగన్‌వాడీ, ఆశ వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతారు. మధ్యాహ్నం 1 గంటకు రాష్ట్రపతి నిలయంలో భోజనం చేసి ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు.

స్థానిక వార్తలు

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు పూర్తి

- బుధవారం రాత్రికే నగరానికి చేరుకున్న భవానీలు
- 19వ తేదీ పూర్ణాహుతితో ముగింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)/సాక్షి ప్రతినిధి, విజయవాడ: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈ ఏడాది మరో అతి పెద్ద ఉత్సవానికి ముస్తాబైంది. ఇంద్రకీలాద్రిపై గురువారం నుంచి భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం ఉదయం 6 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం 6.30 గంటలకు హోమగుండాలలో అగ్నిప్రతిష్ఠాపనతో దీక్షల విరమణలు ఆరంభమవుతాయి. 19వ తేదీ సోమవారం మహాపూర్ణాహుతితో దీక్ష విరమణలు లాంఛనంగా పూర్తవుతాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, ఒడిశాల నుంచి భక్తులు దీక్షలు విరమించేందుకు ఇంద్రకీలాద్రికి తరలిరానున్నారు. ఈ ఏడాది సుమారు 7 లక్షల మంది భవానీలు దీక్ష విరమణలు చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. బుధవారమే నగరానికి చేరుకున్న భవానీలు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకుంటున్నారు. గిరి ప్రదక్షిణ బ్రాహ్మణ వీధి రథం సెంటర్ మీదుగా 9 కిలోమీటర్ల మేర ప్రదక్షిణ చేసి వినాయక గుడికి చేరుతుంది. క్యూలైన్లతో పాటు గిరి ప్రదక్షిణ మార్గాలలో 24 గంటలూ మూడు షిఫ్టులలో మంచినీటిని అందించేందుకు సిబ్బందిని నియమించారు. గిరి ప్రదక్షిణ అనంతరం అర్ధరాత్రి క్యూలైన్‌లోకి చేరుకుని అక్కడే విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం తమిళనాడుకు చెందిన వందలాది మంది భవానీలు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులను సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం రూ.100,రూ.300, రూ.500ల టికెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. రూ.500 టికెట్ కలిగిన భక్తులకు వీఎంసీ హోల్డింగ్ ఏరియా, మోడల్ గెస్ట్ హౌస్ నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ఓం–టర్నింగ్ వద్ద రూ.500 ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనంకు అనుమతి ఇస్తారు.

భవానీలకు దేవస్థానం కల్పించిన సదుపాయాలివే...

సీతమ్మ వారి పాదాలు, పున్నమి ఘాట్, భవానీ ఘాట్‌లలో దేవస్థానం మొత్తం 8 వందల షవర్లు ఏర్పాటు చేసింది. ఇక ఆయా స్నానఘాట్లలో భవానీలు దుస్తులు మార్చుకునేందుకు షెడ్లను ఏర్పాటు చేసింది. మరో వైపున స్నానఘాట్లకు సమీపంలోనే క్లోక్‌రూమ్‌లు, చెప్పుల స్టాండ్‌లను ఏర్పాటు చేసింది.

12 ప్రసాదం కౌంటర్లు

భవానీలు అమ్మవారి ప్రసాదాలను కొనుగోలు చేసేందుకు దేవస్థానం మొత్తం 12 ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేసింది. కనకదుర్గనగర్‌లో 10 కౌంటర్లు నిరంతరం ప్రసాదాలను విక్రయించేలా చర్యలు తీసుకుంది. ఇక రైల్వే స్టేషన్‌లో ఒకటి, బస్టాండ్‌లో మరో ప్రసాదం కౌంటర్‌ను ఏర్పాటు చేసింది. సుమారు 13 లక్షల లడ్లు తయారు చేశారు. 8.5 లక్షల వాటర్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. 20 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.

మూడు షిఫ్టుల్లో క్షురకులు

భవానీలు తలనీలాలు సమర్పించేందుకు దేవస్థానం మూడు స్నానఘాట్లలో మూడు కేశ ఖండనశాలలను ఏర్పాటు చేసింది. సీతమ్మ వారి పాదాల వద్ద కేశ ఖండన శాలలో మూడు షిఫ్టులలో 600 మంది క్షురకులను అందుబాటులో ఉంచింది. ఇక భవానీ ఘాట్‌లో షిఫ్టుకు 30 మంది, పున్నమి ఘాట్‌లో షిఫ్టుకు 50 మందిని అందుబాటులో ఉంచారు.

మొబైల్ టాయిలెట్లు సిద్ధం

భవానీ దీక్ష విరమణల నేపథ్యంలో భవానీలు కాలకృత్యాలను తీర్చుకునేందుకు దేవస్థాన పరిసరాలలో 200కు పైగా మొబైల్ టాయిలెట్లను దేవస్థానం అందుబాటులోకి తీసుకువచ్చింది. రాజీవ్ గాంధీ పార్కు వద్ద 20, హోల్డింగ్ పాయింట్‌లో 40, బస్టాండ్ బయట 5, రథం సెంటర్‌లో 6, కెనాల్‌రోడ్డులో 20, పున్నమి ఘాట్‌లో30, భవానీఘాట్‌లో 40, టీటీడీ స్థలంలో 10, గిరి ప్రదక్షిణ రోడ్డులో 30, కొండపైన, రాజగోపురం, ఓం టర్నింగ్ వద్ద 6 టాయిలెట్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.



అమ్మవారి దర్శనానికి వెళ్లేందుకు భవానీ భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు



భక్తుల కోసం ఏర్పాటుచేసిన ప్రాంగణంలో వేచి ఉన్న భక్తులు

సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ప్రస్తుతం ఉన్న 200 సీసీ కెమెరాలతో పాటు అదనంగా 57 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కలెక్టర్ కార్యాలయం, కంట్రోల్ రూమ్, మోడల్ గెస్ట్‌హౌస్‌ల నుంచి నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు. భవానీల రద్దీ దృష్ట్యా నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. ఇప్పటికే ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆలయ ఈవో భ్రమరాంబ, సబ్ కలెక్టర్ అదితి సింగ్ తదితరులు ఏర్పాట్లను సమీక్షించి, స్వయంగా పరిశీలించారు.

భవానీ దీక్షల విరమణకు పటిష్ట పోలీసు బందోబస్తు

సీపీ టి.కె.రాణా

విజయవాడ స్పోర్ట్స్: భవానీ దీక్షల విరమణ సందర్భంగా కనకదుర్గ అమ్మవారి దేవస్థానం వద్ద విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తతతో ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సూచించారు. కమాండ్ కంట్రోల్ రూంలో బుధవారం ఆయన పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్యూలైన్లు, అమ్మవారి ఆలయం, ప్రసాదం కౌంటర్లు, అర్జున వీధి, రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో జేబు, గొలుసు దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 4,500 మంది పోలీసులు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డీసీపీలు విశాల్‌గున్ని, మేరీప్రశాంతి, ఉదయరాణి, మోకా సత్తిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ టి.కె.రాణా

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

విజయవాడ స్పోర్ట్స్: భవానీ దీక్షల విరమణ సందర్భంగా ఈ నెల 15వ తేదీ గురువారం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. 14వ తేదీ అర్ధరాత్రి నుంచి 15వ తేదీ అర్ధరాత్రి వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. వాహన చోదకుల, భవానీ దీక్షాపరుల సౌకర్యార్థం ఈ ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రకటించారు.

వాహనాల రాకపోకలు ఇలా:

- పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి హైదరాబాద్, జగ్గయ్యపేట, తిరువూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు వారధి జంక్షన్, స్క్యూబ్రిడ్జి, బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగ్, కంట్రిక జంక్షన్, పైపుల రోడ్డు జంక్షన్, వైవీరావు ఎస్టేట్, కబేళా సెంటర్, ఊర్మిళానగర్, గొల్లపూడి బైపాస్ మీదుగా రాకపోకలు సాగించాలి.
- సిటీ బస్ స్టాప్ నుంచి ఇబ్రహీంపట్నం, భవానీపురం, పాలప్రాజెక్ట్, వైఎస్సార్ కాలనీ వైపు వెళ్లే బస్సులు పీసీఆర్ జంక్షన్, హోటల్ స్వర్ణా ప్యాలెస్ జంక్షన్, హనుమాన్ పేట, ఏలూరు లాకులు, సీతన్నపేట గేటు, దాబాకొట్లు సెంటర్, ఇన్నర్ రింగ్ రోడ్డు, పాలప్రాజెక్ట్ మీదుగా రాకపోకలు సాగించాలి.

పార్కింగ్ ప్రదేశాలు:


కనకదుర్గ అమ్మవారి దేవస్థానంకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయించినట్లు సీపీ తెలిపారు. విజయవాడ నుంచి వచ్చే భక్తులు వారి వాహనాలను గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో, హైదరాబాద్, జగ్గయ్యపేట, తిరువూరు వైపు నుంచి వచ్చే వాహనాలు పున్నమిఘాట్, భవానీఘాట్, సుబ్బారాయుడు ఖాళీ స్థలంలో, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి నుంచి వచ్చే వాహనాలు సితార సెంటర్ సమీపంలోని పాత సోమా కంపెనీ స్థలంలో, మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ నుంచి వచ్చే వాహనాలు బీఆర్‌టీఎస్ రోడ్డులో, గుంటూరు, ప్రకాశం, రాయలసీమ నుంచి వచ్చే వాహనాలు వారధి జంక్షన్ వద్ద ఉడా ఖాళీ స్థలంలో, కృష్ణలంక సర్వీస్ రోడ్డులో, ఎం.హోటల్ నుంచి నల్లగేట్ వరకు పార్కింగ్ చేసుకోవాలని సీపీ సూచించారు.

గుడివాడతో అమరజీవి అనుబంధం

- అమరజీవితో కడదాకా ఉన్న గుడివాడ వాసి సాధుసుబ్రహ్మణ్యం
- గుడివాడలో సర్కారు ఎక్స్‌ప్రెస్ ఎక్కి మద్రాసు చేరి ఆమరణ దీక్ష ప్రారంభించిన వైనం
- ఈరోజు అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు అంతిమ యాత్రకు నలుగురు మనుషులైనా లేని పరిస్థితుల్లో సాధుసుబ్రహ్మణ్యం గుడివాడకు చెందిన ఘంటసాలను పిలిచాడు. ఆయన వచ్చి శ్రీరాములు శవాన్ని చూసి ఆవేశంతో మద్రాసు వీధుల్లో ఎలుగెత్తి పాటందుకోగానే క్షణాల్లో వేలాది మంది పోగయ్యారు.

కృష్ణాడెస్క్: ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు ఉద్యుక్తుడై బయలుదేరి వెళ్లింది కృష్ణాజిల్లా గుడివాడ నుంచే. మద్రాసులో తెలుగువారికి అవమానాలు చూసి భరించలేక గుంటూరుకు చెందిన గాంధేయవాది స్వామి సీతారాం(ఈయన అసలు పేరు గొల్లపూడి సీతారామశాస్త్రి) గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అయితే రాజాజీ దానిని భగ్నం చేశాడు. పైగా తెలుగువారు ఆరంభశూరులు అని హేళన చేశారు. ఈ విషయం తెలిసి అప్పుడు గుడివాడలో తన మిత్రుడు యెర్నేని సాధుసుబ్రహ్మణ్యం(ఈయన గుడివాడ సమీపంలోని కొమరవోలు గాంధీ ఆశ్రమ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు) వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు వెంటనే సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి మద్రాసు చేరుకున్నారు. అక్కడ బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. రాజాజీకి భయపడి కాంగ్రెస్ వారు ఎవరూ పొట్టి శ్రీరాములు దీక్షను పట్టించుకోలేదు. శ్రీరాములు వద్ద గుడివాడకు చెందిన సాధు సుబ్రహ్మణ్యం తప్ప ఎవరూ లేరు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తనను ఎవరూ పట్టించుకోకపోవడం గురించి పొట్టి శ్రీరాములు తన ఆవేదన అంతా తన మిత్రులైన గుడివాడకు చెందిన సాధు సుబ్రహ్మణ్యం అల్లుడు ముసునూరి భాస్కరరావు, (ఈయన భార్య, సాధు సుబ్రహ్మణ్యం కుమార్తె ముసునూరి కస్తూరీదేవి 1967లో కాంగ్రెస్ పార్టీ తరఫున గుడివాడ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.) మరో స్వాతంత్ర్య సమరయోధుడు కూరాళ్ల భుజంగ భూషణరావులకు లేఖల్లో రాశారు. వారాల తరబడి ఆహారం లేకుండా పోవడంతో పేగులు పుండ్లు పడి పురుగులు నోటి వెంట, కళ్ల వెంట, చెవుల వెంట వచ్చేవి. జీర్ణ వ్యవస్థ తిరగబడి మలం నోటి వెంట వచ్చేది. ఎట్టకేలకు దీక్ష 58వ రోజు అంటే 1952 డిసెంబరు 15 రాత్రి 11.30 గంటల సమయంలో పొట్టి శ్రీరాములు ప్రాణం అనంత వాయువుల్లో కలసిపోయింది. శవం దగ్గర సాధు సుబ్రహ్మణ్యం ఒక్కడే ఉన్నాడు. కనీసం గుడివాడ వాళ్లనయినా నలుగురిని పోగేసుకు వచ్చి ఎలాగోలా అంత్యక్రియలు ముగిద్దామనుకున్నాడు. మద్రాసులో ఉన్న గాయకుడు ఘంటసాలది గుడివాడ పక్కనే చౌటపల్లి కాబట్టి ఆయన వద్దకు వెళ్లి విషయం చెప్పాడు. ఆ సమయంలో ఆయన పక్కన గుడివాడ సమీపంలోని మోపర్రుకు చెందిన హరికథకుడు మోపర్రు దాసు ఉన్నాడు. ఆయన నేను కూడా గుడివాడ వాడినే కదా నేనూ వస్తాను అని బయలుదేరాడు. ఇద్దరూ కలసి సాధుసుబ్రహ్మణ్యం ఇంటి వద్దకు వచ్చారు. అక్కడ తాటాకులు కప్పి ఉన్న శ్రీరాములు శవాన్ని చూసి వారికి వాంతులు అయ్యాయి.



తెలుగు జాతి కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు శవయాత్ర ఎవరికీ తెలియకుండా చేయడం సమంజసం కాదని, తెలుగు వాళ్ల కళ్లు తెరిపించేలా ఈ శవయాత్ర సాగాలని ఘంటసాల తలచాడు. అప్పటికప్పుడు ఆశువుగా 'చీము, నెత్తురు లేని తెలుగు జాతి కోసం అసువులు బాసిన ఓ అమరజీవి పొట్టి శ్రీరాములూ....' అంటూ తన గంభీర స్వరంతో ఎలుగెత్తి పాడడం ప్రారంభించాడు. ఒక ఎద్దుల బండి మాట్లాడి అందులో శవాన్ని ఉంచి శవయాత్ర ప్రారంభించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల ముందుగా శవయాత్ర వెళుతుండగా కాలేజీలో తెలుగు విద్యార్థులు ఘంటసాల గద్గద స్వరంతో, ఆవేశంతో పాడుతున్న పాట విని బయటకు వచ్చి శవయాత్ర వెంట నడవడం ప్రారంభించారు. ఈలోగా పొట్టి శ్రీరాములు మరణ వార్త తెలిసి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మెయిల్‌లో మద్రాసు వచ్చారు. సరిగ్గా ఆ సమయానికి శవయాత్ర మద్రాసు సెంట్రల్ స్టేషన్‌కు చేరింది. శ్రీరాములు శవాన్ని చూసిన ప్రకాశం పంతులుకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తనదైన భాషలో తెలుగుజాతి చేతకానితనాన్ని చీల్చి చెండాడాడు. దాంతో కొద్దిసేపట్లోనే వేలాది మంది పోగయ్యారు. ఆ సందర్భంగా జరిగిన అల్లర్లలో 8 మంది పోలీసు కాల్పుల్లో చనిపోయారు. తత్ఫలితంగా 1953 అక్టోబరు ఒకటిన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించింది.

ఏపీకి 'జాతీయ ఇంధన పరిరక్షణ' అవార్డు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్న ఇంధన శాఖ

- రాష్ట్రంలో ఇంధన పొదుపు, సంరక్షణపై కేంద్రం ఫిదా
- బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే అభినందనలు



రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డును అందుకుంటున్న ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇంధన పరిరక్షణ మిషన్ సీఈవో చంద్రశేఖరరెడ్డి

సాక్షి, అమరావతి : ఇంధన పొదుపు, సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటింది. ఇంధన భద్రత దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్రానికి ప్రతిష్టాత్మక 'జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు'ను కేంద్ర ప్రభుత్వం అందించింది. ఇంధన వినియోగం ఆధారంగా దేశంలోని రాష్ట్రాలను నాలుగు గ్రూపులుగా విభజించగా.. రెండో గ్రూపులో ఉన్న ఏపీ అత్యుత్తమ పనితీరు కనబరిచి మొదటి స్థానంలో అవార్డును సొంతం చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం బుధవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్(ఏపీఎస్ఈసీఎం) సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డిలు ఈ అవార్డును అందుకున్నారు. ఏపీఎస్ఈసీఎం స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇండెక్స్–2022లో 77.5 స్కోర్ సాధించింది. 2020లో రాష్ట్రానికి 50.5 స్కోర్ రాగా.. తాజాగా స్కోరు 53 శాతం మెరుగైంది. దీంతో అవార్డుకు ఏపీ ఎంపికైంది. రాష్ట్రం తరఫున ఇంధన సామర్థ్యం, పరిరక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏపీఎస్ఈసీఎంకు ఇది ఐదో జాతీయ పురస్కారం కావడం విశేషం. రాష్ట్రంలో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్–2017 జీవో జారీ, పట్టణ, స్థానిక సంస్థల్లో భవన నిర్మాణ నిబంధనల్లో చేసిన సవరణలు, భవన నిర్మాణ రంగంలో ఎకో–నివాస్ సంహిత అమలుకు తీసుకున్న చర్యలు, కోర్టు భవనాల్లో ఇంధన సామర్థ్య చర్యలు వంటివి రాష్ట్రానికి అవార్డు రావడంలో దోహదపడ్డాయి. అలాగే ఎంఎస్ఎంఈల్లో అమలు చేసిన ఇంధన సామర్థ్య కార్యక్రమాలు, ఆర్టీసీ సహా వివిధ ప్రభుత్వ శాఖలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందజేయడం, సాధారణ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు తీసుకున్న చర్యలు, పరిశ్రమలు, వ్యవసాయం, గ్రామీణ మంచినీటి సరఫరా, పాఠశాలలు, పంచాయతీలు, మునిసిపాలిటీలు తదితర శాఖల్లో చేపట్టిన వివిధ ఇంధన సామర్థ్య కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ఏపీ స్కోర్ మెరుగుపడేందుకు దోహదపడ్డాయి. భారీ పరిశ్రమలు అమలు చేస్తున్న పాట్ పథకం నిర్దేశిత లక్ష్యాలను సాధించడం వల్ల 0.818 ఎంటీవోఈ ఇంధనం ఆదా అయింది.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

రాష్ట్రానికి అవార్డు రావడంపై కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే ఏపీఎస్ఈసీఎంకు అభినందనలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందించిన సహకారం, మార్గదర్శకాల కారణంగానే రాష్ట్రానికి ఈ అవార్డు లభించిందని ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ తెలిపారు. ప్రభుత్వ సహకారంతో వివిధ కీలక రంగాల్లో అమలు చేసిన ఇంధన సామర్థ్య కార్యక్రమాల వల్ల రూ.3,800 కోట్ల విలువైన 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయగలిగామన్నారు. ఇంధన సామర్థ్య రంగం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించిన రాష్ట్ర ప్రభుత్వం, బీఈఈకి ఏపీఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాలు అమలుకు సహకరించిన పరిశ్రమలు, డిస్కంలకు, భవన నిర్మాణ, రవాణా వంటి కీలక శాఖలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు ప్రదానోత్సవ వేడుకలో విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మజనార్దనరెడ్డిలు పాల్గొన్నారు.

నేటి నుంచి భవానీ దీక్షల విరమణలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భవానీ దీక్ష విరమణలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం వరకు ఐదు రోజులు కొనసాగుతాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సాల నుంచి సుమారు ఏడు లక్షల భవానీలు తరలిరానున్నారు. వారికి అవసరమైన ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భవానీలు కొండ దిగువన ఇరుముడులను సమర్పించేందుకు కౌంటర్లు సిద్ధం చేశారు. మొదటి రోజు ఉదయం ఆరు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం కానుంది. ప్రతిరోజూ తెల్లవారుజాము 3.00 గంటల నుంచి రాత్రి 11.00 వరకు భక్తులకు దర్శనం కల్పించనున్నారు. భక్తుల సౌకర్యార్థం రూ.100, రూ.300, రూ.500 టికెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. 13 లక్షల లడ్డూలు తయారు చేశారు. 8.5 లక్షల వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆలయ ఈవో భ్రమరాంబ, సబ్ కలెక్టర్ అదితి సింగ్ పరిశీలించారు.


వివిధ ప్రాంతాల నుంచి ఇరుముడితో విజయవాడలోని ఇంద్రకీలాద్రికి వస్తున్న భవానీలు

స్మార్ట్ ల్యాబ్ ఆన్ వీల్స్

- స్వాహాస్ పేరుతో మెడ్‌టెక్ జోన్‌లో రూపకల్పన
- దేశంలో తొలిసారిగా సంచార వైద్య పరీక్షలు, టెలీమెడిసిన్ సేవలు


స్వాహాస్ వాహనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆరోగ్య పరీక్షా కేంద్రం మన ముందుకే రానుంది. పరీక్షలు చేసిన అనంతరం అక్కడి నుంచే వైద్యుని ద్వారా చికిత్స పొందవచ్చు. ఇందుకోసం సంచార వైద్య పరీక్షా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో స్వయం హెల్త్ అనే సంస్థ దేశీయంగా పోర్టబుల్ డయాగ్నస్టిక్, టెలీమెడిసిన్ విధానాన్ని రూపొందించింది. 'స్వాహాస్' పేరుతో దేశంలోనే మొట్టమొదటి అధునాతన ఎనీటైం హెల్త్ మానిటరింగ్ (ఏహెచ్ఎం) కియోస్క్‌ను సిద్ధం చేసింది. మొబైల్ స్మార్ట్ ల్యాబ్, టెలీమెడిసిన్ సదుపాయాలతో ఉన్న ఈ వాహనాన్ని మెడ్‌టెక్ జోన్‌లో జేఎన్‌యూ వీసీ, నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంచార వైద్య పరీక్షా కేంద్రంలో అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేసే వెసులుబాటు కల్పించారు. ఈ పరీక్షల నివేదికల ఆధారంగా దేశంలోనే నిపుణులైన వైద్యుల ద్వారా టెలీమెడిసిన్ సేవలు పొందే అవకాశం కల్పించారు. త్వరలోనే ఈ వాహనాలను మరిన్ని తయారు చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు స్వయం సంస్థ ఏర్పాట్లుచేస్తోంది.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అర్బన్ హెల్త్ సెంటర్లు

- పురపాలక శాఖ ప్రత్యేక సీఎస్ వై.శ్రీలక్ష్మి


అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శ్రీలక్ష్మి తదితరులు

మంగళగిరి: కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా గుంటూరు జిల్లా మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించినట్లు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మి చెప్పారు. నగర పాలక సంస్థ పరిధిలోని లక్ష్మీ నృసింహస్వామి కాలనీలో రూ.1.30 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నగర కమిషనర్ శారదాదేవిలతో కలిసి ఆమె ప్రారంభించారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి మొక్కలు నాటారు. శ్రీలక్ష్మీ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికి 522 అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలను పూర్తి చేశామని, మరో 189 సెంటర్లకు మరమ్మతులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఏపీలో 2.62 లక్షల ఇళ్లకు మౌలిక వసతుల పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏడాదిన్నర కాలంలో అన్ని మౌలిక వసతులతో 1.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు. టిడ్కో ఇళ్లను అందజేయడం లేదని వస్తోన్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

అమరజీవిని స్మరిస్తూ సాయిచంద్ పాదయాత్ర



నెల్లూరు (బృందావనం)/కొరుక్కుపేట (చెన్నై): తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాన్ని స్మరిస్తూ ప్రముఖ నటుడు సాయిచంద్ స్ఫూర్తిదాయకమైన ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. యువతరం, వర్తమాన సమాజానికి పొట్టిశ్రీరాములు త్యాగస్ఫూర్తి, సంకల్ప బలం, కార్యదీక్ష గుర్తు చేయాలన్న దృఢసంకల్పంతో పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. పొట్టిశ్రీరాములు నాడు మద్రాస్‌లో మైలాపూర్‌లోని బులుసు సాంబమూర్తి గృహంలో 1952 డిసెంబర్ 15న రాత్రి తెలుగువారికి రాజధానితో కూడిన ప్రత్యేక రాష్ట్రం కావాలని దీక్షలో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన ఆత్మ బలిదానం చేసిన ''త్యాగస్థలి'' శ్రీపొట్టిశ్రీరాములు స్మారక భవనం నుంచి సాయిచంద్ ఈ నెల 15న పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ యాత్రను జాతీయ రహదారి గుండా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సాగిస్తూ అమరజీవి పూర్వీకుల స్వస్థలం ప్రకాశం జిల్లాలోని పడమటి పల్లెకు చేరనున్నారు. ఇందుకుగాను మైలాపూర్‌లోని అమరజీవి విగ్రహం వద్ద సాయిచంద్ బుధవారం దీక్ష చేపట్టారు.

ద్వారం మంగతాయారు కన్నుమూత



చెన్నై: ఎనిమిది దశాబ్దాల పాటు లక్షలాది మంది మనసులను రంజింపజేసిన ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసురాలు ద్వారం మంగతాయారు (92) బుధవారం చెన్నైలో కన్నుమూశారు. వయోభారం, అనారోగ్య కారణాలతో చెన్నైలోని బంధువుల ఇంట్లో తుదిశ్వాస విడిచారు. పద్మశ్రీ దివంగత ద్వారం వెంకటస్వామినాయుడు కుమార్తె అయిన మంగతాయారు తండ్రితోపాటు ఆర్.మహాలింగం, ఎంఎస్ సుబ్బులక్ష్మి వంటి ఇతర దిగ్గజాలతో ఆమె ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ద్వారం మంగతాయారు మద్రాసు మ్యూజిక్ అకాడమీలో మ్యూజిక్ కోర్సులకు ఫ్యాకల్టీగా కూడా పనిచేశారు. యూఎస్ఏ, ఐరోపా దేశాల్లోనూ కచేరీల చేసిన ఆమె యావత్ ప్రపంచ సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు. ఆమెకు అనేక ప్రతిష్టాత్మక అవార్డులు, సత్కారాలు లభించాయి. రాజా లక్ష్మి ఫౌండేషన్ అవార్డు, తమిళనాడు ప్రభుత్వం నుంచి కలైమామణి, శ్రీ శివానందమూర్తి ఫౌండేషన్ నుంచి ఆంధ్రా మ్యూజిక్ అకాడమీ అవార్డులు అందుకున్నారు. ద్వారం మంగతాయారు భౌతికకాయానికి గురువారం చెన్నైలో గురువారం అంత్యక్రియలు జరుగనున్నాయి.

బెంగళూరులో నకిలీ కరెన్సీ!

- పెద్దమొత్తంలో భారత్, అమెరికా నకిలీ కరెన్సీ నోట్లు సీజ్
- పరారీలో ఇద్దరు నిందితులు

బనశంకరి: బెంగళూరులో అమెరికా డాలర్లు, భారత్ కరెన్సీ నకిలీ నోట్లు ముద్రిస్తున్న ఇంటిపై బెంగళూరు సీసీబీ పోలీసులు బుధవారం దాడి చేశారు. పెద్దమొత్తంలో నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. నగర జాయింట్ పోలీస్ కమిషనర్ ఎస్.డి.శరణప్ప తెలిపిన వివరాల ప్రకారం... హెణ్ణూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో భారత్, అమెరికా నకిలీ కరెన్సీ ముద్రించి మార్కెట్లోకి పంపడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు ఆ ఇంటిపై దాడి చేశారు. అయితే అప్పటికే ఇద్దరు నిందితులు అక్కడి నుంచి జారుకున్నారు. ఇంట్లో గాలించగా భారత్‌కు చెందిన రూ.500 నోట్లు 10,033, అమెరికాకు చెందిన వంద డాలర్ల నోట్లు 708 లభించాయి. అలాగే మరికొంత మొత్తంలో వెయ్యి రూపాయల పాత నోట్లు, ముద్రణకు వాడే రసాయనాల సీసాలు, నాలుగు కలర్ ప్రింటర్లు, ఇంక్‌జెట్ ఎలక్ట్రానిక్ డైయింగ్ మెషీన్ తదితరాలు అక్కడ దొరికాయి. ఇప్పటివరకు ఎంత మొత్తంలో నోట్లను మార్కెట్లోకి వదిలారన్నది తేలాల్సి ఉంది.

బెయిల్‌పై ఎమ్మెల్సీ అనంతబాబు విడుదల

రాజమహేంద్రవరం సిటీ: ఎమ్మెల్సీ ఆనంతబాబుకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి బుధవారం సాయంత్రం విడుదలయ్యారు. హైకోర్టు, ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానాల్లో బెయిల్ మంజూరు కాకపోవడంతో అనంతబాబు కుటుంబ సభ్యులు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్‌ను ఈనెల 12న మంజూరు చేసింది. క్షేత్రస్థాయి కోర్టు నిబంధనలు పాటించాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ న్యాయస్థానం న్యాయమూర్తి సెలవులో ఉండటంతో బెయిల్ ఉత్తర్వులు అమలు బాధ్యత ఫ్యామిలీ కోర్టుకు వెళ్లింది. వివరాలను పరిశీలించిన ఫ్యామిలీ కోర్టు రూ.50,000లతో పాటు ఇద్దరు పూచీకత్తులు సమర్పించాలని కోరింది. బెయిల్‌పై ఉన్న సమయంలో సాక్షులతో మాట్లాడటం, బెదిరించడం చేయరాదని స్పష్టం చేసింది. పాస్ పోర్టును కోర్టులో సరెండర్ చేయాలని, విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది. బెయిల్ మంజూరు కావడంతో అనంతబాబు స్వగ్రామానికి బయలుదేరి వెళ్లారు.

సైన్స్‌పై ప్రాణాంతక మహమ్మారుల ప్రభావం

- ఇన్సా 88వ వార్షికోత్సవ సమావేశంలో శాస్త్రవేత్తలు
- విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహణ



ఇన్సా సదస్సులో ప్రసంగిస్తున్న అధ్యక్షురాలు చంద్రిమా షాహా

సాక్షి, విశాఖపట్నం: ప్రాణాంతక మహమ్మారులు సైన్స్‌ను ప్రభావితం చేస్తున్నాయని పలువురు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఇవి సమాజంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. మూడు రోజులు జరిగే ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఇన్సా) 88వ వార్షికోత్సవ సాధారణ సమావేశం బుధవారం విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రారంభమైంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు, జాతీయ సముద్ర అధ్యయన సంస్థ (ఎన్ఐవో) నిపుణులు హాజరయ్యారు. అధ్యక్షోపన్యాసం చేసిన ఇన్సా అధ్యక్షురాలు చంద్రిమా షాహా మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సమష్టి ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవాలని, సైన్స్ సమస్యలపై శాస్త్రీయ అభిప్రాయాలు చర్చించాలని కోరారు. సైన్స్ ప్రయోజనాల కోసం యువ, సీనియర్ శాస్త్రవేత్తలు దృష్టి సారించాలన్నారు. రష్యన్ ఫ్లూ, స్పెయిన్ ఫ్లూ, హెచ్1ఎన్1, కోవిడ్–19 వంటివి అంటువ్యాధులేనన్నారు. ఇన్సా ఉపాధ్యక్షుడు, ఐఐటీ ముంబై మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.వి.ఖాఖర్ మాట్లాడుతూ కోవిడ్ నియంత్రణపై సంతోషం వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు రితబ్రత మున్షి(కోల్‌కతా), ఈపీ ఘటే(ముంబై), ఎస్ఆర్ ఆత్రేయ (బెంగళూరు), దీపక్‌ధార్ (పూణే), గుజరాత్ బయో టెక్నాలజీ వర్సిటీ ప్రొఫెసర్ సుబీర్ మజుందార్, మైసూర్ వర్సిటీ ప్రొఫెసర్ మేవాసింగ్, అలీగఢ్ ముస్లిం వర్సిటీ నుంచి ఖుద్సియా తహసీన్, హైదరాబాద్ వర్సిటీ నుంచి ఎ.ఎస్.రాఘవేంద్ర తదితరులు వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎన్ఐవో గోవా డైరెక్టర్ సునీల్ కె.సింగ్, విశాఖపట్నం ఎన్ఐవో చీఫ్ సైంటిస్ట్ జీపీఎస్ మూర్తి, ఇన్సా ప్రతినిధి సీఎం నౌటియాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్త్ వేవ్ వచ్చినా ప్రాణాంతకం కాదు!

- వ్యాక్సిన్ వల్ల కోవిడ్ తీవ్రత అంతగా ఉండబోదు..
- చైనాలో కోవిడ్ విజృంభణపై ఆందోళన వద్దు
- 'సాక్షి'తో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అధ్యక్షురాలు చంద్రిమా షాహా

సాక్షి, విశాఖపట్నం: మున్ముందు కోవిడ్ ఫోర్త్ వేవ్ వచ్చినా అది ప్రాణాంతకం కాబోదని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడెమీ (ఇన్సా) అధ్యక్షురాలు చంద్రిమా షాహా తెలిపారు. ఇప్పటికే దేశంలో 90 శాతం మందికి పైగా వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల కోవిడ్ తీవ్రత అంతగా ఉండబోదని చెప్పారు. వ్యాక్సినేషన్ ద్వారా హెర్డ్ ఇమ్యూనిటీ (వ్యాధి నిరోధక శక్తి) వస్తుందని, దీంతో ఈ వైరస్ వ్యాప్తి నియంత్రణకు దోహదపడుతోందని వివరించారు. విశాఖలో జరుగుతున్న ఇన్సా సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. చైనాలో కొన్నాళ్ల నుంచి కోవిడ్ మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నప్పటికీ అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చైనాలో కోవిడ్ ఉధృతి ఉన్నా అక్కడ మరణాలు లేకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకున్న తర్వాత తలెత్తుతున్న దుష్పరిణామాలపై పూర్తి స్థాయిలో ఫలితాలు రావలసి ఉందన్నారు.

17 నుంచి తిరుమలలో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై



తిరుమల: తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ధనుర్మాసం ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6.12 నిమిషాలకు ప్రారంభం కానున్న నేపథ్యంలో 17వ తేదీ నుంచి స్వామి వారికి సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. ధనుర్మాస ఘడియలు 2023, జనవరి 14న ముగియనున్నాయి. ధనుర్మాస ఘడియల్లో పెద్ద జీయరు స్వామి మఠంలో తిరుప్పావై పారాయణం చేయనున్నారు. ఎస్వీబీసీ ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లలో ఒకటి నిండింది. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,214 మంది స్వామిని దర్శించుకోగా, 23,147 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి హుండీ కానుకల రూపంలో రూ.5.50 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 18 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న రజనీకాంత్

తిరుమల శ్రీవారిని సూపర్‌స్టార్ రజనీకాంత్ గురువారం సుప్రభాత సేవలో దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా బుధవారం తిరుమల టీఎస్ఆర్ అతిథి గృహం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు.

మూడు రాజధానులతోనే సమగ్రాభివృద్ధి

- 808వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి, అందరికీ సామాజిక న్యాయం మూడు రాజధానులతోనే సాధ్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 808వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరి నుంచి వచ్చిన ఆదాయాన్ని ఓ ప్రాంతానికో, ఓ వర్గానికో మాత్రమే లబ్ధి జరిగేలా కేటాయింపులు చేయాలని, అక్కడ తమవారు కొనుగోలు చేసిన బినామీ భూములకు పదింతలు ఆదాయం కావాలని బాబు అండ్ కో గగ్గోలు పెడుతుండటం సిగ్గుచేటన్నారు. అమరావతి పేరుతో బాబు ఆర్థిక దోపిడీకి పాల్పడేందుకు వేసిన ఎత్తుగడలతో ఇప్పటికే లక్షల కోట్లు వెనకేసుకుని రాష్ట్ర ప్రజల నెత్తిన టోపీ పెట్టాడని, బాబును మళ్లీ నమ్మితే చేతిలో చిప్పపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడని విమర్శించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా రైతులకు న్యాయం చేస్తున్నాడన్నారు. నాయకులు పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

- దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంసీఏ) స్థాపించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్(ఐఐసీఏ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వర్సిటీలో ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ సూర్య ప్రకాష్, ఐఐసీఏ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పైలా నారాయణ రావు ఒప్పందపత్రాలపై బుధవారం సంతకాలు చేశారు.


శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరిగొండలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి


అనకాపల్లి జిల్లా కొరువాడలో పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మన ప్రభుత్వం


గుంటూరు జిల్లా తెనాలిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్


పశ్చిమగోదావరి జిల్లా యనమదుర్రులో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

క్లుప్తంగా...

విద్యా పథకాలతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన

- పాఠశాల విద్య కమిషనర్, సమగ్ర శిక్షా ఎస్పీడీ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అమలు చేస్తున్న అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, నాడు–నేడు, గోరుముద్ద.. తదితర పథకాల ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించగలుగుతామని పాఠశాల విద్యా శాఖ కమిషనర్, సమగ్ర శిక్షా ఎస్పీడీ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. విజయవాడలో బుధవారం పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు'పై వర్కుషాప్ జరిగింది. ఎస్‌డీజీలోని కీలకమైన గుణాత్మక విద్య లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలలను సందర్శించి వాస్తవ పరిస్థితులను నివేదికల్లో సమర్పించాలని అన్ని జిల్లాల అధికారులకు సూచించారు. సమావేశంలో ఉన్నతాధికారులు సీతాపతి, బి.శ్రీనివాసరావు, కాటమనేని భాస్కర్, డాక్టర్ నిధి మీనా, డి.దేవానందరెడ్డి, పి.పార్వతి, బి.ప్రతాప్‌రెడ్డి, వీఎస్ మస్తానయ్య, ఎంఆర్ ప్రసన్న కుమార్, డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, మువ్వా రామలింగం తదితరులు పాల్గొన్నారు.

హజ్ కమిటీ చైర్మన్‌కు కేబినెట్ హోదా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ ఆజామ్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదాను కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రేవు ముత్యాలరాజు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఫోర్జరీ కేసులో అయ్యన్నకు సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఫోర్జరీ కేసులో టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఏపీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ బుధవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌తో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. అయ్యన్నపాత్రుడుకి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం తదుపరి విచారణ ఫిబ్రవరి 3కు వాయిదా వేసింది.

తిరుపతి, విశాఖ జూపార్క్‌ల అభివృద్ధి

- బయోట్రిమ్ ద్వారా రైతులకు మేలుజాతి మొక్కలు: పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జూపార్క్‌లను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని అటవీ శాఖ అధికారులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. సచివాలయంలో బుధవారం అటవీ శాఖపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సందర్శకులను మరింతగా ఆకర్షించేలా తిరుపతి, విశాఖ జూపార్క్‌లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. తిరుపతి, రాజమహేంద్రవరంలోని రీసెర్చ్ సెంటర్ల ద్వారా అధిక ఫలసాయం, కలపను అందించే మేలుజాతి మొక్కలను అభివృద్ధి చేయాలన్నారు. తిరుపతిలోని బయోట్రిమ్ ద్వారా ఎర్రచందనంపై పరిశోధనలు చేసి మేలుజాతి మొక్కలను అందుబాటు ధరల్లో రైతులకు అందించాలన్నారు. ఈ సమీక్షలో ఉన్నతాధికారులు నీరబ్ కుమార్ ప్రసాద్, వై.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ బీఎంకే రెడ్డి, చలపతిరావు, శాంతిప్రియా పాండే, గోపీనాథ్, ఆర్పీ ఖజూరియా, ఏకే నాయక్, పీఏవీ ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

మైనింగ్ ఆపరేషన్స్ ప్రారంభించనివారికి నోటీసులు..

మైనింగ్ లీజుల కోసం తీసుకువచ్చిన ఈ–వేలంపై అందరికీ అవగాహన కల్పించాలని అధికారులను గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం సచివాలయంలో గనుల శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం గుర్తించిన అన్ని మైనింగ్ ఏరియాల్లో కచ్చితంగా ఆపరేషన్స్ ప్రారంభం కావాలన్నారు. ఇప్పటికే అనుమతులు పొంది మైనింగ్ ఆపరేషన్స్ ప్రారంభించని ప్రాంతాల లీజుదారులకు నోటీసులిచ్చి అనుమతులు రద్దు చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు వెంకటరెడ్డి, డి.రమాదేవి, రాజబాబు పాల్గొన్నారు.

పెద్ద ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: రూ.25 లక్షలకు పైబడి వార్షికాదాయం కలిగిన 175 పెద్ద ఆలయాల్లో జనవరి నెలాఖరుకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. దేవదాయ శాఖలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై బుధవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే 16 ప్రధాన ఆలయాల్లో పూర్తి స్థాయి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, అదనపు కమిషనర్ చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ.. పోటాపోటీ

మూడున్నరేళ్లలో ఏకంగా 194 కంపెనీల రాక

- అదనంగా 23,000 మందికి ఉపాధి కల్పన
- గత ఆర్నెల్లలోనే 12కిపైగా కొత్త కంపెనీల ఏర్పాటు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో 30కిపైగా కంపెనీల భారీ విస్తరణ
- విజయవాడ మేథా టవర్స్‌లో టెక్ మహీంద్రా కార్యాలయం
- త్వరలో విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- డేటా సెంటర్‌పై మరికొన్ని సంస్థలతో తుది దశలో చర్చలు


విశాఖలో డబ్ల్యూఎన్ఎస్ రెండో కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఉద్యోగులతో ఆ సంస్థ సీఈవో కేశవ్ ఆర్ మురుగేష్ సెల్ఫీ

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యాభ్యాసం అనంతరం మన విద్యార్థులు ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాల వైపు చూడకుండా స్థానికంగానే ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం వేగంగా సాకారమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు ఐటీ సంస్థలు విశాఖతో పాటు పలు ద్వితీయ శ్రేణి పట్టణాల్లో తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయి. రాష్ట్రంలో 2019కి ముందు ఐటీ కంపెనీల సంఖ్య 178 కాగా, ఇప్పుడవి 372కి చేరుకున్నాయి. మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏకంగా 194 ఐటీ కంపెనీలు ఏర్పాటు కావడం గమనార్హం.

శరవేగంగా కార్యకలాపాలు..

రెండేళ్లుగా కోవిడ్‌తో గట్టి సంక్షోభాన్ని ఎదుర్కొన్న ఐటీ కంపెనీలు... ఇప్పుడు రాష్ట్రంలో కార్యకలాపాలను వేగంగా ప్రారంభిస్తున్నాయి. గత ఆర్నెల్ల వ్యవధిలో ఇన్ఫోసిస్, రాండ్ శాడ్, టెక్నోటాస్క్, ఐజెన్ అమెరికా సాఫ్ట్‌వేర్, టెక్‌బుల్, కాంప్లెక్స్ సిస్టమ్స్ లాంటి డజనుకుపైగా కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటైనట్లు ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీ (అపిటా) గ్రూప్ సీఈవో ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. కొత్తగా ఏర్పాటైన కంపెనీలు, విస్తరణ ద్వారా అదనంగా 20,000కిపైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు వివరించారు. మరికొన్ని కీలక ఐటీ కంపెనీలతో చర్చలు తుది దశలో ఉన్నట్లు వెల్లడించారు.

విశాఖ, విజయవాడలో జోరుగా..

రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుండటంతో పలు ఐటీ కంపెనీలు భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటిస్తున్నాయి. ఇప్పటివరకు విశాఖకే పరిమితమైన టెక్ మహీంద్రా తాజాగా విజయవాడలో కార్యకలాపాలను ప్రారంభించింది. గన్నవరం మేథా టవర్స్‌లో 120 సీటింగ్ సామర్థ్యంతో కార్యాలయాన్ని టెక్ మహీంద్రా ప్రారంభించింది. హెచ్‌సీఎల్ విజయవాడ నుంచి విశాఖకు విస్తరించగా, విశాఖలో ఉన్న డబ్ల్యూఎన్ఎస్, పల్సస్ ఐడీఏ లాంటి 30కిపైగా ఐటీ, ఐటీ ఆధారిత సేవల కంపెనీలు విస్తరణ కార్యక్రమాలను చేపట్టాయి. 2012లో కేవలం 50 మందితో ప్రారంభమైన డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు 3,300 దాటింది. ఇందులో 2,000 మంది ఉద్యోగులు గత రెండేళ్లలోనే చేరినట్లు డబ్ల్యూఎన్ఎస్ సీఈవో కేశవ్ ఆర్ మురుగేష్ వెల్లడించారు. 2019లో 40 మందితో ప్రారంభించిన తమ సంస్థ ఉద్యోగుల సంఖ్య 4,200 దాటినట్లు పల్సస్ సీఈవో సీఈవో గేదెల శ్రీనుబాబు తెలిపారు. కొత్తగా ఏర్పాటైన కంపెనీలు, విస్తరణ ద్వారా గత మూడున్నరేళ్లలో రాష్ట్రంలో 23,000 మందికి ఐటీ రంగంలో ఉపాధి లభించింది. 2019లో నాటికి రాష్ట్రంలో 35,000 మంది ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం 58,000కి చేరినట్లు కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ఐటీ కంపెనీలు

కంపెనీ పేరు	ఎన్ని ఉద్యోగాలు
ఇన్ఫోసిస్	3,300
రాండ్‌శాడ్	6,000
టెక్నోటాస్క్	2,000
ఐజెన్ అమెరికాన్ సాఫ్ట్‌వేర్	1,000
కాంప్లెక్స్ సిస్టమ్స్	1,020
టెక్‌బుల్	4,100
సాగర్ సాఫ్ట్‌వేర్	600
మాగంటి సాఫ్ట్‌వేర్	523
ఇన్‌డిజెడ్ టెక్నాలజీస్	300
నెట్ డిజైర్ టెక్నాలజీస్	300



గన్నవరంలోని మేథా టవర్స్‌లో టెక్ మహీంద్రా కార్యాలయం

ఐటీ కాన్సెప్ట్ సిటీలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐటీ కాన్సెప్ట్ సిటీల నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. అదానీ గ్రూపునకు చెందిన వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ రూ.14,634 కోట్లతో నెలకొల్పే డేటా సెంటర్‌కు అన్ని కీలక అనుమతులు మంజూరు కావడంతో త్వరలోనే పనులను మొదలు కానున్నాయి. మరో రెండు కీలక సంస్థలు కూడా డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయి. దేశంలో ప్రముఖ ఐటీ కంపెనీలు విజయవాడ, విశాఖల్లో కార్యకలాపాలను ప్రారంభించడానికి ముందుకు వచ్చాయి. పలు ఐటీ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేయడంతో రోహేజా లాంటి సంస్థలు ఐటీ పార్కుల నిర్మాణానికి ముందుకొస్తున్నాయి. రోహేజా గ్రూపు విశాఖలో 17 ఎకరాల్లో ఇన్ ఆర్బిట్‌మాల్‌తో పాటు ఐటీపార్కు ఏర్పాటు చేయనుంది.

ఆలయాల జమా ఖర్చులపై ఆడిట్‌కు ప్రత్యేక డ్రైవ్

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో జమా ఖర్చుల ఆడిట్ నిర్వహణకు ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌ను దేవదాయ శాఖ నిర్వహించనుంది. ఏళ్ల తరబడి ఆలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకోవాలని అన్ని ఆలయాల ఈవోలను ఆదేశిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. రూ.కోటికి పైగా వార్షిక ఆదాయం ఉండే ఆలయాలకు అధికారులు వచ్చి ఆడిట్‌ను పూర్తి చేస్తారు. రూ.2 లక్షల పైబడి వార్షికాదాయం ఉండే ఆలయాల ఆడిట్ ప్రక్రియను ప్రాంతాల వారీగా పది రోజులపాటు అధికారులు క్యాంప్‌లు ఏర్పాటు చేసి ఆడిట్ నిర్వహిస్తారు. ఏపీలోని అన్ని ఆలయాల ఈవోలు, సిబ్బంది ఈ ఆడిట్‌ను ప్రాధాన్యతగా తీసుకుని, ఈవోలు ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అధ్యయనానికి కమిటీ

- మంత్రి విశ్వరూప్

సాక్షి,అమరావతి: రోడ్డు ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పి.విశ్వరూప్ సూచించారు. ఇందుకోసం తమిళనాడు, పంజాబ్, రాజస్తాన్, జార్ఖండ్ రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు చేస్తోన్న విధానాలను అధ్యయనం చేసేందుకు ఉన్నతాధికారులతో ఓ కమిటీని నియమించాలని ఆదేశించారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర రహదారి భద్రత మండలి సమావేశంలో మంత్రి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులను రక్షించేందుకు ముందుకువచ్చే వారిని ప్రోత్సహించేందుకు 'గుడ్ సమరిటన్' విధానం కోసం విధివిధానాలను రూపొందించాలన్నారు. జాతీయ రహదారులపై, టోల్ గేట్లు, వే బ్రిడ్జిలు, అంబులెన్స్‌లు, ప్రయాణికులకు ఇతర వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దర్శి, డోన్, విశాఖల్లో ఐడీటీఆర్ ప్రాజెక్టులు, ఆటోమేషన్ విధానంలో డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ కోసం ఉద్దేశించిన 9 డ్రైవింగ్ ట్రాక్‌ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

విజయవాడలో ఉద్యోగాల వల

వెలుగుచూసిన డైల్ ఇన్‌స్టిట్యూషన్ ఘరానా మోసం

- రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు
- పోలీసులకు ఫిర్యాదుచేసిన 30 మంది బాధితులు
- పోలీసుల అదుపులో సంస్థ యజమాని సిద్ధార్థ్‌వర్మ



డైల్ ఇన్‌స్టిట్యూట్ కార్యాలయం


పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన బాధితులు


సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలో మరో ఘరానా మోసం వెలుగు చూసింది. ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి లక్షలు వసూలుచేసిన వైనం బయటకొచ్చింది. 30 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోసగించిన సంస్థ యజమాని దండుబోయిన సిద్ధార్థ్‌వర్మను, సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు, పోలీసుల సమాచారం మేరకు.. సిద్ధార్థ్‌వర్మ విజయవాడ బందరు రోడ్డులో డైల్ ఇన్‌స్టిట్యూషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దేశంలోను, విదేశాల్లోను ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులకు వల వేశారు. అమెరికా, ఇంగ్లండ్, దుబాయ్, మలేషియా దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, దేశంలో బీఎస్ఎన్ఎల్, జాతీయ రహదారులు, ఎలక్షన్ కమిషన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి కేంద్రప్రభుత్వ సంస్థల్లోను, పేరొందిన ప్రైవేటు కంపెనీల్లోను ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికారు. కార్యాలయంలో యువతులను నియమించి వారి మాటలతో బురిడీ కొట్టించి ఒక్కో నిరుద్యోగి వద్ద రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశారు. రసీదులు కూడా ఇచ్చారు. నెలలు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు నిలదీశారు. దీంతో వారికి డబ్బు వాపసు చేస్తూ చెక్కులిచ్చారు. ఆ చెక్కులు చెల్లకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో మోసపోయినవారు ఒక్కొక్కరుగా విజయవాడ చేరుకుంటున్నారు. ఇప్పటికే కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, కర్నూలు, గుంటూరు, వైఎస్సార్, ప్రకాశంజిల్లాల నుంచి వచ్చిన 30 మంది బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయవాడ సూర్యారావుపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నిర్వాహకుడు సిద్ధార్థ్‌వర్మను, కార్యాలయంలో పని చేసే పలువురు మహిళా ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రెండేళ్లుగా దందా

కాల్ సెంటర్ ట్రెనింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులను నేర్పుతామని రెండేళ్ల కిందట ఈ ఇన్‌స్టిట్యూషన్‌ను సిద్ధార్థ్‌వర్మ ఏర్పాటు చేశారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌కు వైష్ణవి అనే మహిళ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరు ఎక్కువగా సంస్థ కార్యాలయంలో కనిపించేవారు కాదని, అక్కడి ఉద్యోగినులే వివరాలు చెప్పి డబ్బు వసూలు చేసేవారని బాధితులు తెలిపారు. ఆంధ్ర, తెలంగాణల్లో దాదాపు వెయ్యిమంది నిరుద్యోగులు వీరి మాటలు నమ్మి మోసపోయారని పేర్కొన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ప్రకటనలు గుప్పించి తమను ఆకర్షించారని పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన బాధితుడు మణికంఠ వాపోయారు. సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో డబ్బు చెల్లించి నెలల తరబడి ఇన్‌స్టిట్యూట్ చుట్టూ తిరిగానని చెప్పారు. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద డబ్బు వసూలు చేశారని విజయవాడకు చెందిన ప్రవీణ్ తెలిపారు. ఉద్యోగం రాలేదని డబ్బులు అడిగితే కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులచే ఎదురుదాడి చేయిస్తున్నారని, కేసులు పెడతామని బెదిరిస్తున్నారని చెప్పారు.

బాధితులకు న్యాయం చేస్తాం..

ఉద్యోగాల పేరుతో మోసపోయామని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డైల్ ఇన్‌స్టిట్యూషన్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి సంస్థ యజమానిని, సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటాం. ఉద్యోగాల పేరుతో మోసం చేసే సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇటువంటి సంస్థల యజమానుల మాయమాటలు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు.



– టి.కె.రాణా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్

పెట్టుబడులపై పెడబొబ్బలా?

- చంద్రబాబు, ఎల్లో మీడియాపై సజ్జల మండిపాటు
- నిబంధనల మేరకే అదానీ, గ్రీన్‌కో, అరబిందో, షిరిడీసాయికి పంప్డ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులు
- చంద్రబాబు, రామోజీ దరఖాస్తు చేసుకున్నా అర్హత ఉంటే కేటాయిస్తాం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి వరదలా వస్తున్న పెట్టుబడులను చూసి ఓర్వలేక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, దుష్ట చతుష్టయంలో భాగమైన ఎల్లో మీడియా కూడబలుక్కుని రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారానికి తెగబడ్డాయని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. సన్నిహితులకే పంప్డ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఇచ్చారంటూ తప్పుడు కథనాలను ప్రచురించటాన్ని ఖండించారు. పెట్టుబడులు వస్తుంటే ఎందుకంత కడుపుమంట? అని నిలదీశారు. రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు రాకూడదనే కుట్రతో దుష్ట చతుష్టయం విషం చిమ్ముతోందని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.


రైతులు, ప్రభుత్వానికి మంచి ఆదాయం..

టీడీపీ హయాంలో గ్రీన్‌కో సంస్థకు పంప్డ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఎకరం రూ.2.50 లక్షలకే భూములు కట్టబెడితే గొప్ప ఆవిష్కరణగా ఎల్లో మీడియా చిత్రీకరించిందని సజ్జల ధ్వజమెత్తారు. జగన్ అధికారంలోకి వచ్చాక గ్రీన్‌కోకు ఎకరం భూమి రూ.5లక్షల చొప్పున, గ్రీన్ డెవలప్‌మెంట్ చార్జీలు, తొలి 25 ఏళ్లు మెగావాట్‌కు రూ.లక్ష, ఆ తర్వాత 25 ఏళ్లు మెగావాట్‌కు రూ.రెండు లక్షల చొప్పున రాయల్టీ, ఎకరానికి ఏటా రూ.31 వేల చొప్పున లీజు (నెడ్ క్యాప్‌కు రూ.వెయ్యి, భూమికి రూ.30వేలు) రైతులకు ఇచ్చేలా మార్పులు చేశారని తెలిపారు. దీనివల్ల రైతులకు, ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో రివర్స్ పంప్డ్ హైడ్రో ప్రాజెక్టుల ఏర్పాటుకు అనువైన పరిస్థితుల గురించి దావోస్ సదస్సులో సీఎం జగన్ వివరించి ప్రపంచ స్థాయి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారని సజ్జల పేర్కొన్నారు. నెడ్‌క్యాప్ ద్వారా దరఖాస్తులను పరిశీలించి అర్హత, అనుభవం ఆధారంగా అదానీ, గ్రీన్‌కో, అరబిందో, షిర్డిసాయి సంస్థలకు ప్రభుత్వం ప్రాజెక్టులను అప్పగించిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు టెండర్లు నిర్వహించరనే ఇంగితజ్ఞానం లేకుండా 'ఈనాడు' రామోజీరావు కథనాలు ప్రచురిస్తే వాటి ఆధారంగా చంద్రబాబు బురద చల్లడం ఏమిటని నిలదీశారు. ఇప్పటికే 14 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులను కేటాయించామని, వీటి ద్వారా గ్రీన్ డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో రూ.8వేల కోట్లు, జీఎస్టీ రూపంలో రూ.4వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభిస్తుందన్నారు. 58 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులను నిర్వహించేందుకు 7 వేల మెగావాట్ల సామర్థ్యంతో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులను నెలకొల్పడం ద్వారా ప్రభుత్వానికి రూ.4 వేల కోట్ల ఆదాయంతోపాటు ఏడువేల మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. పంప్డ్ పవర్ ప్రాజెక్టులలో ఇంకా 30 వేల మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తికి అనువైన ప్రదేశాలున్నాయని సజ్జల వెల్లడించారు. అక్రమార్జనతో రూ.వేల కోట్లకు పడగలెత్తిన హెరిటేజ్ ద్వారా చంద్రబాబు, 'ఈనాడు' ద్వారా రామోజీరావు పంప్డ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అర్హతను బట్టి కేటాయిస్తామని వ్యాఖ్యానించారు. సీఎం జగన్ రాయలసీమ ప్రజల కలను సాకారం చేసి వైఎస్సార్ జిల్లాలో రూ.8,880 కోట్లతో స్టీల్‌ప్లాంట్‌ను నిర్మిస్తుంటే చంద్రబాబు బరితెగించి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.



భోగాపురం విమానాశ్రయానికి త్వరలో శంకుస్థాపన

- టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- విశాఖలో పార్టీ నూతన కార్యాలయానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రులు విడదల రజిని, అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, అదాని డేటా సెంటర్‌కు త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, విడదల రజిని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబుతో కలిసి ఆయన బుధవారం ఎండాడ లా కాలేజీ రోడ్డు పనోరమ హిల్స్ వద్ద వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యాలయాల్లో త్వరలో కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి కార్యకర్తలకు అవసరమైన సేవలు అందిస్తామన్నారు. న్యాయ పరమైన చిక్కులు తొలిగాక విశాఖ పరిపాలన రాజధాని కానుందని చెప్పారు. ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ మంత్రులు పి.బాలరాజు, దాడి వీరభద్రరావు, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు పాల్గొన్నారు.

కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులా?

- కమిటీ కూర్పును పునఃపరిశీలించండి
- కేంద్ర పర్యావరణ, అటవీశాఖకు హైకోర్టు ఆదేశం
- విచారణ ఈ నెల 21కి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖపట్నం, రిషికొండ రిసార్ట్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా చేపట్టిన తవ్వకాల విషయంలో సర్వే నిర్వహించేందుకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖ (ఎంవోఈఎఫ్) ఏర్పాటు చేసిన కమిటీలో ముగ్గురు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు స్థానం కల్పించడాన్ని హైకోర్టు ప్రాథమికంగా తప్పుపట్టింది. ఒకపక్క రిషికొండను విచక్షణారహితంగా తవ్వేశారంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కొంటుంటే, మరోపక్క అదే ప్రభుత్వానికి చెందిన అధికారులకు కమిటీలో స్థానం కల్పించడం ఏమిటని ప్రశ్నించింది. కమిటీలో వారికి స్థానం కల్పించే విషయాన్ని పునఃపరిశీలించాలని ఎంవోఈఎఫ్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే)జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం జిల్లా యందాడ గ్రామంలోని సర్వే నంబర్ 19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇవ్వడంపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ గత ఏడాది హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఇదే అంశంపై విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ కూడా పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారించిన సీజే ధర్మాసనం.. రిషికొండ తవ్వకాలపై సర్వేచేసి నివేదిక ఇచ్చేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖను ఆదేశించింది. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు రావడంతో.. ధర్మాసనం ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె.ఎస్.మూర్తి స్పందిస్తూ.. ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ముగ్గురు అధికారులున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కమిటీ కూర్పుపై పునఃపరిశీలించాలని ఎంవోఈఎఫ్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.



'ఈ వయసులో చదువు ఏమిటి!' అనుకునేవాళ్లు ఒక్కసారి వరత షణ్ముగనాథన్ గురించి చదివితే- 'అవును. నాకు కూడా చదువుకోవాలని ఉంది' అని బలంగా అనుకుంటారు. చదువుకు ఉన్న బలం అదే!

వైరల్

వరతమ్మా నీకు వందనాలమ్మా!

కెనడాలోని 'యార్క్ యూనివర్శిటీ' నుంచి 87 సంవత్సరాల వయసులో మాస్టర్స్ డిగ్రీ చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించి ప్రశంసలు అందుకుంటోంది వరత షణ్ముగనాథన్. విద్యారంగంలో ఆమె స్ఫూర్తిదాయకమైన కృషిని గుర్తించి గౌరవించింది ఆంటేరియో లెజిస్లేచర్ అసెంబ్లీ. షణ్ముగనాథన్ హాలులోకి అడుగు పెడుతున్న సమయంలో సభ్యులు లేచి నిల్చొని జయజయధ్వానాలు చేశారు.

'ఈ తరానికి ఎన్నో రకాలుగా స్ఫూర్తిని ఇచ్చే మహిళ' అంటూ షణ్ముగనాథన్‌ను ప్రశంసలతో ముంచెత్తారు అసెంబ్లీ సభ్యులు.

షణ్ముగనాథన్ కెనడాకు వెళ్లిన సమయంలో సీనియర్స్‌కు 'యార్క్ యూనివర్శిటీ'లో మాస్టర్స్ డిగ్రీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుసుకొని ఎంతో సంతోషించింది. అలా మాస్టర్స్ ప్రోగ్రాంలో భాగం అయింది. కూతురు ఎంతో ప్రోత్సాహకంగా నిలిచింది.

'యూనివర్శిటీ ఆఫ్ మద్రాస్'లో డిగ్రీ చేసిన షణ్ముగనాథన్ 'యూనివర్శిటీ ఆఫ్ లండన్'లో ఫస్ట్ మాస్టర్స్ డిగ్రీ చేసేనాటికి ఆమె వయసు యాభై సంవత్సరాలు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వరత షణ్ముగనాథన్ వీడియోకు అనూహ్యమైన స్పందన వచ్చి వైరల్‌గా మారింది.

షణ్ముగనాథన్‌ను ప్రశంసిస్తూ అన్ని వయసులవారి నుంచి కామెంట్స్ వచ్చాయి. మచ్చుకు కొన్ని....



> చదువు ఎప్పుడూ మనల్ని చురుగ్గా ఉంచుతుంది. జ్ఞాపకశక్తి బలహీనం కాకుండా చూస్తుంది. చదువుకు వయసుతో సంబంధం లేదు.

'కాస్త వయసు పైబడగానే ఈ వయసులో ఏం నేర్చుకుంటాం అనే నిర్లిప్తత చాలామందిలో ఉంటుంది. ఇలాంటి వారిలో మార్పు తీసుకువచ్చే విజయం ఇది'

'నేను ఉద్యోగం నుంచి రిటైరయ్యాను. ఏదైనా చేయాలి...అని ఆలోచించేవాడిని. అంతలోనే ఈ వయసులో ఏం చేస్తాములే అని వెనక్కి వెళ్లేవాడిని. వరతమ్మ వీడియో చూసిన తరువాత నాలో చాలా మార్పు వచ్చింది. ఆమెలాగే నేను కూడా చదువుకోవాలని బలంగా నిర్ణయించుకున్నాను'

సైబర్ టాక్

మీ స్మార్ట్ ఫోన్ కంటే తెలివిగా ఉన్నారా?



ప్రపంచవ్యాప్త సమాచారం కోసం ఫేస్‌బుక్, ట్విటర్, గూగుల్, ఇన్‌స్టాగ్రామ్.. వంటి వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు మన యాక్సెస్ ఇవ్వడం వల్ల హ్యాకర్లు, స్కామర్లకు సులభంగా చిక్కుతున్నాం. మోసాల బారిన పడకుండా, స్మార్ట్‌ఫోన్ కంటే స్మార్ట్‌గా ఉండటం సాధ్యమేనా..?! ఎక్కడైనా స్కామర్లు కోరుకున్న విధంగా మనం వారికి బఫే లంచ్ ఇస్తున్నామా?! అనేది గ్రహించుకోవాలి.

కేవలం కొన్ని క్లిక్‌ల దూరంలో ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారా మన జీవితం చాలా ప్రభావితమవుతుంది. స్మార్ట్‌ఫోన్‌లు ఇప్పుడు ఎంతగా భయపెడుతున్నాయంటే ఇటీవల సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు, పౌర సంఘాలు కూడా స్మార్ట్‌ఫోన్‌లకు అలవాటు పడకుండా ఉండేందుకు వాటికి దూరంగా ఉండాలని సలహా ఇస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ కంటే మిమ్మల్ని తెలివిగా మార్చగల అంశాలు

స్మార్ట్‌ఫోన్లు మీకు అంతరాయం కలిగించడం, మీ దృష్టిని మరల్చడం, మీ గోప్యతపై దాడి చేయడం, మీ నిద్రను పాడు చేయడం, కుటుంబంతో గడిపే సమయాన్ని దూరం చేయడం వంటి వాటికి పాల్పడకుండా చూసుకోవాలి. స్మార్ట్‌ఫోన్ మన జీవితాలను శాసించ కూడదు. అది మనకు సేవ మాత్రమే చేయాలి అని గుర్తుంచుకోండి.

ఇంటర్నెట్ స్మార్ట్‌ఫోన్ వినియోగ గణాంకాలు

భారతదేశంలో 1.40 బిలియన్ల జనాభా ఉంది, అందులో 79% (1.10 బిలియన్) మంది మొబైల్ ఫోన్‌లను, 45 శాతం (624 మిలియన్లు) ఇంటర్నెట్‌ను అందులో 32 శాతం (448 మిలియన్లు) మంది సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. సగటు ఇంటర్నెట్ సెషన్ 6 గంటల పాటు కొనసాగుతుంది. భారతదేశంలోని 1.10 బిలియన్ల ఇంటర్నెట్ వినియోగదారులలో 96.7 శాతం మంది ఆన్‌లైన్ వీడియోలను చూస్తున్నారు. 82శాతం మంది ప్రత్యక్ష ప్రసారాలను చూస్తున్నారు. 52 శాతం మంది ఎఫ్ఎమ్ రేడియో స్టేషన్‌లను వింటున్నారు, 50 శాతం మంది పాడ్‌క్యాస్ట్‌లను వింటున్నారు. 86 శాతం వినియోగం స్మార్ట్‌ఫోన్‌లలోనే జరుగుతుంది.

మెరుగైన నిర్వహణ

- భద్రతను పెంచడానికి, బలహీనతలను తొలగించడానికి మీ స్మార్ట్‌ఫోన్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయండి. మీ సిస్టమ్‌లు ఎంత పాతవి అయితే, హ్యాకర్లు మిమ్మల్ని టార్గెట్ చేయడం అంత సులభం అవుతుంది.
- మీ పరికరాలను ఎల్లప్పుడూ లాక్‌లో ఉంచుకోండి. మీ ఫోన్‌లో మీ వ్యక్తిగత సమాచారం ఉండవచ్చు. ఫోన్‌ను అన్‌లాక్ చేయడానికి వేలిముద్ర స్కానింగ్ లేదా ఫేస్ గుర్తింపు లేదా 4 లేదా 6 అంకెల పాస్‌కోడ్ తప్పక ఉండాలి.
- ఫోన్ పోయినప్పుడు ఫైండ్ మై ఐఫోన్ లేదా అండ్రాయిడ్ అయితే ఫైండ్ మై డివైజ్ ఇంప్లిమెంట్ చేయండి. ఐదు నుండి పది పాస్ కోడ్ ప్రయత్నాల తర్వాత మొత్తం డేటాను తీసేయడానికి మీరు మీ ఫోన్‌ను ప్రోగ్రామ్ చేయవచ్చు.
- షాపింగ్ సెంటర్లు, కేఫ్‌లు, విమానాశ్రయాలు, పార్కులు లేదా జిమ్‌లు వంటి ప్రదేశాలలో ఉచిత పబ్లిక్ వైఫై కనెక్షన్‌ను ఉపయోగించుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. బ్లూ టూత్, వై ఫై ఆప్షన్స్ డిఫాల్ట్‌గా చేయడం, ఉపయోగంలో ఉన్నప్పుడు మాత్రమే వాటిని వాడటం కూడా మంచి ఆలోచన.
- స్మార్ట్‌ఫోన్‌లలో నిర్వహించే అన్ని ఇ మెయిల్‌లు, సోషల్ మీడియా ఖాతాల కోసం రెండు కారకాల ప్రమాణీకరణ (2ఎఫ్ఎ) ఉపయోగించండి.
- కెమెరా, మైక్రోఫోన్, పరిచయాలు, ప్లేస్ యాక్సెస్ వంటి అత్యంత కీలకమైన వాటితో సహా యాప్ అనుమతులను ఉపయోగించండి. మీరు ఏ యాప్‌లకు ఏ అనుమతులు ఇచ్చారో ట్రాక్ చేయండి. అవి అవసరం లేనప్పుడు ఆ యాక్సెస్‌ను లాగ్ ఆఫ్ చేయండి.
- స్పామ్, ఫిషింగ్ ఇ-మెయిల్‌లను పట్టించుకోకండి. ప్రచార ఇ-మెయిల్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయకూడదు. అలాగే, చిన్న లింక్‌లు, అనుమానాస్పద లింక్‌లను ఓపెన్ చేయకూడదు. ఇ-మెయిల్ ద్వారా ప్రాంప్ట్ చేయబడిన అప్‌డేట్‌లను అస్సలు అమలు చేయకూడదు.
- మీ డేటాను ఎల్లప్పుడూ బ్యాకప్ చేయండి. దీనివల్ల ఫోన్‌కి ఏదైనా నష్టం జరిగినప్పుడు మీ ముఖ్యమైన డాక్యుమెంట్స్, ఫొటోలు భద్రంగా ఉంటాయి. ఆండ్రాయిడ్ ఫోన్ కోసం, సెట్టింగ్‌లలో 'నా డేటాను బ్యాకప్ చేయండి', 'ఆటోమేటిక్ పునరుద్ధరణ' స్టార్ట్ అయ్యిందనే విషయాన్ని నిర్ధారించుకోండి.
- ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లు, పీడీఎఫ్‌లు, ఫొటోలు, డౌన్‌లోడ్ చేసే ఇతర ఫైల్‌ల కోసం యాంటీవైరస్ యాప్‌ని ఉపయోగించండి.
- ఐఫోన్‌ల కోసం యాప్ స్టోర్ నుండి, ఆండ్రాయిడ్ ఫోన్‌ల కోసం ప్లే స్టోర్ నుండి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ చేయండి.

ముఖ్యమైన చెకింగ్స్

- మీ స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్లు మీ డేటాను ఎలా యాక్సెస్ చేస్తాయో తెలుసుకోవడానికి.. https://reports.exodus-privacy.eu.org/en/
- ఒరిజినల్ ఫొటో చెక్ చేయడానికి (రివర్స్ ఇమేజ్ చెక్) https://images.google.com
- సంక్షిప్త వెబ్ లింక్‌లను అన్‌షార్ట్ చేయండి www.unshorten.it
- వెబ్‌సైట్ ఫిషింగ్ యాక్టివిటీ చేస్తోందో లేదో తనిఖీ చేయడానికి https://isitphishing.org/
- చందాదారులు తమ రిజిస్టర్డ్ నంబర్లను ధ్రువీకరించడానికి, వారికి తెలియకుండా రిజిస్టర్ చేసిన నంబర్లను తీసివేయడానికి టెలికాంను అనుమతించడం. దీనికి.. https://tafcop.dgtelecom.gov.in
- బల్క్ ఎసెమ్మెస్ పంపిన వారిని గుర్తించడానికి https://smsheader.trai.gov.in/
- వీడియో అసలైనదా లేక డీప్ ఫేక్ అని నిర్ధారించడానికి ప్లాట్‌ఫారమ్.. https://platform.sensity.ai/deepfake-detection

డిజిటల్ బ్రేక్ తీసుకోవడానికి చిట్కాలు

- మీ స్మార్ట్‌ఫోన్ నోటిఫికేషన్లను ఆపేయండి. దీనివల్ల మీకు ఏ సమాచారం ఎంతవరకు అవసరమో తెలిసి వస్తుంది.
- పడకగదిని స్మార్ట్‌ఫోన్ రహిత జోన్‌గా మార్చుకోండి.
- ఎలక్ట్రానిక్ పరికరాలను పడకగది వెలుపల ఛార్జ్ చేయండి.
- స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా మీ కంప్యూటర్ నుండి సోషల్ మీడియాను యాక్సెస్ చేయండి.
- మీ హోమ్ స్క్రీన్‌పై ముఖ్యమైన సాధనాలను మాత్రమే ఉంచండి.
- మీ ఆఫీసులో ఫోన్లు, టాబ్లెట్లకు బదులు ఒకరితో ఒకరు సామాజిక సంభాషణలలో పాల్గొనండి.
- గ్రే స్కేల్ మోడ్‌ని ఉపయోగించండి.



ఇన్‌పుట్స్: అనిల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

ముగ్గులకు ఆహ్వానం



ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట అందమైన రంగవల్లులు... కొలువు తీరాల్సిందే! మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

సినిమా

• ఇయర్ రౌండప్

సాంగు భళా

మాటల్లో చెప్పలేని భావాన్ని పాటల్లో మరింత చక్కగా ఆవిష్కరించే వీలుంటుంది. ప్రేమ, విషాదం, ఆనందం.. ఏ భావోద్వేగాన్ని అయినా పాటలో పలికించవచ్చు. ఆ పాట ట్యూన్ క్యాచీగా ఉంటే శ్రోతల అటెన్షన్‌ని క్యాచ్ చేస్తుంది. 2022లో జనవరి నుంచి డిసెంబర్ వరకు అలాంటి 'క్యాచీ సాంగ్స్' చాలా వచ్చాయి. 'సాంగు భళా' అంటూ ఆకట్టుకున్న బోలెడన్ని పాటల్లో కొన్ని ఈ విధంగా...

సినిమా	పాట	సంగీతం
బంగార్రాజు	కళ్లకు కాటుక ఎట్టుకుని.. కాళ్లకు పట్టీలు కట్టుకుని...	అనూప్ రూబెన్స్
రౌడీ బాయ్స్	బృందావనం నుంచి కృష్ణుడు వచ్చాడే...	దేవిశ్రీ ప్రసాద్
గుడ్‌లక్ సఖి	రావే రావే సఖి.. మురిసే ముచ్చట్లకి...	దేవిశ్రీ ప్రసాద్
ఖిలాడీ	నీ లిప్పులోంచి దూసుకొచ్చే ఫ్లైయింగ్ కిస్...	దేవిశ్రీ ప్రసాద్
సెహరి	ఓ కలలా.. ఇన్నాళ్లే నిన్ను దాచి లోకమే...	ప్రశాంత్ ఆర్. విహారి
డీజే టిల్లు	లాలాగూడ అంబర్‌పేట మల్లేపల్లి మలక్‌పేట... పటాసు పిల్లా...	రామ్ మిర్యాల
భీమ్లా నాయక్	భీమ్లా నాయక్.. ఇరగదీసే ఈడి ఫైరు సల్లగుండ...	ఎస్. తమన్
ఆడవాళ్లు మీకు జోహార్లు	ఆడాళ్లు మీకు జోహార్లు...	దేవిశ్రీ ప్రసాద్
రాధేశ్యామ్	నగుమోము తారలే.. తెగిరాలె నేలకే...	తమన్
ఆర్ఆర్ఆర్	పొలంగట్టు దుమ్ములోన పోట్లగిత్త దూకినట్టు... కొమురం భీముడో కొమురం భీముడో...	ఎంఎం కీరవాణి
ఆచార్య	సీమలు దూరని సిట్టడవికి సిరునవ్వొచ్చింది... లాహే లాహే లాహే లాహే లాహే లాహే...	మణిశర్మ
సర్కారువారి పాట	వందో ఒక వెయ్యో ఒక లక్షో మెరుపులు మీదికి... మ మ మహేశా...	ఎస్. తమన్
ఎఫ్ 3	అధ్యక్షా.. లైఫ్ అంటే మినిమం ఇట్టా ఉండాలా..	దేవిశ్రీ ప్రసాద్
మేజర్	నిన్నే కోరెనే.. నిన్నే కోరే..	శ్రీచరణ్ పాకాల
అంటే సుందరానికీ..	చెంగుచాటు చేగువేరా... ఎంత చిత్రం...	వివేక్ సాగర్
షికారు	మనసు దారితప్పెనే...	శేఖర్ చంద్ర
ది వారియర్	నా పక్కకి నువ్వే వస్తే హార్ట్ బీటే స్పీడవుతుంది...	దేవిశ్రీ ప్రసాద్
బింబిసార	గుండె దాటి గొంతు దాటి పలికిందేదో వైనం...	ఎంఎం కీరవాణి
సీతారామం	ఇంతందం దారి మళ్లిందా భూమిపైకి చేరుకున్నదా... ఓ సీతా వదలనిక తోడవుతా...	విశాల్ చంద్రశేఖర్
మాచర్ల నియోజకవర్గం	మాచర్ల సెంటర్లో మాపటేల నేనొస్తే..	మహతి స్వరసాగర్
గాడ్‌ఫాదర్	తార్ మార్ తక్కర్ మార్..	తమన్
జిన్నా	జారు మిఠాయో నా జారు మిఠాయ..	అనూప్ రూబెన్స్
హిట్: ది సెకండ్ కేస్	రానే వచ్చావ వానై నా కొరకే...	జాన్ స్టీవర్ట్ ఎడూరి
ధమాకా	నిన్ను సూడ బుద్ధి అయితాంది రాజిగో...	భీమ్స్ సిసిరోలియో


థ్రిల్లింగ్ ప్రేమకథ



• కిరణ్‌కుమార్

అంకిత్, తన్వి జంటగా నటించిన చిత్రం 'జాన్ సే'. ఈ సినిమాతో ఎస్. కిరణ్ కుమార్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. క్రితి ఎంటర్‌టైన్మెంట్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ– ''నేను సివిల్ ఇంజనీర్‌ని. అయితే నేను అనుకునే కథలు, ఆలోచనలను సినిమా రూపంలో చెప్పాలనే ఆసక్తే నన్ను దర్శకుణ్ణి చేసింది. ఈ 'జాన్ సే' మూవీ లైన్‌ను తొమ్మిదేళ్లుగా అనుకున్నాను. ఆరు నెలల క్రితం పూర్తి స్క్రిప్ట్ రెడీ అయింది. క్రైమ్ థ్రిల్లర్ స్టోరీనే అయినా ఈ సినిమాలో మంచి లవ్ స్టోరీ కూడా ఉంది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి తెలివి, ఝాన్సీ లక్ష్మీబాయి తెగువ ఉన్న అమ్మాయి ఈ సమాజాన్ని ఎలా ఎదుర్కొంది? అనేది మెయిన్ లైన్. 'జాన్ సే' రిలీజ్ డేట్ త్వరలో చెబుతాను'' అన్నారు.

1920 నేపథ్యంలో...



• కమల్‌హాసన్

'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమా తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ తాజాగా 'ఇండియన్ 2' చేస్తున్న సంగతి తెలిసిందే. కమల్‌హాసన్ టైటిల్ రోల్ చేస్తున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. 'ఇండియన్' సినిమాలో మాదిరిగానే 'ఇండియన్ 2'లోనూ కమల్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. 'ఇండియన్'లో సేనాపతి, అతని తనయుడు చంద్రబోస్ సేనాపతి పాత్రల్లో నటించారు కమల్‌హాసన్. అయితే 'ఇండియన్ 2' కథను మాత్రం సేనాపతి, అతని తండ్రి పాత్రల నేపథ్యంలో (1920 సమయంలో...) సాగుతూనే, మరోవైపు ఇప్పటి కాలం కూడా టచ్ అయ్యేలా స్క్రీన్‌ప్లే రెడీ చేశారట శంకర్. అలాగే ఈ చిత్రంలో కమల్‌హాసన్ ఓ పాత్రలో తొంభైసంవత్సరాల వ్యక్తిగా కనిపించనున్నారు. ఈ లుక్‌కి సంబంధించిన షూటింగ్‌లో పాల్గొంటున్నప్పుడు కమల్ ఆహారం తీసుకోవడంలేదట. ప్రొస్థటిక్ మేకప్ వాడడంతో నోరు పూర్తిగా తెరవలేని పరిస్థితుల్లో షూటింగ్ అప్పుడు కేవలం పండ్ల రసాలతో సరిపెట్టుకుంటున్నారట.

టాప్‌గేర్ స్పీడ్‌తో...



• ఆది, రియా

ఆది సాయికుమార్, రియా సుమన్ జంటగా కె.శశికాంత్ దర్శకత్వంలో కేవీ శ్రీధర్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'టాప్‌గేర్'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ స్పీడ్‌గా జరుగుతున్నాయి. ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 18న విడుదల చేయనున్నారు. ''ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలతో మా సినిమా ఆడియన్స్ అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గిరిధర్ మామిడిపల్లి.


నో ఎగ్జిట్



• నందితా శ్వేత, ప్రతాప్ రెడ్డి, భరత్ కోమలపాటి

తారకరత్న, ప్రిన్స్, సునీల్, అలీ, సాయికుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఎస్ 5 నో ఎగ్జిట్'. భరత్ కోమలపాటి (సన్నీ కోమలపాటి) దర్శకత్వం వహించారు. ఆదూరి ప్రతాప్ రెడ్డి, దేవు శామ్యూల్, షైక్ రెహీమ్, మెల్కి రెడ్డి గాదె, గౌతమ్ కొండెపూడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని అవినాష్ కాలేజ్ విద్యార్థుల సమక్షంలో హీరోయిన్ నందితా శ్వేత విడుదల చేసి, మాట్లాడుతూ– ''నన్ను హారర్ క్వీన్ అని పిలుస్తుంటారు.. నేను చేసిన సినిమాలు నాకు అలాంటి పేరు తీసుకొచ్చాయి. 'ఎస్ 5 నో ఎగ్జిట్' సినిమాని థియేటర్లలో చూడండి'' అన్నారు. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. మణిశర్మగారి సంగీతం, 'గరుడ వేగ' అంజి సినిమాటోగ్రఫీ ఆకట్టుకుంటాయి'' అన్నారు భరత్ కోమలపాటి. ''మీ నుంచి (విద్యార్థులు) వస్తున్న స్పందన చూస్తుంటే సినిమా విజయం ఖాయమని అర్థమవుతోంది'' అన్నారు నిర్మాతలు. ''ఈ సినిమా కోసం కొత్త టెక్నాలజీ వాడాం'' అన్నారు 'గరుడవేగ' అంజి.

రెండు భాషల్లో శబ్దం



• ఆది పినిశెట్టి

'వైశాలి' వంటి సూపర్‌హిట్ మూవీ తర్వాత హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో 'శబ్దం' అనే చిత్రం రూపొందనుంది. 7ఎ ఫిలింస్ ఆల్ఫా ఫ్రేమ్స్‌పై 7ఎ శివ తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. బుధవారం (డిసెంబరు 14) ఆది బర్త్‌డే సందర్భంగా 'శబ్దం' చిత్రాన్ని ప్రకటించారు. ''సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందనున్న చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందిస్తాం. త్వరలో మరిన్ని వివరాలు తెలియజేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్. భానుప్రియ శివ, కెమెరా: అరుణ్ పద్మనాభన్, సంగీతం: తమన్, రచన–దర్శకత్వం–లైన్ ప్రొడ్యూసర్: అరివళగన్.

అగ్రస్థానంలో ఆర్ఆర్ఆర్



• ఎన్టీఆర్, రామ్‌చరణ్

దేశ, విదేశీ ప్రేక్షకులను మెప్పించిన 'ఆర్ఆర్ఆర్' ఇప్పటికే పలు అవార్డులు, రివార్డులు దక్కించుకుంది. కొన్ని అవార్డుల రేసులో ఉంది. ఇక తాజాగా ఐఎమ్‌డీబీ (ఇంటర్‌నెట్ మూవీ డేటా బేస్) రిలీజ్ చేసిన ఈ ఏడాది పాపులర్ ఇండియన్ మూవీస్‌లో 'ఆర్ఆర్ఆర్' చిత్రం అగ్రస్థానంలో నిలిచింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది మార్చి 25న రిలీజైన సంగతి తెలిసిందే. కాగా సంచలన హిట్‌గా నిలిచిన హిందీ ఫిల్మ్ 'ది కశ్మీరీ ఫైల్స్' రెండో స్థానంలో, కన్నడ యాక్షన్ ఫిల్మ్ యశ్ 'కేజీఎఫ్ 2' మూడో స్థానంలో, తమిళ హిట్ కమల్‌హాసన్ 'విక్రమ్' నాలుగో స్థానంలో, కన్నడ బ్లాక్‌బస్టర్ రిషబ్ శెట్టి 'కాంతార' ఐదో స్థానంలో నిలిచాయి. మాధవన్ 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్', అడివి శేష్ 'మేజర్' (తెలుగు), దుల్కర్ సల్మాన్ 'సీతారామం' (తెలుగు), విక్రమ్–కార్తీ–'జయం' రవిల 'పొన్నియిన్ సెల్వన్: పార్ట్ 1 (తమిళం)', రక్షిత్ శెట్టి '777 చార్లీ' (కన్నడం) వరుసగా 6, 7 ,8 ,9, 10 స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబరు 7 వరకు థియేట్రికల్ రిలీజ్, డిజిటల్ రిలీజ్ అయిన సినిమాలతో ఈ జాబితా తయారు చేశారు. ఐఎమ్‌డీబీలో పదికి ఏడుకి పైగా రేటింగ్ ఇవ్వడం లేదా ఓ చిత్రానికి 25వేలకు పైగా ఓట్లను యూజర్స్ వేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ జాబితా రూపొందించినట్లు ఐఎమ్‌డీబీ ప్రతినిధులు పేర్కొన్నారు.

నా మనసే దోచావే.....




• విజయేంద్రప్రసాద్, నాగరాజ్ బొడెమ్

మనోజ్, చాందిని భగవానిని జంటగా నాగరాజ్ బొడెమ్ దర్శకత్వంలో డి. హరి బాబు నిర్మించిన చిత్రం '14 డేస్ లవ్'. ఈ చిత్రంలోని 'ఏం మాయో చేసేసి నా మనసే దోచావే.. లఫ్ ఫైరే రాజేసి లైఫ్ లైనే అయ్యావే..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను ఎంపీ, ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ విడుదల చేసి, శుభాకాంక్షలు తెలిపారు. చిత్ర సంగీతదర్శకుడు కిరణ్ వన్నె స్వరపరచిన ఈ పాటను గిరి పట్ల రాయగా, రాహుల్ నంబియార్, సాహితా చాగంటి పాడారు. ''త్వరలోనే మా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

టైటిల్ సాంగ్ బాగుంది

- శ్రీకాంత్



• కృష్ణసాయి,, శ్రీకాంత్

''కృష్ణసాయి నాకు ఎప్పటి నుంచో పరిచయం. తను నటించిన 'సుందరాంగుడు' సినిమాలోని 'సుందరాంగుడు నేనే..' టైటిల్ సాంగ్ చాలా బాగుంది'' అన్నారు హీరో శ్రీకాంత్. కృష్ణసాయి హీరోగా మౌర్యాని, ఈషా, రీతూ, సాక్షి హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'సుందరాంగుడు'. వినయ్‌బాబు దర్శకత్వం వహించారు. ఏవీ సుబ్బారావు సమర్పణలో బీసు చందర్ గౌడ్, యం.యస్.కె. రాజు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదలవుతోంది. సిద్ధబాబు సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సుందరాంగుడు నేనే.. సుకుమారుడిని నేనే..' టైటిల్ సాంగ్‌ను శ్రీకాంత్ విడుదల చేశారు. కృష్ణ సాయి మాట్లాడుతూ– ''నేను, చందర్ గౌడ్‌గారు రెండేళ్లు కష్టపడి ఈ సినిమాని పూర్తి చేశాం. 'సుందరాంగుడు నేనే..' పాటని డైరెక్టర్ వినయ్ బాబు రాశారు. మా 'కృష్ణసాయి ఇంటర్నేషనల్ చారిటబుల్ ట్రస్ట్' తరపున చాలామందికి సాయం చేస్తున్నాం.. 'సుందరాంగుడు' ద్వారా వచ్చే డబ్బుని ట్రస్ట్ కోసమే ఖర్చు చేస్తాం'' అన్నారు.



117 స్థానాలు ఎగబాకి...

వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన నాలుగో భారత ఆటగాడిగా నిలిచిన యువ సంచలనం ఇషాన్ కిషన్ ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో దూసుకుపోయాడు. ఒక్క ఇన్నింగ్స్‌తో ఏకంగా 117 స్థానాలు ఎగబాకిన కిషన్ 37వ ర్యాంక్‌కు చేరుకోవడం విశేషం. బంగ్లాదేశ్‌పైనే సెంచరీ చేసిన కోహ్లి రెండు స్థానాలు మెరుగుపర్చుకొని ఎనిమిదో స్థానానికి చేరాడు. శ్రేయస్ అయ్యర్ 15వ ర్యాంక్‌కు చేరుకోగా, బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సిరాజ్ 22వ స్థానంలో నిలిచాడు.



రష్మిక సంచలనం

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక సంచలనం సృష్టించింది. షోలాపూర్‌లో జరుగుతున్న ఈ టోర్నీ తొలి రౌండ్‌లో 779వ ర్యాంకర్ రష్మిక 5-7, 6-3, 6-2తో రెండో సీడ్, ప్రపంచ 266వ ర్యాంకర్ యువోన్ కావెలి రెల్మెర్స్ (స్పెయిన్)పై గెలిచింది. 2 గంటా 58 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక తొమ్మిది ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.


మూడో గోల్ అనంతరం మెస్సీ, అల్వారెజ్ సంబరం

మెస్సీ మాయ...

ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్లో అర్జెంటీనా

కెప్టెన్ అసాధారణ ప్రదర్శన

సెమీఫైనల్లో క్రొయేషియాపై 3-0తో ఘన విజయం

రెండు గోల్స్‌తో మెరిసిన అల్వారెజ్

అంతా తానై జట్టును ముందుడి నడిపిస్తున్న లయెనెల్ మెస్సీ తన 'ప్రపంచకప్' కలను నిజం చేసుకోవడానికి మరో విజయం దూరంలో నిలిచాడు. నాలుగేళ్ల క్రితం ప్రపంచకప్‌లో లీగ్ మ్యాచ్‌లో మెస్సీ కెప్టెన్సీలోనే అర్జెంటీనా 0-3తో క్రొయేషియా చేతిలో దారుణంగా ఓడిపోయింది. నాలుగేళ్ల తర్వాత మెస్సీ సారథ్యంలోనే క్రొయేషియాపై అర్జెంటీనా 3-0తో ప్రతీకార విజయం సాధించింది. ఆనాడు అంతగా ప్రభావం చూపని మెస్సీ ఈసారి మాత్రం విశ్వరూపమే ప్రదర్శించాడు. మైదానం మొత్తం పాదరసంలా కదులుతూ క్రొయేషియా డిఫెండర్లకు చుక్కలు చూపించాడు. ఒక గోల్ చేయడంతోపాటు తనను ఆరాధ్యంగా భావించే 22 ఏళ్ల జూలియన్ అల్వారెజ్‌కు రెండు గోల్స్ చేయడానికి సహకరించాడు. ఫలితంగా అర్జెంటీనా ఆరోసారి ప్రపంచకప్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. 1986లో చివరిసారి విశ్వవిజేతగా నిలిచిన అర్జెంటీనా మళ్లీ జగజ్జేత కావడానికి గెలుపు దూరంలో ఉంది.

దోహా: గతంలో ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరిన ఐదుసార్లూ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న అర్జెంటీనా అదే ఆనవాయితీని కొనసాగించింది. ఆరోసారి ఈ మెగా ఈవెంట్‌లో సెమీఫైనల్ ఆడిన మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా అద్భుత ఆటతీరుతో క్రొయేషియా అడ్డంకిని అధిగమించి దర్జాగా ఆరోసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. 88,966 మంది ప్రేక్షకులతో కిక్కిరిసిన లుసైల్ స్టేడియంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన తొలి సెమీఫైనల్లో అర్జెంటీనా 3-0 గోల్స్ తేడాతో గత ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియా జట్టును చిత్తుగా ఓడించింది. అర్జెంటీనా తరఫున కెప్టెన్ మెస్సీ (34వ ని.లో) ఒక గోల్ చేయగా... జూలియన్ అల్వారెజ్ (39వ, 69వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు. డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్, మొరాకో జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ విజేతతో ఈనెల 18న జరిగే ఫైనల్లో అర్జెంటీనా తలపడుతుంది. అర్జెంటీనా 1978, 1986లలో ప్రపంచ చాంపియన్‌గా... 1930, 1990, 2014లలో రన్నరప్‌గా నిలిచింది.

పక్కా ప్రణాళికతో...

నాకౌట్ మ్యాచ్‌ల్లో రక్షణాత్మకంగా ఆడుతూ ప్రత్యర్థికి గోల్స్ ఇవ్వకుండా చివర్లో షూటౌట్‌లో విజయం సాధించడం క్రొయేషియా అలవాటుగా మార్చుకుంది. ఆరంభంలోనే గోల్స్ చేసి క్రొయేషియాను ఒత్తిడికి నెట్టాలనే వ్యూహంతో అర్జెంటీనా ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఈ వ్యూహం ఫలితాన్నిచ్చింది. ఆట 34వ నిమిషంలో 'డి' ఏరియాలో అల్వారెజ్‌ను క్రొయేషియా గోల్‌కీపర్ లివకోవిచ్ మొరటుగా అడ్డుకోవడంతో రిఫరీ అర్జెంటీనాకు పెనాల్టీ కిక్‌ను ప్రకటించాడు. మెస్సీ ఎడమ కాలితో కొట్టిన షాట్ బుల్లెట్ వేగంతో క్రొయేషియా గోల్‌పోస్ట్‌లోనికి వెళ్లింది. అర్జెంటీనా 1-0తో ఆధిక్యం సంపాదించింది. ఐదు నిమిషాల తర్వాత అర్జెంటీనా ఖాతాలో రెండో గోల్ చేరింది. మధ్య భాగంలో ఉన్న మెస్సీ బంతిని అల్వారెజ్‌కు పాస్ ఇవ్వగా అతను వాయువేగంతో క్రొయేషియా డిఫెండర్లను బోల్తా కొట్టిస్తూ 'డి' ఏరియాలోకి వచ్చాడు. అదే జోరులో గోల్‌కీపర్‌ను తప్పిస్తూ బంతిని లక్ష్యానికి చేర్చాడు. విరామ సమయానికి అర్జెంటీనా 2-0తో ముందంజలో నిలిచింది.

తక్కువ అంచనా వేయకుండా...

నెదర్లాండ్స్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అర్జెంటీనా 2-0తో ఆధిక్యంలో నిలిచినా చివర్లో తడబడి రెండు గోల్స్ సమర్పించుకొని చివరకు షూటౌట్‌లో నెగ్గి ఊపిరి పీల్చుకుంది. ప్రమాదకరమైన క్రొయేషియా జట్టుకు అలాంటి అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతో అర్జెంటీనా రెండో అర్ధభాగంలోనూ జాగ్రత్తగా ఆడింది. బంతి ఎక్కువ శాతం క్రొయేషియా ఆటగాళ్ల ఆధీనంలో ఉన్నప్పటికీ వారిని 'డి' ఏరియా వరకు రానివ్వకుండా చేయడంలో అర్జెంటీనా డిఫెండర్లు సఫలమయ్యారు. మ్యాచ్ మొత్తంలో క్రొయేషియా కేవలం రెండుసార్లు మాత్రమే అర్జెంటీనా గోల్‌పోస్ట్ లక్ష్యంగా షాట్‌లు కొట్టడం గమనార్హం. క్రొయేషియా కెప్టెన్ లుకా మోడ్రిచ్, పెరిసిచ్, బ్రోజోవిచ్, కొవాసిచ్‌లను అర్జెంటీనా డిఫెండర్లు సమర్థంగా నిలువరించారు.

మ్యాచ్ గణాంకాలు

అర్జెంటీనా		క్రొయేషియా
7	గోల్‌పోస్ట్‌పై షాట్‌లు	2
39%	బంతి ఆధీనం	61%
399	పాస్‌లు	608
15	ఫౌల్స్	8
2	ఎల్లో కార్డులు	2
2	కార్నర్‌లు	4

వారెవ్వా.. ఏమి గోల్.....

ఆట 57వ నిమిషంలో అర్జెంటీనా ఖాతాలో మూడో గోల్ చేరేదే కానీ మెస్సీ కొట్టిన షాట్‌ను గోల్‌పోస్ట్ ముందు గోల్‌కీపర్ లివకోవిచ్ అడ్డుకున్నాడు. ఆ తర్వాత 69వ నిమిషంలో అద్భుతమే జరిగింది. తనదైన రోజున తానెంత ప్రమాదకర ప్లేయర్‌నో మెస్సీ నిరూపించాడు. కుడి వైపున బంతి అందుకున్న మెస్సీ పాదరసంలా కదులుతూ ముందుకు వెళ్లగా... అతని వెంబడే క్రొయేషియా డిఫెండర్ జోస్కో గ్వార్డియోల్ పరుగెత్తాడు. గ్వార్డియోల్ అన్ని రకాలుగా మెస్సీని నిలువరించాలని చూసినా... ఈ అర్జెంటీనా స్టార్ మాత్రం కనువిందు లాంటి డ్రిబ్లింగ్‌తో అలరించాడు. చివరకు గోల్‌లైన్ అంచుల్లోంచి గ్వార్డియోల్ కాళ్ల సందులోంచి బంతిని మెస్సీ క్రాస్ పాస్ ఇవ్వగా... అక్కడే ఉన్న అల్వారెజ్ నేర్పుతో బంతిని లక్ష్యానికి చేర్చాడు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. ఈ గోల్‌ను కళ్లారా చూసిన వారందరూ మెస్సీ మ్యాజిక్‌కు ఫిదా అయిపోవడమే కాకుండా ఈ గోల్‌ను చిరకాలం గుర్తుంచుకుంటారు. అర్జెంటీనా ఆధిక్యం 3-0కు పెరగడంతో క్రొయేషియా విజయంపై ఆశలు వదులుకుంది. మరోవైపు అర్జెంటీనా చివరి వరకు దూకుడును కొనసాగిస్తూ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

1 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన అర్జెంటీనా ప్లేయర్‌గా మెస్సీ నిలిచాడు. బటిస్టుటా (10 గోల్స్) పేరిట ఉన్న రికార్డును మెస్సీ (11 గోల్స్) సవరించాడు. ఈ టోర్నీ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్ల జాబితాలో మెస్సీ సంయుక్తంగా ఆరో స్థానానికి చేరుకున్నాడు. మిరోస్లావ్ క్లోజ్ (16), రొనాల్డో నజారియో (15), గెర్డ్ ముల్లర్ (14) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

2 ప్రపంచకప్‌లో తొలి లీగ్ మ్యాచ్‌లో ఓడిన తర్వాత ఫైనల్ చేరడం అర్జెంటీనాకిది రెండోసారి. 1990లోనూ అర్జెంటీనా తొలి మ్యాచ్‌లో కామెరూన్ చేతిలో ఓడిపోయి ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. 1982లో పశ్చిమ జర్మనీ... 1994లో ఇటలీ... 2010లో స్పెయిన్ కూడా ఈ ఘనత సాధించాయి. జర్మనీ, ఇటలీ రన్నరప్‌గా నిలువగా... స్పెయిన్ మాత్రం టైటిల్ సాధించింది.

2 జర్మనీ తర్వాత ప్రపంచకప్ సెమీఫైనల్లో రెండుసార్లు మూడు అంతకంటే ఎక్కువ గోల్స్ తేడాతో గెలిచిన రెండో జట్టుగా అర్జెంటీనా నిలిచింది.

3 వరుసగా ఐదో ప్రపంచకప్ ఆడుతున్న మెస్సీ గత నాలుగు ప్రపంచకప్‌లలో నాకౌట్ మ్యాచ్‌ల్లో ఒక్క గోల్ కూడా చేయలేదు. ఈసారి మాత్రం ఏకంగా మూడు గోల్స్ చేశాడు.

5 ఒకే ప్రపంచకప్‌లో ఐదు గోల్స్ చేసిన పెద్ద వయస్కుడిగా మెస్సీ (35 ఏళ్లు) ఘనత సాధించాడు.

6 ప్రపంచకప్‌లో అర్జెంటీనా ఫైనల్ చేరడం ఇది ఆరోసారి. జర్మనీ అత్యధికంగా 8 సార్లు ఫైనల్ చేరింది. బ్రెజిల్, ఇటలీ (6 సార్లు చొప్పున) సరసన అర్జెంటీనా నిలిచింది.

16 ఈ ఏడాది అర్జెంటీనా తరఫున మెస్సీ చేసిన గోల్స్. తన కెరీర్‌లో జాతీయ జట్టుకు ఒకే సంవత్సరం ఇన్ని గోల్స్ అందించడం ఇదే ప్రథమం.

25 ఇప్పటి వరకు ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో మెస్సీ ఆడిన మ్యాచ్‌లు. లోథర్ మథియాస్ (జర్మనీ-25 మ్యాచ్‌లు) పేరిట ఉన్న రికార్డును మెస్సీ సమం చేశాడు. ఫైనల్లోనూ మెస్సీ బరిలోకి దిగితే ఈ మెగా టోర్నీ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు (26) ఆడిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పుతాడు.

ఫైనల్ మ్యాచ్‌లో చివరిసారిగా...

ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్ తనకు చివరి వరల్డ్‌కప్ అవుతుందని అర్జెంటీనా కెప్టెన్ మెస్సీ అధికారికంగా ప్రకటించాడు. 2006 నుంచి వరుసగా ఐదు ప్రపంచకప్‌లు ఆడిన మెస్సీ, తన ఆఖరి పోరులో గెలిచి చరిత్రకెక్కాలని పట్టుదలగా ఉన్నాడు. 'నా ప్రపంచకప్ ప్రయాణాన్ని ముగించబోతున్నాను. నా చివరి మ్యాచ్‌గా ఫైనల్ ఆడే అవకాశం రావడం సంతోషంగా ఉంది. మరోసారి వరల్డ్‌కప్ అంటే చాలా దూరంలో ఉంది. నేను అప్పటి వరకు ఆడలేనని తెలుసు. వరల్డ్‌కప్‌లో వేర్వేరు రికార్డులు నా దరిచేరడం మంచిదే. కానీ అన్నింటికంటే ముఖ్యం జట్టుగా మా లక్ష్యం ఏమిటనేది. అది సాధిస్తేనే అంతా అద్భుతంగా ఉంటుంది. దానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాం. ఎంతో కష్టపడి ఈ దశకు వచ్చాం. ట్రోఫీ గెలిచేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాం' అని 35 ఏళ్ల మెస్సీ వ్యాఖ్యానించాడు. 2005 నుంచి అర్జెంటీనా సీనియర్ జట్టుకు ఆడుతున్న మెస్సీ 171 మ్యాచ్‌లు ఆడి 96 గోల్స్ సాధించాడు.


మూడో గోల్ సాధించారిలా...

మొదటి రోజు ఇద్దరిదీ...

ఎప్పటిలాగే ఆపద్బాంధవుడిగా చతేశ్వర్ పుజారా ముందుండి నడిపించగా... మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ కీలక ప్రదర్శన చేయగా బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో భారత్ మెరుగైన స్థితిలో నిలిచింది. ఒకదశలో 48/3తో ఇబ్బందుల్లో పడినా పంత్ దూకుడుతో పాటు పుజారా, శ్రేయస్ భాగస్వామ్యం టీమ్‌ను నడిపించాయి. అయితే ఆట ముగియడానికి కొద్దిసేపు ముందు రెండు వికెట్లు తీసిన బంగ్లా కూడా సంతృప్తిగా ముగించింది. బుధవారమే స్పిన్‌ను అనుకూలించిన ఈ పిచ్‌పై రెండో రోజు ఆటలో శ్రేయస్‌కు లోయర్ ఆర్డర్ అండగా నిలిచి స్కోరును కనీసం 350 పరుగుల వరకు చేరిస్తే మ్యాచ్‌పై భారత్‌కు పట్టు లభిస్తుంది.

- భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 278/6
- పుజారా, అయ్యర్ అర్ధ సెంచరీలు
- బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు


పుజారా, శ్రేయస్ అయ్యర్

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజు భారత్ నిలకడైన ప్రదర్శన కనబర్చింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆట ముగిసేసరికి 90 ఓవర్లలో తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు నష్టపోయి 278 పరుగులు చేసింది. చతేశ్వర్ పుజారా (203 బంతుల్లో 90; 11 ఫోర్లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా, శ్రేయస్ అయ్యర్ (169 బంతుల్లో 82 బ్యాటింగ్; 10 ఫోర్లు) శతకానికి చేరువయ్యాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 149 పరుగులు జోడించారు. రిషభ్ పంత్ (45 బంతుల్లో 46; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) తనదైన శైలిలో ధాటిని ప్రదర్శించాడు.

పంత్ మెరుపులు...

కనీస స్థాయిలో కూడా బౌన్స్ లేకుండా పేస్ బౌలింగ్‌కు ఏమాత్రం అనుకూలించని పిచ్‌పై భారత ఓపెనర్లు కేఎల్ రాహుల్ (22; 3 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (20; 3 ఫోర్లు) ఎలాంటి తడబాటు లేకుండా ఆరంభంలో చకచకా పరుగులు సాధించారు. అయితే 7 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీసి ఒక్కసారిగా బంగ్లా బౌలర్లు మ్యాచ్‌ను మలుపు తిప్పారు. దాంతో స్కోరు 41/0 నుంచి 48/3కి చేరింది. రాహుల్‌ను ఖాలెద్ బౌల్డ్ చేయగా, చక్కటి బంతులతో గిల్, కోహ్లి (1)లను తైజుల్ వెనక్కి పంపాడు. ఇలాంటి స్థితిలో పంత్ ఎదురుదాడితో జట్టును ఆదుకున్నాడు. తైజుల్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన అతను అదే బౌలర్ తర్వాతి ఓవర్లో మరో 2 ఫోర్లు బాదాడు. లంచ్ సమయానికి స్కోరు 85/3 వద్ద నిలిచింది. విరామం తర్వాతా దూకుడు తగ్గించని పంత్... మెహదీ హసన్ ఓవర్లో భారీ సిక్స్ కొట్టాడు. అయితే తర్వాతి బంతికే అతను బౌల్డయ్యాడు.

ఆ క్యాచ్‌లు... ఆ బెయిల్స్...



బంగ్లా పేలవ ఫీల్డింగ్ కూడా భారత్‌కు అనుకూలంగా మారింది. పుజారా 12 పరుగుల వద్ద ఉన్నప్పుడు కీపర్ నూరుల్ క్యాచ్ వదిలేశాడు. శ్రేయస్ 30 పరుగుల వద్ద ఉన్నప్పుడు కూడా కాస్త కష్టసాధ్యమైన క్యాచ్‌ను నూరుల్ అందుకోలేకపోయాడు. ఆ తర్వాత శ్రేయస్ స్కోరు 67 వద్ద డీప్ మిడ్‌వికెట్‌లో ఇబాదత్ సునాయాస క్యాచ్ పట్టుకోలేకపోయాడు. 77 వద్ద కూడా శ్రేయస్ బతికిపోయాడు. ఇబాదత్ వేసిన బంతిని అతను ఆడలేకపోగా, బంతి వెళ్లి బెయిల్స్‌ను తాకింది. బంగ్లా ఆటగాళ్లు సంబరాల్లో మునిగిపోగా, కాస్త కదిలిన జింగ్ బెయిల్స్ కింద పడకుండా మళ్లీ యథాతథ స్థితికి వచ్చేశాయి. దాంతో శ్రేయస్ నాటౌట్‌గా తేలాడు.

భారీ భాగస్వామ్యం...

ఈ దశలో పుజారా, శ్రేయస్ కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించే ప్రయత్నం చేశారు. బంగ్లా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ టీ వరకు మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. వీరిద్దరికి కాస్త అదృష్టం కూడా కలిసొచ్చింది. బంగ్లా బౌలర్లు ఎంత శ్రమించినా రెండో సెషన్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. విరామం తర్వాత పుజారా అర్ధ సెంచరీ (125 బంతుల్లో) పూర్తయింది. ఆ వెంటనే శ్రేయస్ కూడా 93 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. ఎట్టకేలకు తైజుల్ ఈ జోడీని విడదీశాడు. చక్కటి బంతికి బౌల్డ్ అయిన పుజారా సెంచరీ చేజార్చుకొని నిరాశగా వెనుదిరిగాడు. తొలి రోజు చివరి బంతికి అక్షర్ పటేల్ (14) కూడా అవుట్ కాగా, శ్రేయస్ అజేయంగా నిలిచాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: రాహుల్ (బి) ఖాలెద్ 22; గిల్ (సి) యాసిర్ (బి) తైజుల్ 20; పుజారా (బి) తైజుల్ 90; కోహ్లి (ఎల్బీ) (బి) తైజుల్ 1; పంత్ (బి) మెహదీ హసన్ 46; శ్రేయస్ (బ్యాటింగ్) 82; అక్షర్ (ఎల్బీ) (బి) మెహదీ హసన్ 14; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (90 ఓవర్లలో 6 వికెట్లకు) 278. వికెట్ల పతనం**: 1-41, 2-45, 3-48, 4-112, 5-261, 6-278. **బౌలింగ్:** ఇబాదత్ 17-1-63-0, ఖాలెద్ 12-2-26-1, షకీబ్ 12-4-26-0, తైజుల్ 30-8-84-3, మెహదీ హసన్ 18-4-71-2, యాసిర్ 1-0-7-0.

తండ్రిలాగే తనయుడు...

రంజీ అరంగేట్రం మ్యాచ్‌లోనే అర్జున్ టెండూల్కర్ సెంచరీ


సచిన్ టెండూల్కర్ (ఫైల్) అర్జున్ టెండూల్కర్

పొర్వోరిమ్ (గోవా): భారత బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 15 ఏళ్ల వయసులో తన తొలి రంజీ మ్యాచ్‌లో సెంచరీ సాధిస్తే... తనయుడు అర్జున్ టెండూల్కర్ 23 ఏళ్ల వయసులో ఆడిన తొలి రంజీ మ్యాచ్‌లో 'శత'క్కొట్టాడు. ముంబై నుంచి గోవాకు మారిన అర్జున్ ఎలైట్ గ్రూప్ 'సి' మ్యాచ్‌లో రాజస్తాన్‌తో పోరులో మొదటి రోజు ఏడో నంబర్‌లో బ్యాటింగ్‌కు దిగి 4 పరుగులతో రోజును ముగించాడు. బుధవారం ఓవర్‌నైట్ బ్యాటర్‌గా ఆటను కొనసాగించిన అర్జున్ అద్భుత సెంచరీ సాధించాడు. 207 బంతులు ఆడిన అర్జున్ 16 ఫోర్లు, 2 సిక్స్‌లతో 120 పరుగులు సాధించి అవుటయ్యాడు. ఓవర్‌నైట్ స్కోరు 210/5తో రెండో రోజు ఆట కొనసాగించిన గోవా తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 493 పరుగుల భారీస్కోరు సాధించింది. మరో ఓవర్‌నైట్ బ్యాటర్ సుయశ్ ప్రభుదేశాయ్ (212; 29 ఫోర్లు) డబుల్ సెంచరీతో కదంతొక్కాడు. సుయశ్, అర్జున్ ఆరో వికెట్‌కు 221 పరుగులు జోడించారు. సచిన్, అర్జున్ ఇద్దరూ డిసెంబర్ నెలలోనే సెంచరీలు సాధించాడు. సచిన్ 1988 డిసెంబర్ 11న గుజరాత్‌తో జరిగిన పోరులో సెంచరీ సాధించగా... అర్జున్ డిసెంబర్ 14న శతకం చేయడం విశేషం.

ఏసీఏ అధ్యక్షుడిగా శరత్ చంద్రారెడ్డి



సాక్షి, అమరావతి, విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా హైకోర్టు ఉత్తర్వుల కారణంగా ఫలితాలను ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించలేదు. వివరాల్లోకెళితే... మాజీ ఐఏఎస్ రమాకాంత్ రెడ్డి ఎన్నికల అధికారిగా నవంబర్ 18న ఏసీఏ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ఆరు కీలక పదవుల కోసం ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో వీరందరూ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీటిని ఈనెల 3న ప్రకటించాల్సి ఉండగా... చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘం హైకోర్టులో కేసు వేయడంతో ఫలితాలను నిలిపేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే తాజాగా చిత్తూరు జిల్లా సంఘం కేసును వెనక్కి తీసుకోవడంతో అడ్డంకి తొలగింది. దాంతో ఫలితాలను ప్రకటించేందుకు న్యాయమూర్తి జస్టిస్ సి.మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఎన్నికల్లో అధ్యక్షుడిగా పి. శరత్ చంద్రారెడ్డి... ఉపాధ్యక్షుడిగా పి.రోహిత్ రెడ్డి... కార్యదర్శిగా గోపీనాథ్ రెడ్డి... సంయుక్త కార్యదర్శిగా ఎ.రాకేశ్... కోశాధికారిగా ఎ.వెంకటాచలం... కౌన్సిలర్‌గా కేవీ పురుషోత్తమ రావు ఎన్నికయ్యారు.

అర్మాన్ సెంచరీ: ముంబై 290/6



సాక్షి, విజయనగరం: ఆంధ్ర జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో 41 సార్లు చాంపియన్ ముంబై భారీ ఆధిక్యం దిశగా పయనిస్తోంది. ఓవర్‌నైట్ బ్యాటర్ అర్మాన్ జాఫర్ (116 బ్యాటింగ్; 16 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించాడు. దీంతో ఓవర్‌నైట్ స్కోరు 25/1తో బుధవారం రెండోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై ఆట నిలిచే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 290 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (45; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ అజింక్య రహానే (44; 6 ఫోర్లు), రాణించారు. శశికాంత్ (3/50) రహానేతో పాటు సర్ఫరాజ్ (5)ను అవుట్ చేశాడు. హార్దిక్ (10)ను షోయబ్, ములానీ (10)ని లలిత్ మోహన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నారు. తర్వాత వచ్చిన తనుశ్ (43 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) అండతో అర్మాన్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు అబేధ్యమైన ఏడో వికెట్‌కు 65 పరుగులు జతచేశారు.

మూడో టి20లో భారత్ పరాజయం


రేణుక, అంజలి

ముంబై: బ్యాటింగ్ వైఫల్యంతో భారత మహిళల జట్టు మూడో టి20లో పరాజయం పాలైంది. ఆస్ట్రేలియా 21 పరుగుల తేడాతో గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచింది. ముందుగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. ఎలీస్ పెర్రీ (47 బంతుల్లో 75; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), గ్రేస్ హారిస్ (18 బంతుల్లో 41; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడారు. ఆంధ్ర అమ్మాయి అంజలి శర్వాణి, రేణుక సింగ్, దీప్తి శర్మ, దేవిక తలా 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 151 పరుగులే చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (41 బంతుల్లో 52; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిసింది. హర్మన్‌ప్రీత్ (27 బంతుల్లో 37; 6 ఫోర్లు), దీప్తి శర్మ (17 బంతుల్లో 25 నాటౌట్; 3 ఫోర్లు) రాణించారు. ఆసీస్ బౌలర్లలో డార్సీ బ్రౌన్, ఆష్లే గార్డెనర్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. 17న ఇదే వేదికపై నాలుగో టి20 మ్యాచ్ జరుగుతుంది.

సెమీస్‌లో భారత్



వాలెన్సియా: నేషన్స్ కప్ అంతర్జాతీయ మహిళల హాకీ టోర్నీలో భారత జట్టు సెమీఫైనల్ చేరింది. బుధవారం జరిగిన పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-0 గోల్స్ తేడాతో దక్షిణాఫ్రికాపై నెగ్గి 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసింది. భారత్ తరఫున దీప్ గ్రేస్ ఎక్కా (14వ ని.లో), గుర్జీత్ కౌర్ (59వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మొత్తం తొమ్మిది పాయింట్లతో పూల్ 'బి' టాపర్‌గా నిలిచిన భారత్ శుక్రవారం జరిగే సెమీఫైనల్లో ఐర్లాండ్‌తో ఆడుతుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 145	నిఫ్టీ ▲ 52
62,678	18,660

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తారీరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,302	▲	45
డోజోన్స్	34,306	▲	196
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,496	▼	7
డాక్స్	14,460	▼	38
షాంఘై	3,176	▲	1
నికాయ్	28,156	▲	201

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
54,386	▲ 356
బంగారం (99.5 స్వచ్ఛత)	
54,169	▲ 355
వెండి (కిలో)	
67,642	▲ 481

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.85	83.52
€	యూరో	ఒకటి	86.34	89.43
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	100.50	103.84
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	60.09	62.02
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.36	57.77
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.38	62.32
SAR	సౌదీ రియాల్	పదిమనుమలు	20.99	22.67
UAE D	యూఏఈ దిర్హామ్	పదిమనుమలు	21.55	23.35
¥	చైనా యువాన్	పదిమనుమలు	10.74	12.77

5.85 శాతానికి టోకు ద్రవ్యోల్బణం

- 21 నెలల కనిష్ట స్థాయి
- రిటైల్ ద్రవ్యోల్బణం స్థాయికి చేరిక
- కూరగాయల ధరలు తగ్గుముఖం



న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం మాదిరే టోకు ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) సైతం నవంబర్‌లో గణనీయంగా తగ్గి 5.85 శాతానికి పరిమితమైంది. అంతకుముందు నెలలో (అక్టోబర్) ఇది 8.39 శాతంగా ఉంది. ఆహారం, చమురు, తయారీ ధరలు తగ్గుముఖం పట్టడం ద్రవ్యోల్బణం వేడి తగ్గేందుకు సాయపడ్డాయి. నవంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సైతం అక్టోబర్‌లో ఉన్న 6.77 శాతం నుంచి 5.88 శాతానికి తగ్గడం తెలిసిందే. గతేడాది నవంబర్‌లో డబ్ల్యూపీఐ బేస్ అధికంగా ఉండడం, ఆహార ధరలు కొంత తగ్గడం ద్రవ్యోల్బణం నియంత్రణకు సాయపడినట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా ఓ పరిశోధన పత్రంలో పేర్కొంది. 2021 ఫిబ్రవరిలో టోకు ద్రవ్యోల్బణం 4.83% తర్వాత, అతి తక్కువ స్థాయిలో నమోదు కావడం మళ్లీ ఇదే మొదటిసారి.

విభాగాల వారీగా..

- ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 8.33% ఉంటే, నవంబర్‌లో 1.07%గా ఉంది.
- కూరగాయల ధరలు అయితే ఊహించని విధంగా నియంత్రణలోకి వచ్చాయి. కూరగాయలకు సంబంధించి ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 17.61 శాతంగా ఉంటే, నవంబర్‌లో ఏకంగా మైనస్ 20 శాతానికి (డిఫ్లేషన్) పడిపోయింది.
- ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం 17.35 శాతంగా నమోదైంది.
- తయారీ ఉత్పత్తులకు సంబంధించి 3.59 శాతంగా ఉంది.

మరింత తగ్గిస్తాం..



ప్రధాని మోదీ, మంత్రుల బృందం, అధికారులు ఎప్పటికప్పుడు జోక్యం చేసుకోవడం, చర్యలు తీసుకోవడం ఫలితాలనిచ్చాయి అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు తెలిపారు. సామాన్యుడి కోసం ద్రవ్యోల్బణాన్ని మరింత తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ఈవీలపై రూ. 10,000 కోట్లు

వచ్చే 8 ఏళ్లలో ఎంఅండ్‌ఎం ప్రణాళికలు

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, అభివృద్ధి కోసం వచ్చే 7–8 ఏళ్లలో రూ. 10,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) వెల్లడించింది. మహారాష్ట్ర విద్యుత్ వాహనాల ప్రోత్సాహక పథకం కింద తమ ప్రణాళికకు ఆమోదం లభించినట్లు పేర్కొంది. 'మహారాష్ట్రలోని పుణేలో మా బార్న్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (బీఈవీ) కోసం తయారీ, అభివృద్ధి కేంద్రం ఏర్పాటుపై అనుబంధ సంస్థ ద్వారా వచ్చే 7–8 ఏళ్లలో రూ. 10,000 కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నాం' అని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ జెజూరికర్ తెలిపారు. ఎంఅండ్‌ఎం ఆగస్టులో 5 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలను ఆవిష్కరించింది. వీటిలో నాలుగు వాహనాలు 2024–26 మధ్యలో మార్కెట్లోకి రానున్నాయి. ఎక్స్‌యూవీ400 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ వచ్చే ఏడాది జనవరిలో అందుబాటులోకి రానుంది.



ఏపీలో రూ.350 కోట్లతో ఆర్జాస్ స్టీల్ విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్టీల్ రంగంలో ఉన్న ఆర్జాస్ స్టీల్ (గతంలో జెర్డావ్ స్టీల్) రెండు ప్లాంట్లను విస్తరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లాలోని తాడిపత్రి ప్లాంటు సామర్థ్యాన్ని 25–30 శాతం పెంచుతోంది. ఇందుకోసం రూ.350 కోట్లు పెట్టుబడి చేస్తోంది. ప్రస్తుతం ఈ ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3 లక్షల టన్నులు. నాణ్యతను మెరుగుపరిచేందుకు జర్మనీ నుంచి కాక్స్ సైజింగ్ బ్లాక్‌తోపాటు కాయిల్ రూపంలో ప్రత్యేక స్టీల్ ఉత్పత్తికై గ్యారెట్ కాయిలర్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త స్టవ్‌ల స్థాపనతోసహా స్టీల్ శుద్ధి సామర్థ్యం పెంచుతున్నారు. అలాగే పంజాబ్‌లోని మండి గోవింద్‌ఘర్ ప్లాంటు వార్షిక సామర్థ్యం ప్రస్తుతం ఒక లక్ష టన్నులు. దీనికి రూ.260 కోట్ల వ్యయంతో 60–70 శాతం సామర్థ్యం జోడిస్తున్నారు. మొత్తం ఈ రెండు ప్లాంట్లకుగాను రూ.610 కోట్ల పెట్టుబడి చేస్తుండగా.. సామర్థ్యం 5.5 లక్షల టన్నులకు చేరనుంది. 2025 నాటికి ఈ విస్తరణ పూర్తి అవుతుందని ఆర్జాస్ స్టీల్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి వెల్లడించారు. వాహన రంగానికి అవసరమైన ప్రత్యేక స్టీల్ రెండు ప్లాంట్లలోనూ తయారవుతోంది. మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్ వంటి కంపెనీలకు వీటిని కంపెనీ సరఫరా చేస్తోంది.

పదేళ్లలో 17 బిలియన్ డాలర్లు..

- దేశీ వజ్రాల మార్కెట్‌పై అంచనాలు
- మధ్యతరగతి, యువత ఊతం
- డిబీర్స్ ఇండియా డైరెక్టర్ మెహతా వెల్లడి
- నెలాఖరులోగా కొత్తగా 2 ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్ ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ వజ్రాల పరిశ్రమ 2030 నాటికి 17 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనాలు ఉన్నాయని డైమండ్ మైనింగ్ దిగ్గజం డిబీర్స్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ తౌరాంజ్ మెహతా తెలిపారు. ప్రస్తుతం ఇది 7 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉందని వివరించారు. అమెరికా, చైనా తర్వాత మూడో అతి పెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్ ఇప్పుడిప్పుడే గణనీయంగా వృద్ధి చెందుతోందని ఆమె తెలిపారు. ''మెచ్యూరిటీని బట్టి చూస్తే జపాన్ పూర్తి స్థాయిని దాటేసింది. అమెరికా ప్రస్తుతం దగ్గర్లో ఉంది. చైనా వృద్ధి దశలోనూ, భారత్ వర్ధమాన స్థాయిలోనూ ఉంది'' అని మెహతా వివరించారు. మధ్య ప్రాచ్యం, యూరప్ మొదలైన ప్రాంతాల మార్కెట్ వాటా సుమారు చెరో 7 శాతం స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. సూరత్‌లోని డిబీర్స్ అధునాతన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైమండ్స్ సందర్శన సందర్భంగా ఆమె ఈ విషయాలు తెలిపారు. ''భారత ఎకానమీ వేగంగా వృద్ధి చెందుతోంది. మధ్యతరగతి జనాభా పెరగనుంది. డైమండ్స్ కొనుగోలు చేసే సంపన్న వర్గాల సంఖ్య మరింత ఎక్కువగా 25 శాతం మేర పెరగవచ్చని అంచనా. అలాగే వయస్సు రీత్యా చూస్తే కూడా వజ్రాల వైపు మొగ్గు చూపే యువత సంఖ్య కూడా పెరుగుతోంది. ఇవన్నీ కూడా రాబోయే దశాబ్దకాలంలో దేశీయంగా పరిశ్రమ వృద్ధికి తోడ్పడనున్నాయి'' అని మెహతా వివరించారు. ఫరెవర్ మార్క్ అనే తమ బ్రాండ్ విషయానికొస్తే అమ్మకాలపరంగా భారత్ అతి పెద్ద మార్కెట్‌గా ఉంటోందని ఆమె చెప్పారు. ప్రస్తుతం తమకు 60 నగరాల్లో 270 పైచిలుకు రిటైల్ అవుట్‌లెట్స్, 14 ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్ ఉన్నాయని మెహతా వివరించారు. కార్యకలాపాలను మరింతగా విస్తరించే క్రమంలో ఈ నెలాఖరు నాటికి ఇండోర్, మంగళూరులో కొత్తగా రెండు ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్‌ను తెరుస్తున్నట్లు ఆమె తెలిపారు.

దక్షిణాదిలో నాణ్యత .. ఉత్తరాదిలో పరిమాణం..

దక్షిణాది, ఉత్తరాది మార్కెట్లలో డిజైన్ల ప్రాధాన్యాలు చాలావరకు భిన్నంగా ఉంటాయని మెహతా తెలిపారు. దక్షిణాదిలో డైమండ్ పరిమాణం చిన్నదిగా ఉన్నా మంచి రంగు, అత్యుత్తమ క్వాలిటీకి ప్రాధాన్యమిస్తారని, అదే ఉత్తరాదిలో డైమండ్ పరిమాణానికి కొంత ఎక్కువ ప్రాధాన్యమిస్తుంటారని పేర్కొన్నారు. తమకు దక్షిణాది మార్కెట్లో అమ్మకాలు అత్యధికంగా ఉండగా, ఉత్తరాదిలో పుంజుకుంటున్నాయని మెహతా చెప్పారు.

అతి పెద్ద కేంద్రం..

డిబీర్స్‌కు ప్రపంచవ్యాప్తంగా మూడు (బ్రిటన్, బెల్జియం, భారత్) డైమండ్ ఇనిస్టిట్యూట్స్ ఉన్నాయి. వీటన్నింటిలోకెల్లా సూరత్‌లోని ఇనిస్టిట్యూట్ అతి పెద్దది. దీని ద్వారా డిబీర్స్ అధునాతన యంత్రాలు, నిపుణులతో డైమండ్ గ్రేడింగ్, టెస్టింగ్, ఇన్‌స్క్రిప్షన్ సేవలు అందిస్తోంది. 2015లో ప్రారంభించిన ఈ కేంద్రంపై దాదాపు 15 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. ఏడాదికి దాదాపు 10 లక్షల సర్టిఫికెషన్లు చేసే సామర్థ్యాలతో ఇది ఏర్పాటైంది.

బీ న్యూలో రియల్‌మీ 10 ప్రో సిరీస్ విడుదల



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చెయిన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రియల్‌మీ 10 ప్రో సిరీస్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రియల్‌మీ 10 ప్రో స్మార్ట్‌ఫోన్‌ను కంపెనీ సీఈవో సాయి నిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేష్‌లు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 150కి పైగా బీ న్యూ స్టోర్లలో ఈ మోడల్ ఫోన్లు అందుబాటులో ఉంటాయని సీఎండీ సాయి నిఖిలేష్ తెలిపారు. కర్వ్ డిస్‌ప్లే, 108 మెగా పిక్సెల్ కెమెరా, 5000ఎంఏహెచ్ బ్యాటరీ ఫీచర్స్‌తో వస్తున్న ఈ ఫోన్ల ధర రూ.18,999 నుండి 30వేల వరకు ఉంది. ఈ సిరీస్‌కు చెందిన అన్ని రకాల వేరియంట్లను నెలవారీ వాయిదా పద్ధతితో పాటు జీరో ఫైనాన్స్‌లోనూ కొనుగోలు చేయవచ్చు. ప్రారంభ ఈఎంఐ ధర రూ.1,899తో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిఖిలేష్ కోరారు.

ద్రవ్యోల్బణ గణాంకాలతో లాభాలు

- రెండో రోజూ ముందుకే
- సెన్సెక్స్ లాభం 145 పాయింట్లు
- 18,650 స్థాయి పైకి నిఫ్టీ
- ఎఫ్‌ఎంసీజీ షేర్లకు మాత్రమే నష్టాలు



ముంబై: రిటైల్ బాటలోనే టోకు ద్రవ్యోల్బణమూ దిగిరావడంతో దేశీయ స్టాక్ సూచీలు వరుసగా రెండోరోజూ లాభాలు గడించాయి. అమెరికాలోనూ ద్రవ్యోల్బణం దిగిరావడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచింది. అయితే ఫెడ్ రిజర్వ్ పాలసీ ప్రకటన(నేడు)కు ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో పరిమిత శ్రేణిలో కదలాడాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో సెన్సెక్స్ ఉదయం 153 పాయింట్ల లాభంతో 62,686 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ట్రేడింగ్‌లో 311 పాయింట్లు బలపడి 62,835 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 63 పాయింట్లు పెరిగి 18,671 వద్ద మొదలైంది. ఒక దశలో 88 పాయింట్లు ర్యాలీ చేసి 18,696 వద్ద గరిష్టాన్ని తాకింది. లాభాల దిశగా సాగుతున్న మార్కెట్లలో కొద్దిసేపు ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో గరిష్టాల వద్ద సూచీలు కొంత వెనక్కి తగ్గాయి. మార్కెట్ ముగిసేసరికి సెన్సెక్స్ 145 పాయింట్లు బలపడి 62,678 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 52 పాయింట్లు పెరిగి 18,660 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో, ఐటీ షేర్లకు డిమాండ్ నెలకొంది. ఒక్క ఎఫ్‌ఎంసీజీ షేర్లు మాత్రమే నష్టపోయాయి. విస్తృత స్థాయి మార్కెట్లో బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.68 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.60% చొప్పున ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.620 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.372 కోట్ల షేర్లను కొన్నారు. ద్రవ్యోల్బణ ఆందోళనలు తగ్గుముఖం పట్టడంతో పాటు ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో డాలర్‌తో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.49 వద్ద స్థిరపడింది. అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాల కంటే తక్కువగా నమోదవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- షేర్ల బైబ్యాక్ ప్రకటించిన పేటీఎం నిర్ణయానికి ఇన్వెస్టర్లు ప్రతికూలంగా స్పందించడంతో షేరు ధర 2% నష్టపోయి రూ.529 వద్ద స్థిరపడింది.
- వరుసగా నాలుగురోజుల దూసుకెళ్లిన యస్ బ్యాంక్ షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్‌ఈలో ఎనిమిది శాతం నష్టపోయి రూ. 22.10 వద్ద ముగిసింది.
- రెండోరోజు నాటికి అబాన్స్ హోల్డింగ్స్ ఐపీఓ 44 శాతం సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్యూఐబీ కోటాలో 2 రెట్లు, ఎన్‌ఐఐ నుంచి 14%, రిటైల్ విభాగం నుంచి 29 రెట్లు స్పందన లభించింది.

శూల వైన్‌యార్డ్స్ ఐపీవో ఓకే

చివరి రోజుకి 2.3 రెట్లు స్పందన

వివిధ బ్రాండ్లతో వైన్ పంపిణీ చేసే శూల వైన్‌యార్డ్స్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ చివరి రోజు బుధవారానికల్లా 2.33 రెట్లు అధిక స్పందన లభించింది. కంపెనీ 1,88,30,372 షేర్లను ఆఫర్ చేయగా.. 4,38,36,912 షేర్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. అర్హతగల కొనుగోలుదారుల(క్యూఐబీ) విభాగంలో 4.13 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 1.51 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు 1.65 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. షేరుకి రూ. 340–357 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 960 కోట్లను సమీకరించింది.

భవిత

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల ప్రత్యేకం-2022
ప్రముఖ సబ్జెక్ట్ నిపుణులు ప్రిపేర్ చేసిన 'తెలంగాణ హిస్టరీ ప్రాక్టీస్ టెస్టులు'

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్, మంగళగిరిలో వివిధ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
- **విభాగాలు:** హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూరాలజీ, ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/డీఎం/డీఎన్‌బీ/ఎండీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 45 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ.67,700 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- **ఇంటర్వ్యూ వేదిక:** ఎయిమ్స్, మంగళగిరి.
- **ఇంటర్వ్యూ తేది:** 29.12.2022
- **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 8.30 నుంచి
- వెబ్‌సైట్:www.aiimsmangalagiri.edu.in

ఐఏఎఫ్, ఓఝర్‌లో 108 అప్రెంటిస్‌లు

ఓఝర్(మహారాష్ట్ర)లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 108
- **ట్రేడులు:**మెషినిస్ట్, షీట్ మెటల్, వెల్డర్, మెకానిక్ రేడియో రాడార్ ఎయిర్‌క్రాఫ్ట్ లేదా ఎలక్ట్రానిక్ మెకానిక్,కార్పెంటర్,ఎలక్ట్రీషియన్ ఎయిర్‌క్రాఫ్ట్, ఫిట్టర్/మెకానిక్ మెషిన్ టూల్ మెయిటెనెన్స్.
- **అర్హత:** పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.04.2023కు 14 నుంచి 21 ఏళ్ల మధ్య ఉండాలి. • **స్టైపెండ్:** నెలకు రూ.8855.
- **ఎంపిక విధానం:** పదో తరగతి/12వ తరగతి/ఐటీఐ మార్కులు, ప్రాక్టికల్ ఎగ్జామ్ మార్కులు, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.01.2023
- **వెబ్‌సైట్:** http://apprenticeshipindia.gov.in

ఐఓసీఎల్, ముంబైలో 1746 అప్రెంటిస్‌లు

ముంబైలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ట్రేడ్/టెక్నీషియన్/గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:**1746; **తెలుగు రాష్ట్రాలలో ఖాళీలు:**తెలంగాణలో-53,ఆంధ్రప్రదేశ్‌లో-53.
- **విభాగాలు:** టెక్నీషియన్ అప్రెంటిస్-ఎలక్ట్రికల్, టెక్నీషియన్ అప్రెంటిస్-ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, ట్రేడ్ అప్రెంటిస్-ఫిట్టర్, ట్రేడ్ అప్రెంటిస్-ఎలక్ట్రీషియన్,ట్రేడ్ అప్రెంటిస్-ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ట్రేడ్ అప్రెంటిస్-మెషినిస్ట్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్,ట్రేడ్ అప్రెంటిస్-డేటా ఎంట్రీ ఆపరేటర్(ఫ్రెషర్స్),ట్రేడ్ అప్రెంటిస్-డేటా ఎంట్రీ ఆపరేటర్(స్కిల్ సర్టిఫికేట్ హోల్డర్లు)తదితరాలు.
- **అర్హత:** ట్రేడ్‌ను అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో మెట్రిక్యులేషన్ /ఐటీఐ/ఇంజనీరింగ్ డిగ్రీ/బీఏ/బీకామ్/బీఎస్సీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. • **వయసు:** 18 నుంచి 24 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 14.12.2022.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.01.2023
- **వెబ్‌సైట్:** www.iocl.com

సిడ్బీ, లక్నోలో 100 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ)..అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
- **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ/ఇంజనీరింగ్ డిగ్రీ/పీజీ డిగ్రీ (కామర్స్ /ఎకనామిక్స్ /మేనేజ్‌మెంట్ /సీఏ/సీఎస్/సీడబ్ల్యూఏ /సీఎఫ్ఏ/సీఎంఏ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 21 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**03.01.2023.
- **ఆన్‌లైన్ పరీక్ష:** జనవరి/ఫిబ్రవరి 2023.
- **ఇంటర్వ్యూ తేది:** ఫిబ్రవరి 2023.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు, రాజమండ్రి, గుంటూరు, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.
- **వెబ్‌సైట్:** www.sidbi.in

ఎంఎంఆర్‌సీ, ముంబైలో 18 పోస్టులు

ముంబైలోని ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఎంఆర్‌సీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
- **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్-01, డిప్యూటీ జనరల్ మేనేజర్-02, అసిస్టెంట్ జనరల్ మేనేజర్-04, డిప్యూటీ టౌన్ ప్లానర్-02, డిప్యూటీ ఇంజనీర్-05, అసిస్టెంట్ మేనేజర్-01, జూనియర్ ఇంజనీర్-03. • **విభాగాలు:** అకౌంట్స్, సిగ్నల్-టెలికామ్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, పీఎస్‌టీ, రోలింగ్ స్టాక్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ/డిప్లొమా/ఎంబీఏ/సీఏ/పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 35 నుంచి 55 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.35,280 నుంచి రూ.1.2లక్షలు చెల్లిస్తారు. • **ఎంపిక విధానం:** పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**18.01.2023.
- **వెబ్‌సైట్:** www.mmrcl.com

బీమా.. కెరీర్‌కు ధీమా

» విస్తరిస్తున్న బీమా రంగం
» పెరుగుతున్న ఉపాధి అవకాశాలు
» ప్రత్యేక కోర్సులతో కొలువులు ఖాయం
» అకడమిక్‌గా అందుకునేందుకు ఎన్నో మార్గాలు

ఇన్సూరెన్స్.. బీమా రంగంగా సుపరిచితం! లైఫ్ ఇన్సూరెన్స్ మొదలు.. నాన్-లైఫ్ ఇన్సూరెన్స్‌గా పేర్కొనే వెహికిల్, హెల్త్ ఇన్సూరెన్స్ వరకూ.. ఎన్నో బీమా పథకాలు! వీటికి పెరుగుతున్న ఆదరణ! ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి అనంతరకాలంలో బీమా పాలసీలు భారీగా పెరిగాయనే గణాంకాలు. దీంతో ఈ రంగం మరింతగా విస్తరించనుందనే అంచనాలు! ఫలితంగా బీమా రంగం యువతకు ఉపాధి అవకాశాలకు చక్కటి మార్గంగా నిలుస్తోంది!! ఈ నేపథ్యంలో.. ఇన్సూరెన్స్ రంగంలో తాజా ట్రెండ్స్, ఉపాధి మార్గాలు, అవసరమైన నైపుణ్యాలు, అకడమిక్ కోర్సులపై ప్రత్యేక కథనం..



కొత్తగా కెరీర్ ప్రారంభించిన వారు మొదలు మధ్య వయస్కుల వరకూ.. బీమా పాలసీలపై ఆసక్తి చూపుతున్నారు. ఇన్సూరెన్స్ అవసరాన్ని గుర్తించడమే ఇందుకు కారణం. ఫలితంగా ఈ రంగంలో కార్యకలాపాలు విస్తరిస్తూ..యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ముందంజలో నిలుస్తోంది అంటున్నారు నిపుణులు.

ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ గణాంకాల ప్రకారం-ప్రస్తుతం మన దేశంలో లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో 23, జనరల్(నాన్-లైఫ్) ఇన్సూరెన్స్ విభాగంలో 32, రీ-ఇన్సూరెన్స్ విభాగంలో 1, మొత్తం 56 సంస్థలు బీమా సేవలు అందిస్తున్నాయి.వీటి ద్వారా జీవిత బీమా, వాహన బీమా, ఆరోగ్య బీమా పాలసీలను అందిస్తున్నాయి. ఫలితంగా గత ఆర్థిక సంవత్సరంలో 40 బిలియన్ డాలర్ల వ్యాపారం ఒక్క లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలోనే జరిగింది. నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగాల్లో దాదాపు 30 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది.

భారీగా ఉద్యోగాలు

ఇన్సూరెన్స్ రంగం భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో వాటి సమర్థ నిర్వహణకు మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. 2021లో ఈ రంగంలో దాదాపు 8 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించింది. సీఐఐ అంచనా ప్రకారం-2025 నాటికి దాదాపు 20 లక్షల మందికి ఈ రంగం ఉపాధి కల్పించనుంది. అదే విధంగా ఎన్‌ఎస్‌డీసీ అంచనా ప్రకారం-2021 నాటికి ఎనిమిది నుంచి తొమ్మిది లక్షల మందికి ఉపాధి దక్కింది. పలు స్టాఫింగ్, రిక్రూటింగ్ సంస్థల గణాంకాల ప్రకారం-ఈ ఏడాది బీమా రంగంలో భారీ స్థాయిలో నియామకాలు జరిగాయి.

2032 నాటికి ఆరో పెద్ద దేశంగా

అంతర్జాతీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. 2032 నాటికి భారత బీమా రంగం ప్రీమియం మొత్తాల విషయంలో ఆరో పెద్ద దేశంగా నిలుస్తుందని స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ రీ-ఇన్సూరెన్స్ సంస్థ స్విస్ రె ప్రకటించింది. అంతే కాకుండా.. ఈ ఏడాది చివరికి 6.6 శాతం, 2023లో 7.1 శాతం వృద్ధి సాధిస్తుందని కూడా పేర్కొంది. దీనికి ప్రధాన కారణం.. బీమా రంగంలో కార్యకలాపాలు పెరగడం. ఫలితంగా ఈ రంగంలోని సంస్థలు వ్యాపార ప్రణాళికలను విస్తరిస్తూ.. కొత్త నియామకాలు చేపడుతున్నాయి.

ఇంటర్ టు ప్రొఫెషనల్

ఇన్సూరెన్స్ రంగంలో కొలువులకు ఇంటర్మీడియెట్ నుంచే అడుగులు వేసే అవకాశం ఉంది. ఈ రంగంలో స్పెషలైజ్డ్ ప్రొఫెషనల్స్ అవసరం కూడా పెరుగుతోంది. వేతనాలు ఆయా జాబ్ ప్రొఫైల్‌ను బట్టి నెలకు రూ.పది వేల నుంచి రూ.లక్ష వరకు లభిస్తున్నాయి.

సీఆర్‌ఎం

ఇన్సూరెన్స్ రంగంలో క్షేత్ర స్థాయిలో పాలసీదారులతో సంప్రదించే వారే.. కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్(సీఆర్‌ఎం).వ్యక్తులకు బీమా ఆవశ్యకత తెలియజేయడం,వారితో పాలసీలు కట్టించడం వీరి ముఖ్యమైన విధి. కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్.. పార్ట్ టైమ్,ఫుల్‌టైమ్ రెండు విధానాల్లోనూ పనిచేసే అవకాశం ఉంది.వీరు కట్టించిన పాలసీలు,ప్రీమియంను పరిగణనలోకి తీసుకొని..అయిదు నుంచి 30శాతం వరకూ కమిషన్ రూపంలో బీమా సంస్థలు చెల్లిస్తున్నాయి.ఫుల్‌టైమ్ విధానంలో నెలకు రూ. 20 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉంది.

డెవలప్‌మెంట్ ఆఫీసర్/సీఆర్ హెడ్

డెవలప్‌మెంట్ ఆఫీసర్ లేదా సీఆర్‌ఎం హెడ్‌లు.. సీఆర్‌ఎంల విధులను పర్యవేక్షించడం, వారికి ఏవైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి వ్యక్తులను మెప్పించి.. ఇన్సూరెన్స్ తీసుకునేలా చేయడం వీరి ముఖ్య విధిగా ఉంటోంది. డిగ్రీ అర్హతతో భర్తీ చేసే ఈ కొలువులకు నెలకు రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు వేతనం లభిస్తుంది.

యాక్చుయరీ ఎగ్జిక్యూటివ్స్

బీమా సంస్థల్లో అత్యంత కీలకమైన హోదా.. యాక్చుయరీ ఎగ్జిక్యూటివ్. ఒక వ్యక్తి తీసుకునే పాలసీ మొత్తం, దాని ఆధారంగా చెల్లించాల్సిన ప్రీమియం, ఎంత కాలానికైతే అతనికి ప్రీమియం చెల్లించే సామర్థ్యం ఉంటుంది? వంటి అంశాలను వీరు లెక్కిస్తారు. దీని ఆధారంగానే సంస్థలు కొత్త పాలసీలను ప్రవేశ పెట్టినప్పుడు పాలసీ వ్యవధి, వయో వర్గం వారీగా చెల్లించాల్సిన ప్రీమియం, ఇన్సూరెన్స్ మొత్తం వంటి వాటిని తెలియజేస్తాయి. అందుకే యాక్చుయరీ ఎగ్జిక్యూటివ్స్‌కు తప్పనిసరిగా.. యాక్చుయేరియల్ సొసైటీ నుంచి సర్టిఫికెట్ పొందాలనే నిబంధన అమల్లో ఉంది. బీకాం, ఎంకాం గ్రాడ్యుయేట్లకు ఈ సొసైటీలో పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత సొసైటీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే.. యాక్చుయేరియల్ సొసైటీ మెంబర్‌గా గుర్తింపు లభిస్తుంది. ఆ గుర్తింపు ఉంటే బీమా సంస్థల్లో ప్రారంభంలోనే నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనంతో కొలువు దక్కించుకునే అవకాశం ఉంది.

అండర్ రైటర్స్

ఒక పాలసీ ప్రతిపాదన వచ్చినప్పుడు దాన్ని క్షుణ్నంగా పరిశీలించి.. ఆ పాలసీకి సదరు వ్యక్తి సరితూగుతాడో లేదో నిర్ణయించే వారే అండర్ రైటర్స్. ఈ విభాగంలో ప్రత్యేక అర్హత ఉన్న వారికే సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అందించే అసోసియేట్ డిప్లొమా ఉత్తీర్ణులకు బీమా సంస్థలు పెద్దపీట వేస్తున్నాయి. వీరికి నెలకు రూ.40వేల వరకు వేతనం లభిస్తోంది.

రిస్క్ అనలిస్ట్స్

జనరల్ ఇన్సూరెన్స్ పాలసీల విషయంలో రిస్క్ అనలిస్ట్‌లు కీలకంగా వ్యవహరిస్తారు. ఏదైనా ఒక నిర్మాణానికి పాలసీ కోసం ప్రతిపాదించినప్పుడు.. ఆ నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించడం, దాని నాణ్యత, లైఫ్‌టైమ్ వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని.. వాటికి సంబంధించిన నివేదికను సంస్థకు అందించేది రిస్క్ అనలిస్ట్‌లే. ఈ నివేదిక ఆధారంగానే సదరు నిర్మాణానికి సంబంధించి పాలసీ మొత్తం పరంగా సంస్థ ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుంది. వీరు ఎక్కువగా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

క్లెయిమ్స్ ఎగ్జిక్యూటివ్స్

పాలసీ క్లెయిమ్‌ల పరిష్కారంలో వీరి పాత్ర కీలకం. ముఖ్యంగా పాలసీ వ్యవధి పూర్తి కాకుండానే ఏదైనా ఘటన జరిగి.. బీమా చెల్లించాల్సిన సందర్భంలో క్లెయిమ్స్ ఎగ్జిక్యూటివ్స్ ఇచ్చే నివేదికపై ఆధారపడి సంస్థలు తుది నిర్ణయం తీసుకుంటాయి. సదరు బీమా మొత్తం కోసం వచ్చిన ప్రతిపాదనను పరిశీలించి.. డ్యామేజ్ విలువను లెక్కిస్తారు. ఆ మొత్తానికి బీమా పరిష్కారం లభిస్తుంది. వీరికి నెలకు రూ.40వేల వరకు వేతనం లభిస్తుంది.

టెక్ జాబ్స్

ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా బీమా సంస్థలు టెక్నాలజీ ఆధారంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఇన్సూరెన్స్ సంస్థల్లో టెక్నికల్ ఉద్యోగాలు కూడా లభిస్తున్నాయి. ఇటీవల కాలంలో సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ విధానాలను అనుసరిస్తున్నాయి. దీంతో ఏఐ అనలిస్ట్స్; డేటా అనలిస్ట్ వంటి కొలువులు లభిస్తున్నాయి. వీటితోపాటు సంస్థల్లో అనుసరిస్తున్న సాంకేతిక సదుపాయాల నిర్వహణకు నెట్‌వర్క్ ఇంజనీర్స్, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ఇంజనీర్స్, ట్రబుల్ షూటర్స్ వంటి కొలువులను భర్తీ చేస్తున్నాయి. ఈ ఉద్యోగాలకు సంబంధిత విభాగాల్లో బీటెక్ లేదా స్పెషలైజ్డ్ సర్టిఫికేషన్ పొందిన వారికి సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి.

నియామకాలు ఇలా

స్పెషలైజ్డ్ హోదాలుగా పేర్కొనే రిస్క్ అనలిస్ట్, అండర్ రైటర్స్, క్లెయిమ్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల భర్తీకి ఇన్సూరెన్స్ కోర్సులను అందిస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లలో క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాయి. టెక్నికల్ ఉద్యోగాల కోసం ఐఐటీలు, ఇతర ప్రముఖ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లను సంప్రదిస్తున్నాయి. మిగతా నియామకాల విషయంలో ప్రైవేట్ బీమా సంస్థలు అధిక శాతం జాబ్ కన్సల్టెన్సీలపై ఆధారపడుతున్నాయి.

ప్రభుత్వ రంగ సంస్థల్లో

- ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎల్ఐసీ, యునైటెడ్ ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ల కోసం ప్రత్యేక నియామక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాయి.
- ఇన్సూరెన్స్ స్పెషలైజ్డ్ కోర్సులు అభ్యసించిన వారికి ఇన్సూరెన్స్ సంస్థలే కాకుండా.. ఇతర రంగాల్లోని కంపెనీల్లోనూ అవకాశాలు లభిస్తున్నాయి. థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్స్, మ్యూచువల్ ఫండ్ సంస్థలు, ఇన్సూరెన్స్ సంస్థలతో ఒప్పందం ద్వారా పరోక్షంగా ఆ సేవలందించే బ్యాంకులు, బీపీఓలు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లోనూ కొలువులు సొంతం చేసుకోవచ్చు.

అకడమిక్ వేదికలు

ఇన్సూరెన్స్ రంగ సంబంధిత నైపుణ్యాలు అందించేందుకు పలు ఇన్‌స్టిట్యూట్‌లు కోర్సులను అందుబాటులోకి వచ్చాయి. ▪ నేషనల్ ఇన్సూరెన్స్ అకాడెమీ-పుణె; ▪ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్-హైదరాబాద్; -ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ తోపాటు ఐఐఎం వంటి పలు బీ-స్కూల్స్ ఎంబీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఇన్సూరెన్స్ స్పెషలైజేషన్స్‌ను అందిస్తున్నాయి.

ఏపీ ఇన్ పార్లమెంట్

ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్ ప్రతిపాదన లేదు

రాజ్యసభ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి ప్రతిమా భౌమిక్ సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: విద్య, ఉపాధి రంగాల్లో ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని సామాజిక కేంద్ర న్యాయశాఖ సహాయమంత్రి ప్రతిమా భౌమిక్ చెప్పారు. ఇందిరా సహానీ కేసులో సుప్రీం కోర్టు తీర్పునకు లోబడి ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో కలిపి మొత్తం 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. జనాభా ప్రాతిపదికపై ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలంటూ దేశవ్యాప్తంగా వివిధ వ్యక్తులు, సంస్థల నుంచి ప్రభుత్వానికి వినతులు అందుతున్నట్లు తెలిపారు.

ఏపీలో మూడు రూర్బన్ మిషన్ క్లస్టర్ల అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్‌లోని అరకులోయ, ఏలూరు, రంపచోడవరం క్లస్టర్లను శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద ఎంపిక చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ మిషన్ కింద 21 విభాగాల్లో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల గురించి వివరించారు. గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం, అగ్రి సర్వీసెస్ ప్రాసెసింగ్, విద్య, స్వయం సహాయక బృందాల ఏర్పాటుతో ఉపాధి కల్పన, ఆరోగ్య, వివిధ గ్రామాలను రోడ్లతో అనుసంధానం చేయడం, గ్రామాలకు పైపులతో తాగునీటి వసతి కల్పించడం, గ్రామీణ గృహనిర్మాణం, ప్రజారవాణా సౌకర్యాల కల్పన, సామాజిక మౌలిక వసతుల కల్పన, పర్యాటక ప్రోత్సాహం, గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వీధిదీపాల ఏర్పాటు వంటి ప్రాజెక్టులను ఈ క్లస్టర్లలో చేపట్టినట్లు వివరించారు.

ఆర్బిట్రేషన్ వ్యవస్థ స్వయంప్రతిపత్తితో పనిచేయాలి



ఆర్బిట్రేషన్ (మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించుకోవడం) ప్రక్రియలో న్యాయవ్యవస్థ జోక్యం తగ్గించి ఆర్బిట్రేషన్ సెంటర్ వీలైనంత స్వయంప్రతిపత్తి కలిగి ఉండేలా చట్టాన్ని రూపొందించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కోరారు. రాజ్యసభలో 'ద న్యూఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్' సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సవరణ బిల్లు ద్వారా న్యూఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌ను ఇండియా ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌గా మార్చే ప్రతిపాదనను స్వాగతించారు. ఇప్పటివరకు నగరాలకు మాత్రమే పరిమితమైన ఆర్బిట్రేషన్‌ను దేశవ్యాప్తం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని అభినందించారు. సవరణ బిల్లులో పొందుపరచాలంటూ ప్రభుత్వానికి నాలుగు ముఖ్యమైన సూచనలు చేశారు. ఆర్బిట్రేటర్ నియామకంలో కోర్టు జాప్యం కారణంగా కక్షిదారులకు ఖర్చులు అధికం అవుతున్నాయని, దీనివల్ల తాత్కాలిక ఆర్బిట్రేషన్లలో ఆర్బిట్రేటర్లను నియమించే అధికారం సంపూర్ణంగా ఇండియా ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ కలిగి ఉండేలా చూడాలని సూచించారు. దీనివల్ల ఆర్బిట్రేషన్ ప్రక్రియలో న్యాయవ్యవస్థ జోక్యం తగ్గి ఆర్బిట్రేషన్ వ్యవస్థ స్వయంప్రతిపత్తి పెరుగుతుందని చెప్పారు. ఆర్బిట్రేషన్ కేసుల్లో అధికశాతం రిటైర్డ్ జడ్జీలను ఆర్బిట్రేటర్లుగా నియమించడం ఆందోళనకరమైన విషయమన్నారు. న్యాయవ్యవస్థలో ఉండే దీర్ఘకాల వాయిదాల పర్వం ఈ ప్రక్రియలోను మొదలయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. 'నేటి చీఫ్ జస్టిస్ రేపటి ఆర్బిట్రేటర్' అనే నానుడి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. న్యాయవృత్తిలో నైపుణ్యం ఉన్నవారితో ఆర్బిట్రేటర్ సమాజం బలపడేలా చూడాలని కోరారు. అర్హులైన నిపుణులు మాత్రమే ఆర్బిట్రేషన్ సెంటర్‌లో పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్బిట్రేషన్ సెంటర్లకు సింగపూర్, హాంగ్‌కాంగ్‌ల మాదిరి అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా నిధులు ఖర్చుచేయాలని సూచించారు. ఈ బిల్లు ద్వారా దేశంలో స్నేహపూరితమైన ఆర్బిట్రేషన్ వాతావరణం నెలకొల్పుతున్నట్లు అంతర్జాతీయ సమాజానికి స్పష్టమైన సందేశం పంపించినట్లు అవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ఈ బిల్లును స్వాగతిస్తూ మద్దతు ఇస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఏపీ కొత్త జిల్లాల్లో ఓఎస్‌సీల ప్రతిపాదన వచ్చింది

ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లో వన్ స్టాప్ సెంటర్లు (ఓఎస్‌సీలు) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిందని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. పాత 13 జిల్లాల్లో 14 ఓఎస్‌సీ కేంద్రాలను అనుమతించామని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

3,753 పోస్టులు ఖాళీ



కేంద్ర ఉన్నత విద్యాసంస్థల్లో 3,753 బ్యాక్‌లాగ్ ఫ్యాకల్టీ పోస్టులు భర్తీచేయాల్సి ఉందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుభాష్ సర్కార్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం నిబంధనల అమలు వివిధ దశల్లో..

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లోని అనేక నిబంధనలు అమలు చేశామని, మిగిలిన నిబంధనల అమలు వివిధ దశల్లో ఉన్నట్లు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. నిబంధనల అమలు పురోగతిని సమీక్షిస్తున్నామని, ఇప్పటివరకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులతో 29 సమీక్ష సమావేశాలు జరిగాయని బీజేపీ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు ప్రశ్నకు బదులిచ్చారు.

దిశ బిల్లుకు చట్టరూపం కల్పించాలి

లోక్‌సభ

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అనూరాధ డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: మహిళలు, చిన్నారులపై లైంగిక నేరాల కేసుల్లో సత్వర న్యాయం నిమిత్తం ఆంధ్రప్రదేశ్ శాసనసభ 2019లో తీర్మానం చేసిన దిశ బిల్లుకు చట్టరూపం కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆమె మాట్లాడుతూ ఇలాంటి కేసుల్లో సత్వర న్యాయం, కఠినశిక్షల నిమిత్తం ప్రత్యేక కోర్టుల ఏర్పాటును బిల్లులో పొందుపరిచారని తెలిపారు. సమర్థమైన న్యాయబట్వాడా వ్యవస్థ ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని, ఈ మేరకు దిశ బిల్లుకు చట్టరూపం కల్పించాలని కోరారు. బిల్లు హోంశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు.

ఏపీలో పెరుగుతున్న పత్తి ఉత్పత్తి

ఆంధ్రప్రదేశ్‌లో 2020–21తో పోలిస్తే 2022–23లో పత్తి ఉత్పత్తి పెరిగిందని కేంద్ర జౌళిశాఖ సహాయమంత్రి దర్శన జర్దోష్ తెలిపారు. 2020–21లో 16 లక్షల బేళ్లు, 2021–22లో 17.08 లక్షల బేళ్లు, 2022–23లో (తాత్కాలికంగా) 17.85 లక్షల బేళ్ల ఉత్పత్తి అయినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

వివిధ స్థాయిల్లో 31 రైల్వే ప్రాజెక్టులు



ఆంధ్రప్రదేశ్‌లో 31 రైల్వే ప్రాజెక్టులు వివిధ స్థాయిల్లో ఉన్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇవి రూ.70,594 కోట్ల విలువైన 16 కొత్త లైన్లు, 15 డబ్లింగ్ పనులకు సంబంధించిన ప్రాజెక్టులని వైఎస్సార్‌సీపీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

'గిరిజన' బిల్లుకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు

లోక్‌సభలో గిరిజనులకు సంబంధించి కేంద్రం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గురుమూర్తి చెప్పారు. ఈ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.

పీహెచ్‌డీ ఇక.. ఆషామాషీ కాదు



విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో పరిశోధన కోర్సుల నిర్వహణ నిబంధనలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మరింత కఠినతరం చేసింది. పరిశోధనల్లో సమగ్రత లేమి, నాణ్యతారహితంగా థీసెస్‌ల రూపకల్పన, ఏళ్ల తరబడి కొనసాగింపు వంటి విమర్శలు కొన్నేళ్లుగా వెల్లువెత్తుతున్న నేపథ్యంలో యూజీసీ పీహెచ్‌డీ కోర్సుల నిబంధనలను సవరించింది. ఈ మేరకు ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఆ నోటిఫికేషన్ ప్రకారం..

\- సాక్షి, అమరావతి

నిబంధనలు సవరించిన యూజీసీ.. కనీస కాలవ్యవధి మూడేళ్లు.. మరో మూడేళ్లు గరిష్ట పొడిగింపు

- పీజీలో 55 శాతం మార్కులు, ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత తప్పనిసరి
- రీసెర్చి సూపర్‌వైజర్లు, కో సూపర్‌వైజర్లకు అర్హతల నిర్దేశం
- పరిశోధన సంతృప్తికరంగా లేకపోతే మధ్యలోనే రద్దు
- థీసెస్‌పై అంతర్గత మూల్యాంకనంతోపాటు ఇతరులతోనూ పరిశీలన
- ఏ ఒక్కరు ఆమోదించకపోయినా.. థీసెస్ తిరస్కరణ
- వర్సిటీలు సహా పీజీ కాలేజీల్లోనూ పీహెచ్‌డీ కోర్సులు



నిర్దిష్ట కాలపరిమితి

- ప్రవేశం పొందిన రోజునుంచి కనీసం మూడేళ్లలో.. గరిష్టంగా ఆరేళ్లలో పూర్తిచేయాలి.
- ఆయా సంస్థల నిబంధనలను అనుసరించి గడువును అదనంగా రెండేళ్ల వరకు పొడిగించవచ్చు.
- 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యమున్న వారికి మరో రెండేళ్ల గడువు ఇవ్వవచ్చు. గరిష్టంగా పదేళ్లకు మించి గడువు ఇవ్వరాదు.
- మహిళలకు 240 రోజులు ప్రసూతి, శిశుసంరక్షణ సెలవులు ఇస్తారు.

ప్రవేశాలనుంచే పకడ్బందీ చర్యలు

- అభ్యర్థులు నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ, ఒక ఏడాది మాస్టర్ డిగ్రీ, లేదా మూడేళ్ల డిగ్రీ, రెండేళ్ల పీజీచేసిన వారు 55 శాతం మార్కులు సాధించి ఉంటేనే పీహెచ్‌డీ కోర్సుల్లో చేరడానికి అర్హులు. విదేశీ విద్యార్థులకైనా దీనికి సమాన ప్రమాణార్హతలుండాలి.
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ (నాన్–క్రీమీలేయర్), విభిన్న ప్రతిభావంతులు, ఆర్థికంగా వెనుకబడినవర్గాలు (ఈడబ్ల్యూఎస్) తదితర కేటగిరీల అభ్యర్థులకు ఐదుశాతం మార్కుల సడలింపు ఇవ్వవచ్చు.
- గతంలో ఎంఫిల్ పూర్తిచేసి ఇప్పుడు పీహెచ్‌డీ కోర్సుల్లో చేరాలనుకునేవారికి కూడా 55% మార్కులు ఉండాలి. గ్రేడింగ్ విధానం అమల్లో ఉన్న విద్యాసంస్థల అభ్యర్థులకు పాయింట్ల స్కేల్‌లో సమానమైన గ్రేడ్ ఉండాలి.

ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారానే ప్రవేశాలు

- ప్రత్యేక ప్రవేశపరీక్షల ద్వారానే ప్రవేశాలు చేపట్టాలి.
- యూజీసీ, ఇతర సంబంధిత అధీకృత ఉన్నతసంస్థల మార్గదర్శకాలననుసరించి రిజర్వేషన్లను పాటించాలి.
- యూజీసీ–నెట్, యూజీసీ–సీఎస్ఐఆర్, నెట్, గేట్, సీఈఈడీ ఫెలోషిప్, స్కాలర్‌షిప్‌లకు అర్హతపొందిన వారికి ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పించవచ్చు. లేదా ఆయా వర్సిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలు ప్రవేశపరీక్షలు నిర్వహించి చేర్చుకోవచ్చు.
- ఎంట్రన్స్ టెస్ట్ సిలబస్‌లో 50 శాతం రీసెర్చ్ మెథడాలజీ, 50 శాతం సబ్జెక్టు ఉండాలి. ప్రవేశపరీక్షలో 50 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి.
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ (నాన్–క్రీమీలేయర్), విభిన్న ప్రతిభావంతులు, ఈడబ్ల్యూఎస్ తదితర కేటగిరీల అభ్యర్థులకు 5 శాతం మార్కుల సడలింపు ఇవ్వవచ్చు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలు కల్పించాలి.
- ప్రవేశపరీక్ష మార్కులకు 70 శాతం, ఇంటర్వ్యూలకు 30 శాతం వెయిటేజీ ఇచ్చి అర్హులను ఎంపికచేయాలి.
- మౌలిక సదుపాయాలు, తగినంతమంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉంటే ప్రైవేటు పీజీ కాలేజీలు కూడా పీహెచ్‌డీ కోర్సులను అమలు చేయవచ్చు.

అడ్వయిజరీ కమిటీతో నిత్యం పరిశీలన

- ప్రతి వర్సిటీలో ఒక సీనియర్ ప్రొఫెసర్ కన్వీనర్‌గా యూనివర్సిటీ రీసెర్చి అడ్వయిజరీ కమిటీ ఏర్పాటుచేయాలి. ఈ కమిటీ రీసెర్చి ప్రతిపాదనలను పరిశీలించి టాపిక్‌ను నిర్ణయిస్తుంది. పరిశోధన పద్ధతి, మెథడాలజీలను పరిశీలిస్తుంది. పరిశోధన కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది.
- అభ్యర్థి తన పరిశోధనపై ప్రతి సెమిస్టర్‌కు ఈ కమిటీకి సంక్షిప్త నివేదిక ఇవ్వాలి. ఈ కమిటీ.. వర్సిటీ లేదా సంస్థకు పరిశోధనపై పురోగతి నివేదిక ఇవ్వాలి.
- పరిశోధన సంతృప్తికరంగా లేకపోతే అభ్యర్థికి కమిటీ సూచనలివ్వాలి. ఆ సూచనల ప్రకారం పరిశోధన చేయలేకపోతే ఆ పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసేలా కమిటీ సిఫార్సు చేస్తుంది.
- అభ్యర్థి థీసెస్‌ను సమర్పించేముందు దానిపై అడ్వయిజరీ కమిటీ, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు, పీహెచ్‌డీ అభ్యర్థుల సమక్షంలో ప్రెజెంటేషన్ ఇవ్వాలి.

థీసెస్ సంతృప్తికరంగా లేకపోతే తిరస్కరణ, పీహెచ్‌డీకి అనర్హత

- ఆయా ఉన్నత విద్యాసంస్థలు థీసెస్‌ను ప్లాగరిజం (కాపీకొట్టడం) కనిపెట్టేందుకు నిర్దేశించిన సాఫ్ట్‌వేర్ ఉపయోగించి పరిశీలించాలి.
- కాపీకొట్టలేదని, ఇంకెక్కడా సమర్పించలేదని అభ్యర్థి అండర్‌టేకింగ్ తీసుకుని పర్యవేక్షకుల సంతకాలతో థీసెస్‌ను అనుమతించాలి.
- తరువాత పర్యవేక్షకుడితోపాటు ఆయా రంగాల్లో పబ్లికేషన్లలో నిష్ణాతులైన ఇద్దరు బయటి నిపుణులతో అభ్యర్థిని పరిశీలన చేయించాలి. వీలైతే అందులో ఒకరు విదేశీ నిపుణులై ఉండాలి.
- బయటి నిపుణుల్లో ఏ ఒక్కరైనా థీసెస్‌ను రిజెక్టు చేస్తే ప్రత్యామ్నాయంగా మరో బయటి నిపుణుడి పరిశీలనకు పంపించాలి. అతను సంతృప్తి చెందితే.. ఫ్యాకల్టీ, పీహెచ్‌డీ స్కాలర్ల సమక్షంలో వైవా నిర్వహించాలి.
- ప్రత్యామ్నాయ పరిశీలకుడు థీసెస్‌ను ఆమోదించకపోతే దాన్ని ఆ ఉన్నత విద్యాసంస్థ తిరస్కరిస్తుంది. ఆ అభ్యర్థిని పీహెచ్‌డీ అవార్డుకు అనర్హుడిగా ప్రకటిస్తుంది.
- పీహెచ్‌డీ అవార్డు ప్రక్రియను ఆయా సంస్థలు ఆరునెలల్లో పూర్తిచేయాలి.
- థీసెస్ సంతృప్తికరంగా ఉండి పీహెచ్‌డీ అవార్డుకు అర్హత సాధించినవారికి దాన్ని జారీచేసేముందు ఆయా విద్యాసంస్థలు ఆ థీసెస్ సాఫ్ట్‌కాపీ (ఎలక్ట్రానిక్ కాపీ) ఇతర సంస్థలకు అందుబాటులోకి వచ్చేలా యూజీసీ ఆధ్వర్యంలోని ఇన్‌ఫ్లిబినెట్ (ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్)కు సమర్పించాలి.

అదనపు అర్హతలుంటేనే పర్యవేక్షణ బాధ్యత

- పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్ లేదా సూపర్‌వైజర్, సహ సూపర్‌వైజర్లుగా నియమితులయ్యేవారికి నిర్దేశిత అర్హతలు ఉండాలి.
- వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల్లోని రెగ్యులర్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు ఐదు, అసిస్టెంటు ప్రొఫెసర్లకు మూడు రీసెర్చి పబ్లికేషన్లు ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమై ఉంటేనే గైడ్‌లుగా నియమించాలి.
- ఇతర సంస్థల్లో గైడ్‌గా వ్యవహరించేవారికి బాధ్యత ఇవ్వరాదు. అలాంటి వారిని కో సూపర్‌వైజర్‌గా నియమించవచ్చు.
- ఇతర సంస్థల నిపుణుల పర్యవేక్షణలోని పరిశోధనలకు పీహెచ్‌డీలను ప్రదానం చేయడం నిబంధనలకు విరుద్ధం.
- ప్రొఫెసర్ ఎనిమిదిమందికి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆరుగురికి, అసిస్టెంటు ప్రొఫెసర్ నలుగురికి పర్యవేక్షకులుగా ఉండవచ్చు.
- మహిళలు పెళ్లి, ఇతర కారణాలవల్ల అదే పరిశోధనను ఇతర విద్యాసంస్థల్లోకి మార్చుకోవచ్చు.
- అభ్యర్థులు తమ పరిశోధనతోపాటు ఆ అంశంపై విద్యాబోధన, రచన అంశాలపైనా శిక్షణ పొందాలి. ట్యుటోరియల్, లేబొరేటరీ వర్కు, మూల్యాంకనాలతోసహా వారానికి నాలుగు నుంచి ఆరుగంటలు బోధన, పరిశోధన అసిస్టెంట్‌షిప్‌లలో పాల్గొనాలి.
- థీసెస్ సమర్పించాలంటే యూజీసీ నిర్దేశించిన 10 పాయింట్ల ప్రామాణికాల్లో 55 శాతం పాయింట్లు సాధించాలి.

మా ఆదేశాలకు విరుద్ధంగా నిర్మాణాలెందుకు జరిగాయి?

- కోర్టు ముందు స్వయంగా హాజరై వివరణ ఇవ్వండి
- సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల నిర్మాణాలను తొలగించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించి వాటి నిర్మాణాలను కొనసాగించడంపై హైకోర్టు మండిపడింది. దీనిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని ఆదేశించింది. ఇందుకు గాను పూర్తి వివరాలతో ఈ నెల 22న స్వయంగా తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. పాఠశాలల్లో బోధన వాతావరణం చెడిపోకూడదన్న ఉద్దేశంతోనే పాఠశాలల ప్రాంగణాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల నిర్మాణాలను చేపట్టవద్దని ఆదేశించామని, అయినా కూడా ఆ నిర్మాణాలను కొనసాగించడమంటే తమ ఆదేశాలను ఉల్లంఘించడమేనని న్యాయమూర్తి తెలిపారు. తమ ఆదేశాలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలు అక్రమ నిర్మాణాలే అవుతాయన్నారు. ఆ నిర్మాణాలకు చేసిన చెల్లింపులు సైతం అక్రమ చెల్లింపులేనని చెప్పారు. వాటిని సంబంధిత అధికారుల నుంచి రాబట్టేందుకు ఆదేశాలిస్తామన్నారు. అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారం పలు శాఖలతో ముడిపడి ఉందని, అందువల్ల కోర్టు ఆదేశాల అమల్లో కొంత జాప్యం జరిగిందని వివరించారు. 239 పాఠశాలల్లో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల నిర్మాణం చేపట్టామని, అందులో 63 పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో ఉన్నట్టు తెలిపారు. నిర్మాణాలకు ఇప్పటికే రూ.40 కోట్లు చెల్లించామని, మిగిలిన పనులకు రూ.22 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. నిర్మాణాలు పూర్తయితే ఆ భవనాలను పాఠశాలల అవసరాల కోసం వినియోగించుకోవచ్చని, అవి ఎంత మాత్రమూ వృథాగా ఉండవన్నారు.

పుంగనూరు ఆవులకు ప్రతిష్టాత్మక అవార్డు



సాక్షి, అమరావతి: అంతరించిపోతున్న పుంగనూరు జాతి ఆవుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగా పలమనేరులోని పుంగనూరు పరిశోధనా కేంద్రానికి బ్రీడ్ కన్జర్వేషన్ అవార్డు–2022 లభించింది. జాతీయ స్థాయిలో అరుదైన, అంతరించిపోతున్న జాతుల పరిరక్షణకు కృషి చేసే సంస్థలకు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఏటా ఈ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఈ నెల 23న కిసాన్ దివస్ సందర్భంగా న్యూఢిల్లీలో జరుగనున్న కార్యక్రమంలో ఈ అవార్డు కింద ప్రత్యేక ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతిని ప్రదానం చేయనున్నారు.

ఏపీకి ప్రత్యేకం

ప్రపంచంలోనే అత్యంత పొట్టివైన పుంగనూరు జాతి పశువులు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకం. కేవలం 3 అడుగుల పొడవు మాత్రమే పెరిగే ఈ జాతి పశువులు రెడ్, బ్రౌన్, బ్లాక్, తెల్లటి రంగుల్లో తోక నేల భాగాన్ని తాకే విధంగా ఉంటాయి. ఏడాదికి సగటున 5 నుంచి 8 శాతం కొవ్వుతో 500 కేజీల వరకు పాల దిగుబడి ఇస్తాయి. 'మిషన్ పుంగనూర్' కింద ఈ జాతి పశువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లతో కార్యాచరణ రూపొందించింది. ప్రభుత్వ కృషి ఫలితంగా గడచిన మూడేళ్లలో 176 పుంగనూరు దూడలు జన్మించాయి. ప్రస్తుతం రీసెర్చ్ స్టేషన్‌లో 268 పుంగనూరు జాతి పశువులు ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఈ ఏడాది నాలుగు కేటగిరీలలో బ్రీడ్ కన్జర్వేషన్ అవార్డులను ఐసీఎఆర్ ప్రకటించగా, కేటిల్ కేటగిరీలో పుంగనూరు జాతికి ఈ అవార్డు లభించింది. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డుతో పుంగనూరు జాతి పరిరక్షణకు ఐసీఏఆర్ కూడా అవసరమైన చేయూత ఇచ్చేందుకు మార్గం సుగమమైందని రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వేణు 'సాక్షి'కి తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.